

'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15
సంచిక: 189

గురువారం 29-9-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సోనోవిజన్‌లో కొనుగోలుదారుల సందడి

దసరాకు సోనోవిజన్ అందించే డిస్కౌంట్ సేల్‌ను ఈ సంవత్సరం ప్రజలు అనూహ్యంగా ఆదరిస్తున్నారు. ముఖ్యంగా సోనోవిజన్‌లో లభించే స్క్రాచ్ కార్డ్ స్కీమ్ అందరిని ఆకట్టుకుంటుంది. మాములు డిస్కౌంట్‌తో పాటు కార్డ్ స్క్రాచ్ చేయగా మినిమం 6% పైన కొంతమందికి మరింత ఎక్కువ పర్సంటేజ్ డిస్కౌంట్ రావడంపై కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరియు క్యాష్ బ్యాక్ ఆఫర్స్‌లో 22.5% వరకు అదనంగా డిస్కౌంట్ లభించడం వలన కొనుగోలుదారులకు లాభదాయకంగా ఉంది.



దసరా శుభాకాంక్షలతో...
సోనోవిజన్ దసరా సేల్
Lowest Prices GUARANTEED Best Service
LG Life's Good 190 Cm (75") UHD LED EMI : 4999/-
SAMSUNG 165 Cm (65") QLED EMI : 3990/-
LG Life's Good 139 Cm (55") OLED EMI : 3999/-
SAMSUNG 139 Cm (55") 4K Smart LED EMI : 2990/-
SONY 138 Cm (55") Ultra HD 4K Anroid EMI : 2995/-
SONY 108 Cm (43") 4K Anroid EMI : 1850/-
LG Life's Good 108 Cm (43") 4K Smart LED EMI : 1999/-
Panasonic 108 Cm (43") Smart LED EMI : 2414/-
SAMSUNG 80 Cm (32") Smart LED EMI : 1400/-
LLOYD 108 Cm (43") Smart LED EMI : 1034/-
TCL 80 Cm (32") Smart LED EMI : 1000/-
SONY Sound Bar EMI : 1044/-
iPhone 14 Pro Book Now 4000/- Cash Back 24/0 Scheme Available Selected Bank Cards
iPhone 13 3000/- Cash Back 24/0 Scheme Available Selected Bank Cards
iPhone Watch 12/0 Scheme Available
SAMSUNG S-22 Ultra Mobile, S-22 Ultra Watch 5000/- | 8000/- Cash Back 9/0 Scheme Available
SAMSUNG A-73 5G Ram Expandable 9/0 Scheme Available
vivo V-25 PRO - 5G Y75 - 5G Ram Expandable 10/3 Scheme 15/5 Scheme Available
ONEPLUS 5G Ram Expandable 9/0 Scheme Available
oppo 12 GB Ram, 256 GB Rom. 9/1 Scheme 12/4 Scheme Available
realme 5G Ram Expandable 9/0 Scheme Available Selected Models
hp 12/4 Scheme Available
DELL 15/4 Scheme Available
ASUS 12/4 Scheme Available
Lenovo 12/4 Scheme Available
MacBook 24/0 Scheme Available
LG Life's Good Side by Side 694 Ltrs Refrigerator FREE Small Refrigerator EMI : 13,540/-
SAMSUNG Side by Side 700 Ltrs Refrigerator EMI : 7234/-
Whirlpool Frost Free Double Door 260 Ltrs Refrigerator EMI : 2000/-
VOLTAS beko Direct Cool Single Door 190 Ltrs Refrigerator EMI : 1050/-
Haier 256 Ltrs BMR Refrigerator EMI : 2267/-
LLOYD Frost Free Double Door 276 Ltrs Refrigerator EMI : 1991/-
Haier Side by Side 682 Ltrs Refrigerator EMI : 5250/-
LLOYD Side by Side 590 Ltrs Refrigerator EMI : 4792/-
SAMSUNG Frost Free Double Door 253 Ltrs Refrigerator EMI : 1986/-
Godrej Direct Cool Single Door 190 Ltrs Refrigerator EMI : 1160/-
LG Life's Good Direct Cool Single Door 215 Ltrs Refrigerator EMI : 1559/-
Haier Direct Cool Single Door 190 Ltrs Refrigerator EMI : 1025/-
Chest Freezer 230 Ltrs EMI:1700/-
LG Life's Good Front Load Washing Machine 10.5 KGS EMI : 5667/-
SAMSUNG Front Load Washing Machine 9 KGS EMI : 3325/-
BOSCH Front Load Washing Machine 6 KGS EMI : 2475/-
IFB WDR Front Load Washing Machine 6 KGS EMI : 2334/-
LLOYD Front Load Washing Machine 6 KGS EMI : 1959/-
LG Life's Good Top Load Washing Machine 7.5 KGS EMI : 1575/-
SAMSUNG Top Load Washing Machine 6.5 KGS EMI : 1342/-
BOSCH Top Load Washing Machine 6.5 KGS EMI : 1459/-
IFB Top Load Washing Machine 6.5 KGS EMI : 1650/-
Whirlpool Top Load Washing Machine 7.0 KGS EMI : 1792/-
LLOYD Semi Automatic Washing Machine 6.5 KGS EMI : 767/-
LG Life's Good 10 Years Compressor WARRANTY 5 Years PCB WARRANTY Starting EMI : 2917/-
SAMSUNG Starting EMI : 2917/-
VOLTAS Starting EMI : 2875/-
LLOYD Starting EMI : 2875/-
HITACHI Starting EMI : 2917/-
DAIKIN Starting EMI : 3250/-
Convection Microwave Oven Rs : 10,500/- Onwards
Microwave Oven Rs : 5800/- Onwards
Chimney Rs : 7100/- Onwards
2 Burner Glass Manual Gas Stove Rs : 2700/- Onwards
Water Dispenser Rs : 8200/- Onwards
Water Purifier RO Rs : 12900/- Onwards
Water Geyser Rs : 3300/- Onwards
Wet Grinder Rs : 3200/- Onwards
Rice Cooker Rs : 1700/- Onwards
Mixer Rs : 2500/- Onwards
* T & C Apply
LED, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్, A.C లకు సోనోవిజన్ కొనుగోలుదారులకు ప్రత్యేకమైన ఎక్స్‌టెండెడ్ వారంటీ
LG SAMSUNG SONY Haier Whirlpool LLOYD Panasonic Godrej DAIKIN HITACHI VOLTAS Carrier IFB BOSCH BAJAJ
VOLTAS beko TCL V-GUARD Amirthaa Preethi EUREKA FORBES KENT ULTRA Butterfly FABER Crompton KEELINE AO Smith hp vivo oppo iPhone ONEPLUS ONIDA morphy richards


'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 189

గురువారం 29-9-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




ఆరంభం అదిరింది

తొలి టీ20లో దక్షిణాఫ్రికాపై భారత్ ఘన విజయం.. రాణించిన అర్ష్‌దీప్ - 12లో



ఆరో రోజూ ఆగని అమ్మకాలు


509 పాయింట్లు పతనమై 56,598కి చేరిన సెన్సెక్స్ - 13లో



'పాపులర్ ఫ్రంట్'పై నిషేధం

దేశ భద్రతకు విఘాతం కలిగిస్తోందంటూ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా, దాని అను బంధ సంస్థలపై కేంద్రం నిషేధం విధించింది.

వివరాలు 6లో



కాంగ్రెస్ అధ్యక్ష బరిలో దిగ్విజయ్!

కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ఎన్నిక బరిలో సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ పేరు తెరపైకి వచ్చింది.


వివరాలు 6లో



సీడీఎస్‌గా చౌహాన్

దేశ రెండో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్(రిటైర్డ్) అనిల్ చౌహాన్‌ను నియమించినట్లు రక్షణ శాఖ ప్రకటించింది.

వివరాలు 6లో



వేగంగా అమెరికా వీసాలు

భారతీయులకు అమెరికా వీసాల వేగవం తానికి చర్యలు తీసుకుంటామని అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ చెప్పారు.

వివరాలు 6లో

జనంలోనే ఉండాలి

ఎమ్మెల్యేలు వారానికి 4 రోజులు కచ్చితంగా ప్రజల్లోనే గడపాలి: సీఎం జగన్

బంధువులు, కుటుంబ సభ్యులు కాదు.. గడప గడపకు మీరే స్వయంగా వెళ్లాలి

- ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరించాలి
- పరీక్ష రాసేటప్పుడు షార్ట్ కట్స్ ఉండవు
- ఎన్నికల హామీల్లో 98.4 శాతం అమలు చేశాం.. డీబీటీతో రూ.1.71 లక్షల కోట్లను ప్రజలకు పారదర్శకంగా అందించాం
- రాష్ట్రంలో 87 శాతం కుటుంబాలకు సంక్షేమ ఫలాలను చేరవేశాం
- హామీలను నెరవేర్చాం.. ప్రతి ఇంటికీ మేలు చేశాం
- ఆశీర్వదించాలని ప్రజల్లోకి వెళ్తున్న ఏకైక ప్రభుత్వం దేశ చరిత్రలో మనదే
- గడప గడపకూ వంద శాతం నిర్వహిస్తే 175 సీట్లనూ క్లీన్ స్వీప్ చేస్తాం
- గడప గడపకూ వర్క్ షాప్‌లో సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం



నంద్యాల జిల్లా కల్వటాలలో రామ్‌కో సిమెంట్స్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్. చిత్రంలో మంత్రులు, రామ్‌కో ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు తదితరులు

సాక్షి, అమరావతి: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు తమ సచివాలయాల పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లాలని, ప్రతి ఒకరినీ కలుసుకుంటూ వారంలో నాలుగు రోజుల పాటు ప్రజల మధ్యే గడపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు. చిత్తశుద్ధితో, అంకిత భావంతో దీన్ని నిర్వహించాలని సూచించారు. బుధవారం తాడే పల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్లు, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు..

మిగతా 2వ పేజీలో ▶

పరిశ్రమలకు బెస్ట్.. ఏపీ 2లో

రామ్‌కో సిమెంట్స్ ప్రారంభోత్సవంలో సీఎం

రెండవ రోజూ దేవదేవుడి సేవలో సీఎం

నూతన పరకామణి భవనాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

2లో

పట్టాలు తప్పి పిచ్చి రాతలు!

రైల్వే జోన్‌పై చర్చించని కేంద్ర హోంశాఖ.. అసలు అజెండాలోనే లేదు



■ విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుపై పచ్చ పత్రి కలు పట్టాలు తప్పాయి. విభజన సమస్య లపై కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా అధ్యక్షతన ఢిల్లీలో మంగళవారం నిర్వ హించిన అజెండాలో అసలు రైల్వే జోన్ అంశమే లేదు. అజెండాలో లేని అంశాన్ని చర్చించినట్లుగా, రైల్వే జోన్ ఏర్పాటు సా ధ్యం కాదని కేంద్రం తేల్చేసినట్లు ఈనాడు, ఆంధ్రజ్యోతి కూడబలుక్కుని తప్పుడు రాతలు రాశాయి. తద్వారా రాష్ట్ర ప్రభు త్వంపై బురదజల్లాలన్నది వాటి పన్నాగం. దీనిపై వైఎస్సార్‌సీపీ నేత విజయసాయి రెడ్డి దీటుగా స్పందించారు. రైల్వే జోన్ రాక పోతే తన పదవికి రాజీనామా చేస్తానని, వస్తే ఈనాడు, ఆంధ్రజ్యోతిని మాకు రాసి స్తారా? అని సవాల్ విసిరారు. బీజేపీ ఎంపీ జీవీఎల్ స్పందిస్తూ.. రైల్వే జోన్ కచ్చి తంగా ఏర్పాటవుతుందన్నారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఢిల్లీలో మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్ పనులు శరవేగంగా సాగు తున్నాయని.. కొన్ని పత్రికలు సృష్టిస్తున్న వదంతులు నమ్మవద్దన్నారు.

రైల్వే జోన్ రాకుంటే రాజీనామా చేస్తా

- వస్తే ఈనాడు, ఆంధ్రజ్యోతిని మాకు రాసిస్తారా?.. రామోజీ, రాధాకృష్ణకు వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి సవాల్
- కేంద్రం నిర్వహించిన భేటీలో విశాఖ రైల్వే జోన్ చర్చకే రాలేదు
- కులోన్మాదంతో తప్పుడు రాతలు
- అవాస్తవం అని తేలితే బహిరంగ క్షమాపణలు చెబుతారా?
- రైల్వే జోన్ కోసం వైఎస్సార్‌సీపీ అలుపులేని పోరాటం

10లో

విశాఖ రైల్వే జోన్‌కు కట్టుబడి ఉన్నాం



- వదంతులు నమ్మొద్దు.. జోన్ ఏర్పాటు పురోగతిలో ఉంది
- మాటిమాటికి ఎందుకు వదంతులు సృష్టిస్తున్నారో అర్థం కావట్లేదు: కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్

10లో

ఆ పత్రికలది దుష్ప్రచారం

- బీజేపీ ఎంపీ జీవీఎల్ ఆగ్రహం
- నిజనిర్ధారణ చేసుకొని కథనాలు రాయాలని హితవు

10లో

న్యూస్‌రీల్

చిన్నశేష వాహనంపై శేషాద్రివాసుడు



తిరుమల బ్రహ్మోత్సవాల్లో మలయప్పస్వామి చిన్న శేష వాహనంపై బద్రి నారాయణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మరోవైపు బెజవాడ కనకదుర్గమ్మ గాయత్రీదేవి అలంకారంలో, శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబాదేవి చంద్రఘంట అలంకారంలో భక్తులను అనుగ్రహించారు.

వివరాలు 5లో ▸

రక్షణరంగంలో రూ.8,431 కోట్ల ఎగుమతులు



రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్‌తో విప్లవాత్మక మార్పులు వచ్చాయని రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి చెప్పారు. 2014–15 నాటికి రూ.2 వేల కోట్ల కంటే తక్కువలో ఉన్న రక్షణ ఎగుమతులు రూ.8,431 కోట్లకు చేరుకున్నాయన్నారు.

వివరాలు 5లో ▸

కేంద్ర ఉద్యోగులకు 4 శాతం డీఏ పెంపు



కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దసరా కానుక లభించింది. కరువు భత్యాన్ని 4 శాతం పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ పెరుగుదల జూలై 1 నుంచి అమల్లోకి తీసుకురానున్నారు.

వివరాలు 6లో ▸

కృష్ణ సతీమణి ఇందిరా దేవి కన్నుమూత



ప్రముఖ సినీ నటుడు, సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ సతీమణి, హీరో మహేష్‌బాబు తల్లి ఇందిరాదేవి(70) కన్నుమూశారు. అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆమె తుది శ్వాస విడిచారు.

వివరాలు 3లో ▸

ఇదండీ సంగతి



మూడు రాజధానులు ఉండాల్సిందే

- లేదంటే ఉత్తరాంధ్ర జిల్లాలతో రాష్ట్రం ఏర్పాటు చేయండి
- ఉత్తరాంధ్రపై చంద్రబాబు విషం కక్కుతున్నారు.. వికేంద్రీకరణ పరిరక్షణ వేదిక ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న వికేంద్రీకరణ పరిరక్షణ వేదిక నాయకులు

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): 'రాష్ట్రం సొమ్మంతా తీసుకెళ్లి హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారు. చివరకు కట్టుబట్టలతో పంపారు. సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ అన్ని జిల్లాలు అభివృద్ధి చెందాలన్న ఉద్దేశంతో మూడు రాజధానులు ప్రకటిస్తే.. చంద్రబాబు మాత్రం తన స్వార్థ రాజకీయాల కోసం అమరావతే రాజధాని అంటూ ప్రాంతాల మధ్య చిచ్చు రేపుతున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలను అవమానిస్తున్నారు..' అని వికేంద్రీకరణ పరిరక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాకా సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.ఎ.డి.పాల్ మండిపడ్డారు. విశాఖలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రానికి మూడు రాజధానులు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. లేకపోతే ఉత్తరాంధ్ర జిల్లాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో ఏ ఒక్కరు ఆకలితో చనిపోకూడదని పేదలను ఆదుకుని దేశంలోనే ఉత్తమ సీఎంగా వైఎస్ జగన్ మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. పరిపాలన వికేంద్రీకరణ పేరిట

మిగతా 10వ పేజీలో ▶

విడాకులు తీసుకున్న ఒంటరి వ్యక్తులకు రైస్ కార్డు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అనర్హత (ఇన్ ఎలిజిబుల్) కారణంగా రైస్ కార్డు కోల్పోయిన వారు దరఖాస్తు చేసుకుంటే ఆరుదశల ధ్రువీకరణ (సిక్స్ స్టెప్ వెరిఫికేషన్) అనంతరం కొత్తకార్డు మంజూరుకు పౌరసరఫరాల శాఖ అవకాశం ఇచ్చింది. ఇందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో స్ప్లిట్ ఆప్షన్ తీసుకొచ్చింది. వీరితోపాటు విడాకులు తీసుకుని సంతానం లేని ఒంటరి వ్యక్తులు సైతం తగిన ధ్రువపత్రాలు సమర్పిస్తే రైస్ కార్డు ఇవ్వనుంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖతో సమన్వయం చేసుకుంటూ రైస్ కార్డుల దరఖాస్తులను స్వీకరించాలని గ్రామ, వార్డు సచివాలయ శాఖకు సూచించింది.

ఖనిజ లీజులకు దశలవారీగా ఈ–వేలం



■ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చిన్న తరహా ఖనిజాల తవ్వకాల కోసం గనులను లీజుకిచ్చేందుకు ప్రభుత్వం దశలవారీగా నిర్వహిస్తున్న ఈ–వేలం ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోంది. తొలి దశలో 35 లీజులకు ఈ–వేలం నిర్వహించగా.. రూ.16 కోట్ల ఆదాయం లభించింది. రెండో దశలో 27 లీజులకు ఈ–వేలం ప్రక్రియ చేపట్టింది. ఇప్పటి వరకు 20 లీజులకు వేలం పూర్తయ్యింది.


10లో

గుండెను గాబరా పెట్టొద్దు

- పెరుగుతున్న గుండె జబ్బులు
- పెద్దా చిన్నా తేడా లేదు.. అందరినీ కబళిస్తున్న గుండె జబ్బులు
- రాష్ట్రంలో 2020లో 60వేల మంది గుండె జబ్బుల కారణంగా మృతి
- చిన్న వయసు నుంచే జాగ్రత్తలు పాటిస్తే మంచిదంటున్న వైద్యులు

10లో

నేడు 'వరల్డ్ హార్ట్ డే'



పరిశ్రమల శాఖను అభినందించిన సీఎం జగన్



సాక్షి, అమరావతి: పోర్టు ఆధారిత మౌలిక వసతుల అభివృద్ధిలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా నిలవడం ద్వారా టైమ్స్ గ్రూపునకు చెందిన ఎకనామిక్ టైమ్స్ నుంచి అవార్డు అందుకున్న ఏపీ పరిశ్రమల శాఖను సీఎం వైఎస్ జగన్ అభినందించారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్న పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ బుధవారం సీఎంను కలిసి వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రిని సీఎం అభినందించారు.

రెండవ రోజూ
దేవదేవుడి సేవలో సీఎం

- ఇస్తికఫాల్ స్వాగతం.. పండితుల వేదాశీర్వచనం
- నూతన పరకామణి భవనాన్ని ప్రారంభించిన వైఎస్ జగన్



తిరుమలలో పరకామణి భవనాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



తిరుమలలో శ్రీవారి దర్శనానంతరం ఆశీర్వచనం అందుకుంటున్న సీఎం

సాక్షి ప్రతినిధి, తిరుపతి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం దేవదేవుడిని మరోమారు దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించి.. దర్శనానంతరం తిరుమలలోనే బసచేసిన సీఎం రెండవ రోజు శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. మహాద్వారం వద్ద ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి ఇస్తికఫాల్ (లడ్డు, చందనం) స్వాగతం పలికారు. ఆలయంలోకి ప్రవేశించిన వైఎస్ జగన్.. ధ్వజస్తంభానికి నమస్కరించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్, ఈఓ తీర్థ ప్రసాదాలు, శ్రీవారి చిత్రపటాన్ని అందించారు.

అత్యాధునిక పరకామణి భవనం ప్రారంభం

స్వామి వారిని దర్శించుకున్న అనంతరం సీఎం మాఢవీధుల్లో కాలినడకన తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం మీదుగా పరకామణి భవనం వద్దకు బయలు దేరారు. ఆ సమయంలో పెద్ద సంఖ్యలో చేతులు ఊపుతూ కనిపించిన భక్తులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. రూ.23 కోట్లు వెచ్చించి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన పరకామణి భవనాన్ని ప్రారంభించారు. అనంతరం బాలాజీ నగర్ ప్రాంతంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సొంత నిధులతో నిర్మించిన విశ్రాంతి భవనాన్ని ప్రారంభించారు.

'ముక్తిస్థావరం' పుస్తకావిష్కరణ: శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి క్షేత్ర విశిష్టత, భక్త కన్నప్ప చరిత్ర, స్వర్ణముఖి నది విశిష్టత, పాతాళ వినాయకుని వైభవం, రాహుకేతు శాంతి, గర్భగుడి రహస్యాలు, ఆలయ శిల్పం, వాస్తు, స్వామి అమ్మవార్ల పురాతన ఆభరణాల చరిత్ర, ఆలయ గోడలపై చిత్రలేఖనం, పురాతన శాసనాలు, అనుబంధ ఆలయాల సమాచారం.. తదితర వివరాలతో ముద్రించిన 'ముక్తి స్థావరం' పుస్తకాన్ని సీఎం జగన్ ఆవిష్కరించారు. సీఎం వెంట ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి, కొట్టు సత్యనారాయణ, రోజా, ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, గురుమూర్తి, ఎమ్మెల్యేలు భూమన కరుణాకరరెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయండి



సీఎం వైఎస్ జగన్‌కు వినతిపత్రం ఇస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు సీఎం వైఎస్ జగన్‌ను కోరారు. రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం అనంతరం హెలిప్యాడ్‌లో ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం హైకోర్టును ఏర్పాటు చేయాలని, అమరావతి నుంచి కర్నూలుకు హైకోర్టు తరలించేవరకు ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు. సీఎంను కలిసిన వారిలో కృష్ణరంగడు, పుల్లారెడ్డి, జయరాజ్, ఓంకార్, రవిగువేరా, నరసింహ, లక్ష్మీనారాయణ ఉన్నారు.

జనంలోనే ఉండాలి





వర్క్ షాప్‌లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్లు, మంత్రులు, పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలతో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై నిర్వహించిన వర్క్ షాప్‌లో సీఎం జగన్ మాట్లాడారు. ఎన్నికలు ఇంకా 19 నెలలే మాత్రమే ఉన్నందున ఇప్పుడు ఎమ్మెల్యేలే స్వయంగా గడప గడపకూ వెళ్లాలని స్పష్టం చేశారు. కొందరు ఎమ్మెల్యేలు తమ బంధువులు, వారసులను ఈ కార్యక్రమానికి పంపుతూ ఇతర పనుల్లో నిమగ్నం కావడం సరి కాదన్నారు. ఎన్నికలకు ఆర్నెళ్ల ముందు నుంచి కుటుంబ సభ్యులు, బంధువులతో కలసి ఎమ్మెల్యేలు విస్తృతంగా పర్యటించాల్సి ఉన్నందున ఇప్పటి నుంచే వారిని కూడా వెంటబెట్టుకుని వెళ్లడం వల్ల ప్రజాసేవపై అవగాహన పెరుగుతుందన్నారు. కొందరు షెడ్యూల్ ప్రకారం పనిచేయడం లేదని, దీన్ని ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఎన్నికల హామీల్లో 98.4 శాతం అమలు చేశామని, సంక్షేమ పథకాల ద్వారా పారదర్శకంగా నేరుగా రూ.1.71 లక్షల కోట్లను ప్రజల ఖాతాల్లోకి జమ చేశామని సీఎం జగన్ గుర్తు చేశారు. ఎలాంటి వివక్ష, అవినీతికి తావివ్వకుండా రాష్ట్రంలో 87 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించామన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాం.. మీ ఇంటికి మేలు చేశాం.. ఆశీర్వదించండి అని కోరుతూ ప్రజల ముందుకు వెళ్తున్న ఏకైక ప్రభుత్వం దేశ రాజకీయ చరిత్రలో ఇదేనని చెప్పారు. గడప గడపకూ కార్యక్రమాన్ని వంద శాతం నిర్వహిస్తే 175 శాసనసభ స్థానాలనూ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమన్నారు. వర్క్ షాప్‌లో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

అన్నీ అనుకూలం..

గడప గడపకూ తలెత్తుకుని వెళ్లే పరిస్థితి మనకు ఉంది. ఎందుకంటే.. మనం చక్కటి పరిపాలన ప్రజలకు అందించాం. ఆ తర్వాతే ప్రతి గడపకూ వెళ్తున్నాం. ప్రతి ఇంటికీ ఏ మేలు జరిగింది? ఎంత జరిగింది? ఏ స్కీములందాయి? అనే జాబితాలు తీసుకుని వెళ్తున్నాం. ఈ మేరకు ప్రతి కుటుంబానికి లేఖ కూడా అందిస్తున్నాం. మతం, ప్రాంతం, రాజకీయాలు, పార్టీలు చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించాం. ఇచ్చిన హామీలను నెరవేర్చాం. ప్రతి ఇంట్లోనూ మన ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్నారు. ఇలాంటి సందర్భాలు చాలా అరుదు. గతంలో నాన్న (వైఎస్సార్) ప్రభుత్వ హయాంలో చూశాం. దానికంటే ఎక్కువగా ఇప్పుడు జరుగుతోంది. ఇంత సానుకూల పరిస్థితులను మనకు అనుకూలంగా మార్చుకోవడం అవసరం.

ప్రతి ఇంటికీ వెళ్లాల్సిందే...

ఒక సచివాలయానికి (గ్రామం) వెళ్లినప్పుడు 100 శాతం.. అంటే ప్రతి ఇంటికీ తప్పనిసరిగా వెళ్లాలి. లేఖ అందించి చేసిన మంచిని వివరించి, చేయనున్న మంచిని చెప్పి ఆశీర్వదించమని కోరాలి. అలా చేయకపోతే నష్టం జరుగుతుంది. ఒకసారి గ్రామ సచివాలయానికి వెళ్తే ఎన్ని రోజులైనా సరే మొత్తం అన్ని ఇళ్లకూ వెళ్లాలి. గడపగడపకూ కార్యక్రమాన్ని నిర్దేశించుకున్న విధంగా సంపూర్ణంగా పూర్తి చేయాలి. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు ఇస్తున్నాం. గ్రామానికి బాగా ఉపయోగపడే వాటిపై ఖర్చు చేయమన్నాం. గ్రామ సచివాలయాల్లో ఎమ్మెల్యే తిరిగినప్పుడు కేటాయించిన నిధుల ప్రకారం పనులు మంజూరు చేయాలి. గ్రామంలోకి వెళ్లినప్పుడు సమస్య మీ దృష్టికి రాగానే అప్పటికప్పుడే ఆ పని మంజూరు చేయాలి. ఆ సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలి. మొదటిసారి వర్క్‌షాప్‌తో పోలిస్తే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పురోగతి బాగుంది. కానీ అందరికీ ఒక విషయాన్ని సవినయంగా తెలియజేస్తున్నా. పరీక్ష రాసేటప్పుడు షార్ట్‌కట్స్ ఉండవు. వాటికి తావిస్తే ఫెయిల్ అవుతాం. ఇది చాలా ముఖ్యమైన విషయం. ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలి.

175కు 175 కొట్టాలి..

మళ్లీ చెబుతున్నా. నూటికి నూరు శాతం 175కి 175 కొట్టాలి. ఒక్క సీటు కూడా మిస్ కాకూడదు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికే గడప గడపకూ రూపంలో మీకు చక్కటి ప్రణాళిక ఇచ్చా. 175కు 175 సీట్లు సాధించడం అన్నది అసాధ్యం కానే కాదు. ముమ్మాటికీ ఇది సాధ్యం. మనసా వాచా, కర్మణా దీన్ని నమ్ముతున్నా కాబట్టి విశ్వాసంతో చెబుతున్నా. రాష్ట్రంలో 87 శాతం ఇళ్లకు మంచి జరిగింది. ప్రతి ఇంటికీ మంచి చేశామని లెటర్ తీసుకుని వెళ్తున్నాం. దీనికి స్పందనగా ప్రజలు ఆశీర్వదిస్తున్నారు. సచివాలయానికి వెళ్లేటప్పుడు ప్రాధాన్యతగా మీరు గుర్తించిన పనులు 2 నెలల్లో మొదలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రతి రోజూ పరీక్షలా సిద్ధం కావాలి

గడప గడపకూ కార్యక్రమం ఎందుకంటే రేపు మనల్ని మనం గెలిపించుకోవడం కోసం.. మనకు మనంగా చేస్తున్న కార్యక్రమం ఇది. దీంట్లో ఎక్కడైనా షార్ట్‌కట్స్ ఉపయోగిస్తే నష్టపోయేది మనమే. ఇవాళ్టి నుంచి చూస్తే ఎన్నికలకు బహుశా 19 నెలలు సమయం ఉంది. ప్రతిరోజూ పరీక్షలకు సిద్ధం అవుతున్నామని భావిస్తూ అంతా అడుగులు వేయాలి. అలా పని చేయకపోతే నష్టపోయేది మనమే. అందుకు మీరు చేయాల్సిందల్లా నెలలో కనీసం 16 రోజులు గడప గడపకూ కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలి. ఎన్నికలకు 19 నెలలు ఉంది. అంటే మనకు తగిన సమయం ఉంది. మనం చేయాల్సిందల్లా ప్రతి ఇంటికీ వెళ్లడం. తిరిగితేనే మన గ్రాఫ్ పెరుగుతుంది.

గేర్ మార్చడానికే...:

కొందరు తమ గ్రేడ్ పెంచుకోవాల్సి ఉంది. ప్రతి ఒక్కరితో నాకు సత్సంబంధాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరూ నాతో అడుగులు వేశారు. అందుకే ఎవరినీ పోగొట్టుకోవడం నాకిష్టం లేదు. వారి గేర్ మార్చడమే నా లక్ష్యం. ఎన్నికలకు 6 నెలల ముందు సర్వే చేయిస్తా. ప్రజాదరణ ఉంటేనే మళ్లీ టికెట్లు ఇస్తా. ఎందుకంటే మనల్ని నమ్ముకుని కోట్ల మంది ఉన్నారు. షార్ట్ కట్స్ లేకుండా 100 శాతం గడపగడపకూ పూర్తిచేయాలి. మీ తరఫు నుంచి ఇది జరిగితే క్లీన్‌స్వీప్ చేస్తాం. తిరిగి డిసెంబరు మొదటి రెండు వారాల్లో సమావేశం అవుదాం. అప్పటికి మనకు 70 రోజుల టైమ్ వస్తుంది. కాబట్టి నెలకు 16 రోజులు ప్రతి సచివాలయంలో ప్రతి ఇల్లు తిరగాలి. ప్రతి సచివాలయంలో కనీసం మూడు రోజులైనా ఉండాలి.

ప్రజలకు మంచి చేయడానికే..:

మనల్ని నమ్ముకుని కొన్ని కోట్ల మంది ప్రజలున్నారు. వారికి మనం జవాబుదారీగా ఉన్నాం. జుత్తు ఉంటే ముడేసుకోవచ్చు. అసలు జుత్తు లేకపోతే ముడేసుకోవడానికి ఏమీ ఉండదు. అధికారంలో ఉంటే ప్రజలకు మంచి చేయగలుగుతాం. 175కి 175 టార్గెట్ పెట్టుకున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ లక్ష్యం మిస్ కాకూడదు. దానికోసం అందరం కష్టపడదాం. రీజినల్ కోఆర్డినేటర్లు మరింత బాధ్యతగా ఉండాలి. గడప గడపకూ విషయంలో ఎవరైనా వెనకబడినట్లు ఉంటే ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి. వారికి మార్గనిర్దేశం చేయాలి.

రాజకీయం అనే జీవితాన్ని మనం ఎంచుకున్నాం. మీరు ఎమ్మెల్యేలుగా మళ్లీ గెలిస్తే ప్రజల్లో గౌరవాన్ని మరింత పెంచుతుంది. ఎమ్మెల్యేలుగా ఉన్న మీరు ఓడిపోతే గౌరవం తగ్గుతుంది. దేవుడి దయవల్ల మనకు అలాంటి పరిస్థితి లేదు. కష్టపడితే చాలు.. తిరిగి గెలుచుకుని రాగలుగుతాం. మన పాలన ద్వారా ప్రజలకు మంచి చేయగలిగిన కార్యక్రమాలన్నీ చేపట్టాం. మన గ్రాఫ్ పెంచుకోవడానికి ఇవి అస్త్రాలు, ఆయుధాల్లాంటివి. అవి మీ చేతుల్లో ఉన్నాయి. వాటిని వినియోగించుకోండి. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వంద శాతం నిర్వహిస్తే 175 శాసనసభ స్థానాలనూ క్లీన్ స్వీప్ చేయడం ఖాయం.



గడప గడపకూ వర్క్ షాప్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ప్రతి ఇల్లూ తిరగాలి... ప్రతి ఒక్కరినీ కలవాలి

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు, నియోజక వర్గ బాధ్యులు తమ సచివాలయాల పరిధిలో ప్రతి ఇల్లూ తిరగాలని, ప్రతి మనిషిని కలవాల్సిందేనని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారని మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య (నాని) తెలిపారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మొదటి సమీక్షతో పోలిస్తే రెండో సమీక్ష నాటికి పరిస్థితి మెరుగుపడిందని, మూడో సమీక్ష నాటికి మరింత మెరుగు కావాలని సూచించారన్నారు. కొందరు కేవలం ఒక్క గంట మాత్రమే వెళ్తున్నారని, దాన్ని పరిగణలోకి తీసుకోబోమని, ఆ సచివాలయాల పరిధిలో మళ్లీ తిరగాలని, లేదంటే నిధులు మంజూరు కావని హెచ్చరించారని తెలిపారు. 38 రోజులకు గాను 16 రోజులు మాత్రమే తిరిగిన వారిలో మార్పు రావాలని, మూడో సమీక్ష నాటి ఆ సంఖ్య సున్నాగా ఉండాలని నిర్దేశించారన్నారు.

– పేర్ని నాని, ఎమ్మెల్యే

వారానికి 4 రోజులు కచ్చితంగా ప్రజల్లోనే

గడప గడపకూ వెళ్లి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున ప్రతినిధులుగా నిలబడాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారని హోంశాఖ మంత్రి తానేటి వనిత తెలిపారు. బుధవారం జరిగిన వర్క్‌షాప్ అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. వారానికి నాలుగు రోజులు, నెలలో కచ్చితంగా 16 రోజులు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారన్నారు. కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు వారి కుమారులు, బంధువులను గడప గడపకూ కార్యక్రమానికి పంపిస్తున్నారని, అలా కాకుండా నియోజకవర్గ ఎమ్మెల్యేలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారన్నారు. చేశారన్నారు. ఎమ్మెల్యేలు ప్రజల మధ్యకు వెళ్తేనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు వీలుంటుందని చెప్పారన్నారు. గ్రామ సచివాలయ పరిధిలో సమస్యలను గుర్తించి తెలియచేస్తే వెంటనే నిధులు మంజూరు చేస్తామని సీఎం చెప్పారన్నారు.

– తానేటి వనిత, హోంమంత్రి

పరిశ్రమలకు బెస్ట్.. ఏపీ

రామ్‌కో సిమెంట్స్ ప్రారంభోత్సవంలో సీఎం వైఎస్ జగన్

- రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అత్యంత అనువైన పరిస్థితి
- విస్తృతంగా ఉద్యోగ, ఉపాధి కల్పనకు గ్రీన్ ఎనర్జీ రంగానికి ప్రోత్సాహం
- రూ.72,188 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలకు అనుమతులు
- ఈ ప్రాజెక్టుల వల్ల మూడు నాలుగేళ్లలో 20 వేల ఉద్యోగాలు
- రైతుల భూముల్లో విండ్, సోలార్ యూనిట్ల దిశగా అడుగులు
- 1,500 నుంచి 2 వేల ఎకరాలు ఒక క్లస్టర్‌గా ఏర్పాటవ్వాలి..
- ఏటా ఎకరానికి రూ.30 వేలు లీజు.. మూడేళ్లకోసారి 5 శాతం పెంపు
- ఎంఎస్ఎంఈలకు అన్ని విధాలా సహకరిస్తున్నాం..
- అందుకే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో రాష్ట్రానికి ప్రథమ స్థానం
- పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణంతో ఎగుమతుల పెంపుపై దృష్టి
- ఎక్కడా లేని విధంగా మూడు పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి



సాక్షి ప్రతినిధి, కర్నూలు: పారిశ్రామిక అభివృద్ధి, తద్వారా ఉద్యోగ అవకాశాల కల్పనపై ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళుతోందని, పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అన్ని విధాలా అనుకూలమని సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ప్రతి అంశంలో 'ఇండస్ట్రీ ఫ్రెండ్లీ'గా అడుగులు వేస్తూ.. గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు సహకరిస్తోందన్నారు. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కల్వటాలలో ఏర్పాటైన 'రామ్‌కో సిమెంట్స్' కర్మాగారాన్ని బుధవారం ఆయన ప్రజల సమక్షంలో బజర్ నొక్కి ప్రారంభించారు. అంతకు ముందు ఫ్యాక్టరీలోని పరికరాలు, టెక్నాలజీ, ఉత్పత్తి తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రామ్‌కో ఇండస్ట్రీ వల్ల మన ప్రాంతానికి, మనకు మంచి జరుగుతుందన్నారు. మన పిల్లలు ఎక్కడికో వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా ఇక్కడే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఈ ప్రాంతంలో లైమ్ స్టోన్ మైన్స్ ఉన్నప్పటికీ గతంలో ఎలాంటి పరిశ్రమలు లేవని.. ప్రస్తుతం ఇక్కడ 2 మిలియన్ టన్నుల క్లింకర్, 1.5 మిలియన్ టన్నుల గ్రైండింగ్ సామర్థ్యంతో ప్లాంట్ ఏర్పాటైందన్నారు. తద్వారా 3 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి అవుతుందని, ఇది తొలి దశ మాత్రమేనని.. రాబోయే రోజుల్లో యాజమాన్యం దీన్ని విస్తరిస్తుందని అన్నారు. తద్వారా ఈ ప్రాంతంలో మెరుగైన వసతులు వస్తాయని, సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ – సామాజిక బాధ్యత) వల్ల చుట్టుపక్కల గ్రామాలకు మంచి జరుగుతుందని తెలిపారు. 75 శాతం స్థానికులకే ఉద్యోగ అవకాశాలు ఉండాలని చట్టం చేయడం వల్ల మన పిల్లలకు మంచే జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

తొలిదశలో వెయ్యి మందికి ఉద్యోగాలు

- మన ప్రాంతంలో రామ్‌కో సిమెంట్‌ను స్థాపించిన వెంకట్రామరాజా అన్నకు మనస్ఫూర్తిగా అభినందనలు. రూ.2,500 కోట్ల పెట్టుబడితో స్థాపించిన ఈ ప్లాంటులో తొలి దశలో వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. 2019లో మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ఈ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమైంది. పనులు వేగంగా పూర్తి చేసింది.
- గొప్ప మార్పునకు ఈ ఫ్యాక్టరీ నిదర్శనం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు దీనికంటే మరొక ఉదాహరణ అవసరం లేదు. ఎమ్మెల్యే, కలెక్టర్ నుంచి నా వరకు అందరి సహకారంతో ఎలాంటి జాప్యం జరగకుండా 30 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేశారు.
- 1961లో రామ్‌కో సిమెంట్స్ ప్రస్థానం మొదలైంది. రోజుకు 200 టన్నులు అంటే ఏటా 0.4 మిలియన్ టన్నుల సామర్థ్యంతో మొదలు పెట్టిన ప్లాంటు ఈ రోజు 20 మిలియన్ టన్నుల సామర్థ్యం దాకా అడుగులు వేసింది. ప్రతిచోటా వీరి యూనిట్లు బాగా పని చేస్తున్నాయి. 5 చోట్ల ఉత్పత్తి యూనిట్లు.. మరికొన్ని చోట్ల గ్రైండింగ్ యూనిట్లు.. మొత్తం 11 యూనిట్లు ఉన్నాయి. అన్నిచోట్ల సామర్థ్యాన్ని పెంచుతూ పోతున్నారు. ఇక్కడ ప్రారంభమైన ప్లాంట్‌కు ఇకపై కూడా మనందరి సహకారం అందిస్తే త్వరితగతిన మరింత అభివృద్ధి, విస్తరణకు దోహదపడుతుంది.
- కొద్ది రోజుల కిందట గ్రీన్‌కో 5,400 మెగావాట్ల సామర్థ్యంతో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి, పంప్డ్ స్టోరేజ్‌తో చేపట్టిన రెన్యువబుల్ ఎనర్జీ ప్లాంటుకు పునాది రాయి వేశాను. ఈ ప్రాజెక్టు వల్ల కర్నూలు జిల్లాలో 2,600 ఉద్యోగాలు వస్తాయి. మన పిల్లలకు మేలు జరుగుతుంది.

ప్రభుత్వ సహకారం బావుందని వాళ్లే చెబుతున్నారు..

- ప్రతి అంశంలో 'ఇండస్ట్రీ ఫ్రెండ్లీ'గా రాష్ట్రం అడుగులు వేస్తోంది. ఇది చాలా కీలకం. ఈ మధ్య కాలంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో రాష్ట్రం వరుసగా మూడో ఏడాది కూడా దేశంలో మొదటి స్థానంలో నిలిచింది. పరిశ్రమల నిర్వాహకులతో ఇక్కడి పరిస్థితులపై అభిప్రాయాలు తీసుకుని మార్కులు వేస్తున్నారు. ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈలకు ఇస్తున్న సహాయం, ప్రోత్సాహకాలు కలిపి పరిశ్రమలకు రాష్ట్రం బాగా సహకరిస్తోందని పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు.
- మన రాష్ట్రం, ప్రభుత్వం ఇస్తున్న మద్దతు గురించి, చేయి పట్టుకుని నడిపిస్తున్న తీరు గురించి పారిశ్రామికవేత్తలు సంతృప్తిగా ఉన్నారు. కాబట్టి మనకు మొదటి స్థానం వచ్చింది. ఇది సువర్ణాక్షరాలతో లిఖించదగింది. 2021–22లో దేశంలో అత్యధిక గ్రోత్‌రేట్ 11.43 శాతంతో మనం మొదటి స్థానంలో ఉన్నాం. ఇది గొప్ప మార్పునకు అవకాశం. రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి మనమంతా మద్దతు ఇస్తున్నాం కాబట్టే ఇంతగా మంచి జరుగుతోంది.

రూ.1000 కోట్లతో గ్రాసిమ్ ఇండస్ట్రీ

- రాష్ట్రంలో ఇటీవలే రూ.1000 కోట్లతో గ్రాసిమ్ ఇండస్ట్రీని ప్రారంభించాం. దీనిని కుమార మంగళం బిర్లా ఏర్పాటు చేశారు. 1,150 ఉద్యోగాలు వచ్చాయి. అలాగే 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు ఇచ్చే అపాచీ ఫ్యాక్టరీని రూ.700 కోట్లతో చిత్తూరు, పులివెందులలో చేపట్టాం.
- దాదాపు రూ.1,700 కోట్ల పెట్టుబడితో టీసీఎల్ ప్యానల్ ఉత్పత్తి చేపడుతోంది. 3,100 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. విశాఖలో ఏటీసీ టైర్స్ దాదాపు రూ.2,200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 2 వేల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయి. రామాయపట్నం పోర్టుకు పునాది రాయి వేశాం.

ప్రతి 50 కిలోమీటర్లకు ఒక హార్బర్ లేదా పోర్టు

- ఇప్పటిదాకా రాష్ట్రంలో నాలుగు ప్రాంతాల్లో ఆరు పోర్టులు ఉన్నాయి. ఈ మూడేళ్లలో మరో నాలుగు పోర్టులు (రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ, భావనపాడు) నిర్మించేందుకు వేగంగా అడుగులు వేస్తున్నాం. తొమ్మిది ఫిషింగ్ హార్బర్‌లు తీసుకొస్తున్నాం. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక హార్బర్, పోర్టు ఉండేలా.. తద్వారా ఎగుమతులు పెంచేలా ప్రణాళికలు రచిస్తున్నాం.
- 2021–22లో రాష్ట్రం నుంచి రూ.1.70 లక్షల కోట్ల ఎగుమతులు ఉన్నాయి. దీన్ని రాబోయే ఐదేళ్లలో రూ. 3.40 లక్షల కోట్లకు పెంచేలా లక్ష్యంగా నిర్దేశించుకుని అడుగులు వేగంగా వేస్తున్నాం. దేశంలో ఎక్కడా జరగని విధంగా మూడు పారిశ్రామిక కారిడార్‌లు.. వైజాగ్–చెన్నై, చెన్నై–బెంగళూరు, హైదరాబాద్–బెంగళూరును అభివృద్ధి చేస్తున్నాం.
- వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో మెగా ఇండస్ట్రియల్ పార్క్, ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్, తిరుపతిలో మరో ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ప్రారంభిస్తున్నాం. ఇవన్నీ పూర్తయితే మన పిల్లలకు ఉద్యోగావకాశాలు విస్తృతమయ్యే పరిస్థితి వస్తుంది. మరిన్ని పరిశ్రమలు మన రాష్ట్రం వైపే చూసే పరిస్థితి వస్తుందని ఆశిస్తున్నా. పారిశ్రామికవేత్తలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అందుబాటులో ఉంటాం. పూర్తి సహకారం అందిస్తాం.
- ఈ కార్యక్రమంలో మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుడివాడ అమర్నాథ్, అంజాద్ బాషా, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీలు గంగుల ప్రభాకర్‌రెడ్డి, చల్లా భగీరథరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పాల్గొన్నారు.

> విస్తృతంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 'గ్రీన్ ఎనర్జీ'పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. రాయలసీమ ప్రాంతం ఇందుకు అనుకూలంగా ఉంది. ప్రస్తుతం రూ.72,188 కోట్ల పెట్టుబడులతో ఈ పరిశ్రమలకు అనుమతులు ఇచ్చాం. ఇప్పుడు ఇంకో అడుగు ముందుకు వేస్తూ రైతులు గ్రూపుగా ముందుకొస్తే వారి పొలాల్లో విండ్, సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఏటా ఎకరానికి రూ.30 వేల చొప్పున ప్రభుత్వం లీజు చెల్లిస్తుంది. తద్వారా రైతులకు నికర ఆదాయంతో పాటు వారి పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. - సీఎం వైఎస్ జగన్

భూమికి లీజు.. పిల్లలకు ఉద్యోగాలు

గ్రీన్ కోసాల్, ఆర్సిలర్ మిట్టల్, అరవిందో, అదానీ వాళ్లకు రూ.72,188 కోట్ల విలువైన ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చాం. 3–4 ఏళ్లలో ఆ ప్రాజెక్టులు పూర్తయితే 20 వేల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. వీటికి తోడు.. రైతులు ముందుకొస్తే ఎకరాకు ఏడాదికి రూ.30 వేల చొప్పున లీజు ఇచ్చేలా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది. 30.. 50.. ఎన్ని ఏళ్లయినా ఏటా లీజు డబ్బులు ఇస్తాం. మూడేళ్లకోసారి 5 శాతం లీజు పెంచుతాం. ఈ మేరకు అగ్రిమెంట్లు చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని ఒక ప్రాంతంలో కనీసం 1,500 నుంచి 2 వేల ఎకరాలు ఒక క్లస్టర్‌గా అందుబాటులో ఉండేలా చూస్తే.. రైతులు, గ్రామాలు ముందుకొస్తే ఆ భూముల్లో సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులు చేపడతాం. తద్వారా రైతులకు మేలు జరగడంతో పాటు వారి పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

మరింత అభివృద్ధి చేస్తాం

ఇక్కడ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు కలెక్టర్ నుంచి ముఖ్యమంత్రి వరకు పూర్తిగా సహకరించారు. వేగంగా పనులు పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభిస్తున్నాం. ఈ సందర్భంగా అందరికీ కృతజ్ఞతలు. ప్రభుత్వ సహకారంతో ప్లాంటును మరింత అభివృద్ధి చేస్తాం. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనలో మా వంతుగా సహకారం అందిస్తాం.

– వెంకట్రామ రాజా, రామ్‌కో ఎండీ

ల్యాండ్ ఆఫ్ ఆపర్చునిటీస్..

పారిశ్రామికంగా రాష్ట్రం మంచి పురోగతి సాధిస్తోంది. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం. రాష్ట్రంలో పరిశ్రమలు ఎలాంటి వాతావరణంలో నడుస్తున్నాయో చెప్పేందుకు 'ఈజ్ ఆఫ్ డూయింగ్'లో మనం ప్రథమ స్థానంలో ఉండటమే నిదర్శనం. ఏపీ 'ల్యాండ్ ఆఫ్ ఆపర్చునిటీస్' రాష్ట్రంగా ఉంది. సముద్ర తీరం, జాతీయ రహదారులు, పోర్టుల కనెక్టివిటీ లాంటి అంశాలు పరిశ్రమల రాక, అభివృద్ధికి దోహదపడుతున్నాయి. వీటన్నిటికీ తోడు గొప్ప ముఖ్యమంత్రి అండగా ఉండటం మన అదృష్టం. అనకాపల్లి నియోజకవర్గంలో కూడా రామ్‌కో ప్లాంటు ఉంది. ఇక్కడ మూడో ప్లాంట్ ప్రారంభోత్సవానికి రావడం పట్ల ఆనందంగా ఉంది.

– గుడివాడ అమర్నాథ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి

కృష్ణ సతీమణి ఇందిరాదేవి మృతి

- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు
- నివాళులర్పించిన సినీ ప్రముఖులు


కన్నీటి వీడ్కోలు పలుకుతున్న కృష్ణ, మహేష్‌బాబు

బంజారాహిల్స్/రాయదుర్గం: ప్రముఖ సినీ నటుడు సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ సతీమణి, హీరో మహేష్‌బాబు తల్లి ఇందిరా దేవి (70) కన్నుమూశారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఫిలింనగర్‌లోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. కొంత కాలంగా ఆమె చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు. గత వారం ఆమె అనారోగ్యంగా ఉండటంతో ఏఐజీ ఆసుపత్రిలో చేరారు. రెండు రోజుల తర్వాత కోలుకోవడంతో డిశ్చార్జ్ చేశారు. ఇంతలోనే ఆమె బుధవారం మృతి చెందారు. ఇందిరాదేవి పార్థివ దేహాన్ని ఫిలింనగర్‌లోని పద్మాలయ స్టూడియోస్ ఆవరణలో బంధుమిత్రులు, అభిమానుల సందర్శనార్థం ఉంచారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఆమె పార్థివ దేహం వద్ద నివాళులు అర్పించి మహేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కోడలు నమ్రతతోపాటు కుమార్తెలు మంజుల, ప్రియదర్శిని కన్నీటిపర్యంతమయ్యారు. నాయనమ్మ పార్థివ దేహం వద్ద మహేష్‌బాబు కూతురు సితార కన్నీరు మున్నీరుగా విలపించింది. ఏడాది కాలంలోనే సోదరుడు రమేష్‌బాబు, తల్లి మృతి చెందడంతో మహేష్ కుటుంబసభ్యులు మరింత దుఃఖసాగరంలో మునిగిపోయారు. ఇందిరాదేవి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించిన వారిలో మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, నటులు వెంకటేశ్, నాగార్జున, మోహన్‌బాబు, మురళీ మోహన్, విజయ్ దేవరకొండ, రానా, దర్శకులు సుకుమార్, త్రివిక్రమ్, బి.గోపాల్, కొరటాల శివ, కె.రాఘవేంద్రరావు తదితరులున్నారు.

ఆమె స్వస్థలం ముసలిమడుగు

బూర్గంపాడు: ఇందిరాదేవి సొంతూరు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని ముసలిమడుగు గ్రామం. కృష్ణ సినిమాల్లోకి రాక ముందే ఆమెను పెళ్లి చేసుకున్నారు. వీరికి రమేష్‌బాబు, పద్మావతి, మంజుల, మహేష్‌బాబు, ప్రియదర్శిని సంతానం. ఆమె పిల్లలతో తరచుగా ముసలిమడుగు వచ్చివెళ్లేవారు. ఇప్పటికీ ముసలిమడుగులో ఇందిరాదేవి పేరిట ఇల్లు ఉంది. పక్కనే ఉన్న లక్ష్మీపురం గ్రామంలో ఇందిరాదేవితోపాటు ఆమె కుమారులు, కుమార్తెల పేరిట వ్యవసాయ భూములున్నాయి. ఇందిరాదేవి పేరిట ఉన్న ఇంటి స్థానంలో భద్రాచలం వచ్చే భక్తుల కోసం వసతిగృహం నిర్మించాలని ఆమె కుటుంబ సభ్యులు యోచిస్తున్నట్లు సమాచారం.

మహాప్రస్థానంలో అంత్యక్రియలు

ఇందిరాదేవి అంతిమయాత్ర మధ్యాహ్నం బంధుమిత్రులు, అభిమానుల అశ్రునయనాల మధ్య మహాప్రస్థానం వరకు కొనసాగింది. ఆమె పార్థివదేహాన్ని పద్మాలయ స్టూడియోస్ నుంచి పూలతో అలంకరించిన వాహనంలో మహాప్రస్థానానికి తీసుకొచ్చారు. తల్లి అంత్యక్రియల క్రతువును మహేష్‌బాబు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్‌తోపాటు ఘట్టమనేని కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవల కోసం.. సెల్‌ఫోన్ కట్!

అక్టోబర్ 1 నుంచి పనివేళల్లో సెల్‌ఫోన్ వాడొద్దంటూ ఏపీసీపీడీసీఎల్ సీఎండీ ఆదేశాలు

సాక్షి, అమరావతి: విద్యుత్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు అదేపనిగా సెల్‌ఫోన్లు ఉపయోగిస్తూ పని గంటలు వృథా చేస్తున్నారని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మాజనార్దనరెడ్డికి పలువురు ఉన్నతాధికారులు, వినియోగదారులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సీఎండీ.. కార్యాలయాల పని వేళల్లో సెల్‌ఫోన్లు వాడొద్దంటూ ఉద్యోగులకు మెమో జారీ చేశారు. ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంతో పాటు జిల్లా స్థాయిలో ఆపరేషన్ సర్కిల్ కార్యాలయాల్లోనూ ఇవే నిబంధనలు అమలయ్యేలా ఉత్తర్వులు జారీ చేయాలని సూపరింటెండెంట్ ఇంజినీర్లను ఆదేశించారు. ఇటీవల ఏపీసీపీడీసీఎల్ సీఎండీ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో ఆయన మాట్లాడిన అంశాలను.. వాయిస్ రికార్డ్ చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. దీనిపై సీఎండీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి చర్యలతో పాటు కార్యాలయాల పనివేళల్లో సెల్‌ఫోన్లను విపరీతంగా ఉపయోగించడం వల్ల సంస్థ పనితీరుకు, అంతర్గత భద్రతకు, గోప్యతకు భంగం వాటిల్లే ప్రమాదముందని సీఎండీ భావించారు. అక్టోబరు 1 నుంచి పనివేళల్లో సెల్‌ఫోన్ వాడకూడదనే నిబంధనను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ రోజు నుంచి ఉద్యోగులు కార్యాలయానికి రాగానే తమ ఫోన్లను సెక్యూరిటీ వద్ద డిపాజిట్ చేసి రసీదు తీసుకోవాలి. భోజన విరామ సమయంలో ఫోన్లు వాడుకునే అవకాశమిచ్చారు. అత్యవసరంగా మాట్లాడాల్సి వస్తే.. ఉన్నతాధికారి ఫోన్‌ను ఉపయోగించుకోవచ్చు.

కోస్తాంధ్రపై ఉపరితల ఆవర్తనం

- రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు
- మూడురోజులు వర్షాలు కురుస్తాయి: ఐఎండీ

సాక్షి, అమరావతి/ సాక్షి, విశాఖపట్నం: పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రస్తుతం కోస్తాంధ్రపై ఆవరించి ఉంది. అదే సమయంలో ఉత్తర అండమాన్ నుంచి మధ్య బంగాళాఖాతం మీదుగా ఆంధ్రప్రదేశ్ తీరం వరకు తూర్పు–పశ్చిమ ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. వీటి ప్రభావంతో రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం రాత్రి ఓ నివేదికలో తెలిపింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఇప్పటికే రాష్ట్రంలో పలుచోట్ల విస్తారంగా వానలు కురుస్తున్నాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో కోస్తా జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఏలూరు, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, గుంటూరు, అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లోని పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. గడిచిన 24 గంటల్లో ఏలూరు జిల్లా కైకలూరు మండలం పల్లెవాడలో అత్యధికంగా 14.7 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మచిలీపట్నంలో 13.2, ఏలూరు జిల్లా చాత్రాయిలో 11.8, అల్లూరి జిల్లా అరకు వ్యాలీలో 7.9, బాపట్ల జిల్లా రేపల్లెలో 7.9, నంద్యాల జిల్లా కోయిలకుంట్లలో 7.8 సెంటీమీటర్ల వర్షం పడింది. నర్సీపట్నంలో 8 సెంటీమీటర్లు, ఎన్టీఆర్ జిల్లా కొర్లమండలో 7.6 సెంటీమీటర్లు, ఏలూరు జిల్లా టి నర్సాపురంలో 7.2, తూర్పుగోదావరి జిల్లా పోతవరంలో 6.6, విజయవాడలో 6.1, నంద్యాలలో 5.5 సెంటీమీటర్ల వర్షం పడింది.

- ప్రముఖ పాత్రికేయులు, ఏపీ రాష్ట్ర సమాచార హక్కు చట్టం పూర్వ కమిషనర్ పి.విజయబాబుకు గజ్జెల మల్లారెడ్డి జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేయనున్నట్లు వైవీయూ వీసీ, గజ్జెల మల్లారెడ్డి ట్రస్ట్ అధ్యక్షుడు ఆచార్య ఎం.సూర్యకళావతి బుధవారం తెలిపారు.

జాతీయ క్రీడా అవార్డులకు దరఖాస్తు గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: జాతీయ క్రీడా అవార్డులకు దరఖాస్తుల గడువును కేంద్రం అక్టోబర్ 1 వరకు పొడిగించింది. జాతీయ క్రీడా అవార్డుల్లో భాగంగా మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డు, ధ్యాన్ చంద్ జీవిత సాఫల్య, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ట్రోఫీ, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలను ప్రదానం చేయనుంది. అర్హులైన క్రీడాకారులు, కోచ్‌లు, వివిధ సంస్థలు, వర్సిటీలు స్వయంగా dbtyas&sports.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

నేడు ఆరు క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు

సివిల్ సర్వీసెస్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడా ఎంపిక పోటీల్లో భాగంగా గురువారం 6 విభాగాల్లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు శాప్ ఎండీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో హాకీ, వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, పవర్ లిఫ్టింగ్ ఎంపికలు జరుగుతాయన్నారు.

సుందరీకరణపైనా దుష్ప్రచారమేనా?

- గోడలమీద జాతీయ నాయకుల చిత్రాలపై టీడీపీ దుష్ప్రచారం
- ఖండించిన తిరుపతి కార్పొరేషన్
- పనులు పూర్తయ్యాక వచ్చి పరిశీలించాలని స్పష్టీకరణ
- అవాస్తవాలను ప్రచారం చేయొద్దని హితవు

సాక్షి, అమరావతి: నగరాలు, పట్టణాలను ఆహ్లాదకరంగా మర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన సుందరీకరణ పనులపైనా టీడీపీ దుష్ప్రచారం మొదలుపెట్టింది. రంగులు వెలసిన గోడల మీద జాతీయ నాయకులు చిత్రాలు గీయడంపై తప్పుడు ప్రచారం చేస్తోంది. పనులు సగం కూడా పూర్తవ్వకుండానే వాటిని వీడియోలు తీసి.. సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి బురద చల్లేందుకు ప్రయత్నించింది. జగనన్న హరిత నగరాల్లో భాగంగా 45 నగరాలు, పట్టణాల్లో మొక్కలు నాటడంతో పాటు జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లోని గోడలపై పెయింటింగ్స్ పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగా తిరుపతిలో కూడా గోడలపై చిత్రకారులు వివిధ రకాల రంగులతో జాతీయ నాయకుల చిత్రాలు, వివిధ కళాకృతులను తీర్చిదిద్దుతున్నారు. అయితే, కొందరు దురుద్దేశంతో పనులు సగంలో ఉండగానే వాటిని ఫొటోలు, వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం మొదలుపెట్టారు. దీన్ని ప్రభుత్వం ఖండించింది. సుందరీకరణ పనులు దశల వారీగా జరుతున్నాయని, పనులు పూర్తయ్యాక ఎవరైనా వచ్చి పరిశీలించవచ్చని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ స్పష్టం చేసింది. దురుద్దేశంతో అవాస్తవాలను ప్రచారం చేయడాన్ని ఖండించింది.

269 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వివిధ కేటగిరీల్లోని 269 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. గ్రూప్–4, మెడికల్ ఆఫీసర్లు, లెక్చరర్ తదితర పోస్టులు వీటిలో ఉన్నాయి. పోస్టులు, దరఖాస్తు గడువు వివరాలు ఇలా ఉన్నాయి..

కేటగిరీ	పోస్టులు	దరఖాస్తు గడువు
గ్రూప్-4	6	సెప్టెంబర్ 29 - అక్టోబర్ 19
నాన్ గెజిటెడ్	45	అక్టోబర్ 11 నుంచి నవంబర్ 2
ఆయుర్వేద లెక్చరర్లు	3	అక్టోబర్ 7 నుంచి 22
హోమియో లెక్చరర్లు	34	అక్టోబర్ 7 నుంచి 22
ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్	72	అక్టోబర్ 6 నుంచి 21
హోమియో మెడికల్ ఆఫీసర్	53	అక్టోబర్ 6 నుంచి 21
యునాని మెడికల్ ఆఫీసర్	26	అక్టోబర్ 6 నుంచి 21
ఏఈఈ	23	అక్టోబర్ 6 నుంచి నవంబర్ 15
సివిల్ అసిస్టెంట్ సర్జన్	7	అక్టోబర్ 27 నుంచి నవంబర్ 16

ఏసీబీకి చిక్కిన తహసీల్దార్

సాక్షి, అమరావతి/సీతారామపురం (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా)/నాతవరం: పాస్ పుస్తకాలను ప్రాసెస్ చేసేందుకు లంచాలు తీసుకుంటూ ఓ తహసీల్దార్, ఇద్దరు వీఆర్వోలు ఏసీబీకి చిక్కారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఎస్ఆర్‌పురం తహసీల్దార్ కాయల సతీశ్ రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. అలాగే రూ.20 వేలు లంచం తీసుకుంటున్న అనకాపల్లి జిల్లా నాతవరం మండలం వీఆర్వో సూర్యనారాయణ, రూ.8 వేలు లంచం తీసుకుంటున్న గుంటూరు జిల్లా వరగాని వీఆర్వో ఎస్‌కే మౌలాలిలను ఏసీబీ అధికారులు బుధవారం పట్టుకుని కేసులు నమోదు చేశారు.



నేను ఎవరు? శరీరాన్ని కాదు. ఎందుకంటే అది క్షయమవుతుంది; మెదడును కాదు. ఎందుకంటే అది శరీరంతో పాటు క్షయమవుతుంది; వ్యక్తిత్వం కాదు. ఉద్వేగాలు కాదు. ఇవన్నీ కూడా మరణంతో అదృశ్యం అవుతాయి. (నేను ఆత్మను అన్న అర్థంలో)

– రమణ మహర్షి

సాక్షి

గురువారం, సెప్టెంబర్, 29

అసాధారణ విజయం

తోకచుక్కలు, ఉల్కలు, గ్రహశకలాలు వగైరాల నుంచి భూగోళాన్ని రక్షించే ప్రయత్నంలో పడిన తొలి అడుగు మంగళవారం విజయవంతం కావడం శాస్త్రవేత్తలకు మాత్రమే కాదు, ఖగోళ విజ్ఞాన శాస్త్రంలో ఆసక్తి గలవారందరికీ ఉత్సాహాన్నిచ్చింది. గత నవంబర్‌లో నాసా శాస్త్రవేత్తలు డబుల్ ఆస్టరాయిడ్ రీ డైరెక్షన్ టెస్ట్ (డార్ట్) పేరుతో ప్రయోగించిన ఉపగ్రహం అందించిన విజయం అసాధారణమైంది. అది అంతరిక్షంలో పది నెలలు ప్రయాణించడం, శాస్త్రవేత్తల ఆదేశాలకు అనుగుణంగా నిర్దేశిత కక్ష్యలో, నిర్దేశిత వేగంతో మునుముందుకు దూసుకుపోవడం, కాస్తయినా తేడా రాకుండా అత్యంత కచ్చితంగా వారు చెప్పిన చోటే, చెప్పిన సమయానికే డైమార్ఫస్ అనే ఫుట్‌బాల్ గ్రౌండంత సైజున్న ఒక గ్రహశకలాన్ని ఢీకొట్టడం ఖగోళ విజ్ఞాన శాస్త్ర చరిత్రలో అపూర్వమైనది. డిడిమోస్ అనే మరో గ్రహశకలం చుట్టూ ఈ డైమార్ఫస్ పరిభ్రమిస్తోంది. ఈ జంట శకలాల్లో సరిగ్గా డైమార్ఫస్‌ని శాస్త్రవేత్తలు లక్ష్యంగా చేసుకున్నారు.

అంతరిక్షం నుంచి భూగోళానికి రాగల ముప్పు గురించిన భయాందోళనలు ఈనాటివి కాదు. 1908లో సైబీరియాలో చోటుచేసుకున్న ఘటన ప్రపంచ ప్రజానీకాన్ని నిశ్చేష్టుల్ని చేసింది. అక్కడి అటవీ ప్రాంతంలో గ్రహశకలం భూమిని ఢీకొట్టడం, పెను విస్ఫోటనం సంభవించి క్షణకాలంలో 10 కిలోమీటర్ల మేర సర్వనాశనం కావడం మానవాళి మస్తిష్కంలో నమోదైన తొట్ట తొలి ఖగోళ సంబంధ భయానక ఉదంతం. మన పుడమికి ఎప్పటికైనా ముప్పుంటుందన్న ఆందోళనకు అంకురార్పణ పడింది అప్పుడే. ఆ తర్వాత ఏమంత చెప్పుకోదగ్గ ఉదంతాలు లేవు. కానీ 2013 ఫిబ్రవరిలో రష్యాలోనే యురల్ పర్వతశ్రేణి ప్రాంత పట్టణాలు ఆరింటిని చెల్యాబిన్స్క్ గ్రహశకలం వణికించింది. కేవలం 66 అడుగుల నిడివున్న ఈ గ్రహశకలం భూవాతావరణంలోకి ప్రవేశించగానే విచ్ఛిన్నమై, ఉల్కాపాతంగా ముట్టడించడంతో ఆ పట్టణాలు చిగురుటాకుల్లా వణికాయి. గంటకు 69,000 కిలోమీటర్ల వేగంతో ఆ గ్రహశకలం వచ్చిందని అప్పట్లో శాస్త్రవేత్తలు తేల్చారు. చిత్రమేమంటే అదే రోజు 2012 డీఏ 14 పేరుగల మరో గ్రహశకలం రాక కోసం నిరీక్షిస్తున్న శాస్త్రవేత్తలకు పిలవని పేరంటంలా వచ్చిపడిన ఈ గ్రహశకలం ఊపిరాడకుండా చేసింది. ఈ ఉల్కాపాతంలో పౌరులెవరూ మరణించకపోయినా దాని పెనుగర్జన ధాటికి ఇళ్ల కిటికీ అద్దాలు పగిలి 1,500 మంది గాయపడ్డారు. ఆరు పట్టణాల్లోనూ 7,200 ఇళ్లు దెబ్బతిన్నాయి.

తోకచుక్కలూ, గ్రహశకలాల తాకిడికి గురికాని గ్రహాలు ఈ విశాల విశ్వంలో లేనేలేవు. అవి పెను విధ్వంసకారులే కావొచ్చుగానీ... కేవలం వాటి పుణ్యానే ఈ పుడమి తల్లి ఒడిలో జీవరాశి పురుడు పోసుకుంది. తోకచుక్కలో, పెను గ్రహశకలాలో తమ వెంట మోసుకొచ్చిన కీలకమైన కర్బన మిశ్రమాలూ, నీరూ జీవరాశి పుట్టుకకూ, వాటి అభివృద్ధికీ కారణమని శాస్త్రవేత్తలు చెబుతారు. దాదాపు 400 కోట్ల సంవత్సరాల క్రితం జరిగిన ఈ పరిణామమే విశ్వంలో భూగోళానికి విలక్షణత తీసుకొచ్చింది. ఇదే మాదిరి ఉదంతం ఈ విశాల విశ్వంలో మరోచోట జరిగే అవకాశం లేకపోలేదన్న అంచనాతో శాస్త్రవేత్తలు అన్వేషిస్తున్నారు. వారి అంచనా నిరాధారమైంది కాదు. మన పాలపుంతలోనే దాదాపు 4,000 కోట్ల నక్షత్రాలున్నాయంటారు. ఇలాంటి తారామండలాలు ఈ విశ్వంలో వంద కోట్లు ఉంటాయని ఒక అంచనా. కనుక అచ్చం భూమిపై చోటుచేసుకున్న పరిణామం వంటిదే మరోచోట జరగకపోవచ్చని చెప్పడానికి లేదు. లక్షలాది నక్షత్రాలు, గ్రహాలు పరిభ్రమిస్తున్నప్పుడు వాటి నుంచి వెలువడే ధూళి కణాలు మేఘాలై, ఆ మేఘాలు కాస్తా కోట్ల సంవత్సరాల్లో గ్రహాలుగా రూపాంతరం చెందడం సాధారణం. ఆ క్రమంలో కొన్ని శకలాలు విడివడి ఇతర గ్రహాలకు ముప్పు తెస్తూ ఉంటాయి. గురు గ్రహానికీ, అంగారకుడికీ మధ్య ఇలాంటివి అసంఖ్యాకం. ఆ కోణంలో మన భూగోళం సురక్షితమనే చెప్పాలి.

అయితే ఇటీవల మనవైపుగా వచ్చిన గ్రహశకలాలు సంఖ్యాపరంగా కాస్త ఎక్కువే. అవి భూమికి లక్షలాది కిలోమీటర్ల దూరంలో ఉన్నా శాస్త్రవేత్తల దృష్టిలో సమీపం నుంచి పోయే గ్రహశకలాల కిందే లెక్క. భూకక్ష్యకు నాలుగున్నర కోట్ల కిలోమీటర్ల పరిధిలోకి వచ్చే గ్రహశకలాలను భూమికి సమీపంగా పోతున్నవాటిగా పరిగణిస్తారు. మన సౌర కుటుంబంలో మొత్తం ఆరు లక్షల గ్రహ శకలాలున్నాయని ఒక లెక్క. అందులో కనీసం 20,000 భూ సమీప వస్తువులు (నియో)–అంటే గ్రహశకలాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే అందులో భూమికి ముప్పు తెచ్చిపెట్టేవి అతి తక్కువ. అయినా కూడా ఏమరుపాటు పనికిరాదన్నది వారి హెచ్చరిక. టెక్సాస్ నగరం నిడివిలో ఉండి భూగోళాన్ని ఢీకొట్టేందుకు సిద్ధమవుతున్న గ్రహశకలంపై కొన్నేళ్లక్రితం వచ్చిన హాలీవుడ్ చిత్రం 'ఆర్మెగెడాన్'ను ఎవరూ మరిచిపోరు. శాస్త్రవేత్తలు సమష్టిగా కృషిచేసి ఆ గ్రహశకలం గర్భంలో అణుబాంబును ఉంచి దాన్ని పేల్చేయడం ఆ సినిమా ఇతివృత్తం. ఇప్పుడు డార్ట్ ప్రయోగం ఒక రకంగా అటువంటిదే. ఉపగ్రహాన్ని ఢీకొట్టించి దాని కక్ష్యను 1 శాతం తగ్గిస్తే దాని పరిభ్రమణ కాలాన్ని పది నిమిషాలు కుదించవచ్చని, దాంతో కక్ష్య స్వల్పంగా మారవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వాస్తవంగా ఏం జరిగిందో తెలియడానికి మరికొన్ని వారాలు పడుతుంది. ఈ ప్రయోగం మున్ముందు మరిన్ని విజయాలకు బాటలు పరుస్తుందని, భవిష్యత్తులో ధూర్త శకలాలను దారిమళ్లించి పుడమి తల్లిని రక్షించుకోవడం సాధ్యమేనని ఆశించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.చవితి రా.12.20 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** స్వాతి ఉ.7.16 వరకు, తదుపరి విశాఖ
వర్జ్యం: ప.12.38 నుండి 2.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.53 నుండి 10.40 వరకు, తదుపరి ప.2.39 నుండి 5.25 వరకు
అమృతఘడియలు: రా.9.56 నుండి 11.29 వరకు.

సూర్యోదయం: 5.53
సూర్యాస్తమయం: 5.50
రాహుకాలం: ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం: ఉ.6.00 నుంచి 7.30 వరకు

చిప్ తయారీలో ముద్ర వేయగలమా?

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

గుజరాత్‌లోని అహ్మదాబాద్ జిల్లాలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ యూనిట్‌తోపాటు ఓ డిస్‌ప్లే ఫ్యాబ్రికేషన్ యూనిట్, సెమీకండక్టర్ అసెంబ్లింగ్, టెస్టింగ్ కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించినట్లు 'వేదాంత' గ్రూపు ప్రకటించింది. రెండు కారణాల వల్ల ఈ ప్రకటనకు ప్రాధాన్యం ఏర్పడింది. మొదటిది వీటి ఏర్పాటుకు ఏకంగా ఒక లక్ష యాభై నాలుగు వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెడుతూండటం. ఇక రెండోది, ఈ ప్లాంట్ ముందు నుంచి సూచిస్తూ వచ్చిన మహారాష్ట్రలో కాకుండా గుజరాత్‌లో ఏర్పాటు కానుండటం! ఇంతకంటే ముఖ్యమైన విషయం ఇంకోటి ఉంది. వేదాంత గ్రూపు భాగస్వామిగా తైవాన్‌కు చెందిన హోన్ హై టెక్నాలజీ(ఫాక్స్‌కాన్) గ్రూపు వ్యవహరిస్తూండటం. సెమీకండక్టర్ల తయారీకి తైవాన్ పెట్టింది పేరన్నది తెలిసిన విషయమే.

కోవిడ్ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా చిప్‌లకు కొరత ఏర్పడటం కనువిప్పు లాంటిదని చెప్పాలి. ఒకరిద్దరు తయారీదారులపై ఆధారపడితే ఇబ్బందులు తప్పవని రుజువు చేసిందీ మహమ్మారి. ఈ కాలంలో సెమీకండక్టర్ చిప్‌లు కార్లు మొదలుకొని వాషింగ్ మెషీన్ల వరకూ అన్నింటిలో చేరిపోతున్నాయి. కోవిడ్ తదనంతర పరిస్థితుల్లో చాలామంది తయారీదారులు తైవాన్‌లోని ఫ్యాబ్‌లపై (చిప్ తయారీ కేంద్రాలను ఫ్యాబ్‌లని పిలుస్తారు) ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని నిర్ణయించారు. అందుకే ఈ మార్కెట్‌లో సొంతంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని సముపార్జించుకోవడం భారత్‌కు ఎంతైనా అవసరం.

ఈ ఏడాది అమెరికా 'చిప్స్' పేరుతో ఓ చట్టాన్ని ఆమోదించింది. ఇందులో భాగంగా మైక్రోప్రాసెసర్లు లేదా చిప్‌లు తయారు చేసే లేదా పరిశోధనలు చేసే అమెరికన్ కంపెనీలకు దాదాపు 5,200 కోట్ల డాలర్ల ప్రోత్సాహకాలు అందించనున్నారు. యూరోపియన్ యూనియన్ కూడా ఇలాంటి ఒక పథకాన్ని ప్రవేశపెట్టే ఆలోచనలో ఉంది. దక్షిణ కొరియా దేశీ సంస్థలకు సబ్సిడీలతో కలుపుకొని సుమారు 45,000 కోట్ల డాలర్లతో సెమీ కండక్టర్ల తయారీకి భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. మన దేశంలో 'సెమీ కండక్టర్ మిషన్'లో భాగంగా సుమారు 76 వేల కోట్ల రూపాయల ప్రోత్సాహకాలు చిప్స్, డిస్‌ప్లే ఫ్యాబ్స్‌కు ఇవ్వాలన్న నిర్ణయం జరిగింది. ప్రైవేట్ సంస్థలకు ప్రాజెక్టుకయ్యే ఖర్చులో దాదాపు 50 శాతం సబ్సిడీగా అందిస్తున్నారు.

భారత్‌లో సెమీకండక్టర్ పరిశ్రమకు సంబంధించిన పునాదులు 1974లో పంజాబ్‌లో పడ్డాయని చెప్పాలి. సెమీ కండక్టర్ల డిజైనింగ్, ఫ్యాబ్రికేషన్లలో మన సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని గుర్తించిన కేంద్ర ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్ ఇందుకోసం విదేశీ సాయం తీసుకోవాలని తొలినాళ్లలో నిర్ణయించింది. 'సెమీ కండక్టర్ కాంప్లెక్స్ లిమిటెడ్' (ఎస్‌సీఎల్) ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర పడిన తరువాత 1976లో నిపుణుల బృందం మొహాలీ, మద్రాస్‌లలో ఒకచోట ఈ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని సూచించింది. ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్ మద్రాస్ విమానాశ్రయానికి దగ్గరగా ఉన్న ప్రాంతాన్ని సిఫారసు చేసింది. అయితే అప్పటి పంజాబ్ ముఖ్యమంత్రి జైల్‌సింగ్ అప్పటి ప్రధాని ఇందిరాగాంధీపై ఒత్తిడి తెచ్చి ఈ కాంప్లెక్స్ మొహాలీలో ఏర్పాటయ్యేలా చేసుకున్నారు. ఈ కేంద్రంలో అత్యధిక నైపుణ్యం ఉన్న వారి అవసరం ఎక్కువగా ఉంటుందనీ, దీని వల్ల స్థానికంగా ఉద్యోగావకాశాలేవీ పెరగవన్న విషయాన్ని జైల్‌సింగ్‌కు వివరించాల్సిందిగా ఇందిరాగాంధీ ఎలక్ట్రానిక్స్ డిపార్ట్‌మెంట్ అధికారి అశోక్ పార్థసారథిని పురమాయించారు. అయినాసరే మొహాలీలోనే ఆ కాంప్లెక్స్ ఏర్పాటు కావాలని జైల్‌సింగ్ పట్టు పట్టడంతో భారత్‌లో తొలి సెమీ కండక్టర్ తయారీ కేంద్రం 1978లో మొహాలీలో ఏర్పాటైంది. అప్పట్లో ఈ ఫ్యాబ్‌కు రూ.15 కోట్లు ఖర్చు



అయ్యింది. 1983లో అమెరికన్ మైక్రోసిస్టమ్స్ నుంచి పొందిన టెక్నాలజీ ఆధారంగా ఈ ఫ్యాబ్‌లో చిప్‌ల తయారీ మొదలైంది.

ఎస్‌సీఎల్ ఏర్పాటయ్యే సమయానికి కొంచెం అటూయిటుగానే దేశంలో సెమీ కండక్టర్ డిజైనింగ్ కార్యకలాపాలు కూడా మొదలయ్యాయి. చిప్ డిజైనింగ్‌లో అమెరికాలో పెద్ద పేరు సంపాదించిన ఐఐటీ – కాన్పూర్ పూర్వ విద్యార్థి ప్రభాకర్ గోయెల్ ఈ దిశగా చొరవ తీసుకున్నారు. ప్రభాకర్ మొదలుపెట్టిన 'గేట్‌వే డిజైన్ ఆటోమేషన్' సంస్థ చిప్‌లను పరీక్షించేందుకు వెరిలాగ్ పేరుతో టెస్టింగ్ టూల్‌ను తయారు చేసింది. వెరిలాగ్‌కు జపాన్, తైవాన్‌లలోని చిప్ తయారీదారుల నుంచి మంచి డిమాండ్ ఏర్పడటంతో ప్రభాకర్ గోయెల్ సంస్థ లక్షల డాలర్లు ఆర్జించగలిగింది. వెరిలాగ్ రూపకల్పన కొంత శ్రమతో కూడిన వ్యవహారం కావడంతో ప్రభాకర్ ఈ ప్రక్రియను భారత్‌లో చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం నోయిడాలోని ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్‌లో 1985లో కొంతమంది ఇంజినీర్లతో ఓ చిన్న యూనిట్‌ను మొదలుపెట్టారు. నాలుగేళ్ల తరువాత అమెరికాకు చెందిన కాడెన్స్ డిజైన్ సిస్టమ్స్ ప్రభాకర్ కంపెనీని కొనేసింది. ఈ రకంగా కాడెన్స్ సంస్థ భారత్‌లోనూ కాలుపెట్టిందని చెప్పాలి. సెమీ కండక్టర్ డిజైనింగ్ రంగంలోనే ఉన్న ఇంకో రెండు కంపెనీలు టెక్సస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఎస్‌టీ మైక్రోఎలక్ట్రానిక్స్ కూడా ఈ సమయంలోనే దేశంలో తమ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. ఆ తరువాత పదేళ్ల కాలంలోనే ఇంటెల్ లాంటివాటితో కలుపుకొని ప్రపంచంలోని 25 సెమీకండక్టర్ డిజైనింగ్ కంపెనీల్లో 17 భారత్‌లో కేంద్రాలను తెరిచాయి. ఫలితంగా సెమీకండక్టర్ డిజైనింగ్ రంగంలో భారత్ ఓ బలీయమైన శక్తిగా మారింది.

మైక్రోప్రాసెసర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకునేందుకు అమెరికా, యూరప్ కంపెనీలు భారతీయ ఇంజినీర్ల డిజైనింగ్ నైపుణ్యాన్నీ, తైవాన్‌లోని తయారీ కేంద్రాలనూ ఉపయోగించుకోవడం మొదలైంది. ఇంకోవైపు ఎస్‌సీఎల్ ఈ పోటీలో వెనుకబడి పోయింది.

తయారీ టెక్నాలజీని ఆధునికీకరించే ప్రయత్నంలో ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం ఒకటి చోటు చేసుకోవడం... పునర్నిర్మాణానికి చాలా సమయం పట్టడంతో కంపెనీ మళ్లీ కోలుకోలేకపోయింది. కాకపోతే సాంకేతిక పరిజ్ఞాన మార్పిడిపై విదేశాలు నిషేధాలు విధించిన సమయంలో అంతరిక్ష, రక్షణ రంగాల అవసరాలను తీర్చేందుకు మాత్రం ఉపయోగపడింది. తాజాగా ఎస్‌సీఎల్‌ను వాణిజ్యస్థాయి ఫ్యాబ్‌గా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

సెమీ కండక్టర్ రంగంలో భారత్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయేందుకు కారణాలు చాలానే ఉన్నాయి. అవసరమైన మేరకు పెట్టుబడులు పెట్టలేకపోవడం, స్థానికంగా మైక్రోప్రాసెసర్లకు డిమాండ్ తక్కువగా ఉండటం, ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్ల వ్యాపారంలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకోవడం వంటివి మచ్చుకు కొన్ని. సెమీ కండక్టర్ రంగంలో టెక్నాలజీ చాలా వేగంగా మారిపోతూంటుంది. వేదాంత సంస్థ ఏర్పాటు చేయదలచుకున్న ఫ్యాబ్‌లో 28 నానోమీటర్ల టెక్నాలజీ నోడ్‌లను తయారు చేసేందుకు నిర్ణయించారు. కంప్యూటర్లకు గుండె వంటి సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్లు, గ్రాఫిక్ ప్రాసెసర్లు, నెట్‌వర్కింగ్ చిప్స్, స్మార్ట్‌ఫోన్స్, కార్లు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లలో ఉపయోగించే మైక్రోప్రాసెసర్లను ఇక్కడ తయారు చేయవచ్చు. అయితే తైవాన్‌లో ప్రస్తుతం ఇంతకంటే చాలా సూక్ష్మమైన స్థాయిలో టెక్నాలజీ నోడ్‌లను తయారు చేసే పనిలో నిమగ్నమై ఉన్నాయి. ఇవెంత సూక్ష్మమైన వంటే... కేవలం మూడు నానోమీటర్ల సైజున్నవన్నమాట!

మొహాలీలో ఏర్పాటైన ఎస్‌సీఎల్‌లో ఐదు మైక్రాన్ల (5,000 నానోమీటర్లు) సైజున్న ట్రాన్సిస్టర్ల తయారీ చేపట్టారు. ఈ సైజును 1.2 మైక్రాన్లకు(1,200 నానోమీటర్లు) తగ్గించేందుకు జరిగిన ప్రయత్నంలోనే ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగింది. ఆ సమయంలో కూడా అంతర్జాతీయ సంస్థలు 0.8 మైక్రాన్ల సైజులో మాత్రమే ట్రాన్సిస్టర్ల తయారీలో ఉండేవి. పదేళ్లలోపు ఎస్‌సీఎల్ ఈ అంతరాన్ని సొంతంగానే తగ్గించుకుని ఉండేది. విదేశీ టెక్నాలజీలను ఆపోశన పట్టడంలో భారతీయులు నైపుణ్యం కలవారన్నది తెలిసిందే. ఎప్పటి కప్పుడు మారిపోతూండే ఈ సెమీ కండక్టర్ డిజైనింగ్, ఫ్యాబ్రికేషన్ రంగంలో మనదైన ముద్ర వేయాలంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవడం ఎంతైనా అవసరం. ఇందుకు పరిశోధనలపై పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. ఇప్పటికైతే వేదాంత ప్రతిపాదిస్తున్న జాయింట్ వెంచర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌పై మాట విప్పడం లేదు. సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి కూడా ఉంటుందా, లేదా అన్నది కూడా అస్పష్టం. భారత్ మరోసారి సెమీ కండక్టర్ రంగంలో లభిస్తున్న గొప్ప అవకాశాన్ని కోల్పోదనే ఆశిద్దాం!

వ్యాసకర్త వైజ్ఞానిక అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ప్రగాఢ సానుభూతి



మహేశ్, మంజుల... మీకు మా ప్రగాఢ సానుభూతి. మా ప్రార్థనలు మీ వెంటే ఉంటాయి. అమ్మ ఎల్లప్పుడూ తన కాంతిని మీ మీద ప్రసరిస్తూనే ఉంటుంది. – సూర్య శివకుమార్, నటుడు

ఎన్నికల నిషేధం



గత ఎనిమిదేళ్లుగా పీఎఫ్‌ఐ తన కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉంది. కేంద్రం ఏమాత్రం ఆసక్తి చూపలేదు. ఇప్పుడు గుజరాత్ నుంచి కర్ణాటక వరకు మరో ఎన్నికల చక్రం సిద్ధంగా ఉండటంతో పీఎఫ్‌ఐ అకస్మాత్తుగా నిషేధానికి గురైంది. ఏం మారిందని? – సాగరికా ఘోష్, జర్నలిస్ట్

మహాకవికి నివాళి



కవిత్వమే ఆయుధంగా మూఢాచారాలపై తిరగబడ్డ ఆధునిక తెలుగు కవి శ్రీ గుర్రం జాషువా. వడగాల్పు నా జీవితం... వెన్నెల నా సాహిత్యం అంటూ పేదరికం, వర్గ సంఘర్షణ, ఆర్థిక అసమానతలపై పోరాడిన అభ్యుదయ వాది జాషువా. మహాకవి జయంతి (సెప్టెంబర్ 28) సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. – వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి, ఏపీ సీఎం

తీవ్రవాద సంస్థ అనే...



తీవ్రవాద సంస్థ అన్న ఆరోపణల మీదే పీఎఫ్‌ఐ నిషేధానికి గురైందన్న విషయంలో స్పష్టంగా ఉందాం. అంతేగానీ అదొక ముస్లిం సంస్థ అయినందుకు కాదు. అసలు చాలా మంది ఇండియన్ ముస్లింలకు ఈ సంస్థ దేనికి నిలబడిందో కూడా తెలీదు. ముస్లింల తరఫున అది నిలబడాలని కూడా ప్రతి ఒక్క ముస్లిం కోరుకోవడం లేదు. – తెహసీన్ పూనావాలా, వెంచర్ క్యాపిటలిస్ట్

మరేం చేయాలి?



పీఎఫ్‌ఐ నిషేధానికి గురైంది. పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీల్లో ముస్లింలు అతి తక్కువ. చట్టాన్ని అమలుపరిచే వ్యవస్థల్లో ముస్లింల ప్రాతినిధ్యం ఎప్పటికంటే తక్కువ. న్యాయాన్ని డిమాండ్ చేసే ముస్లిం గొంతుకల్ని భయపెట్టడమో, జైలుకు పంపడమో జరుగుతోంది. భారత ప్రజలారా! ముస్లింలకు ఇంకేం అవకాశం ఉంది? – ఆరిఫ్ అయూబ్, మానవతావాది

గంపగుత్తగా...



ఐదేళ్ల కాలానికి ప్రభుత్వం నిషేధించినవి: 1. పీఎఫ్‌ఐ, 2. రిహాబ్ ఇండియా ఫౌండేషన్, 3. క్యాంపస్ ఫ్రంట్, 4. నేషనల్ విమెన్స్ ఫ్రంట్, 5. ఆల్ ఇండియా ఇమామ్స్ కౌన్సిల్, 6. జూనియర్ ఫ్రంట్, 7. ఎంపవర్ ఇండియా ఫౌండేషన్, 8. రిహాబ్ ఇండియా ఫౌండేషన్ కేరళ, 9. నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్. ఇవన్నీ పీఎఫ్‌ఐతో సంబంధం ఉన్నవే. – అన్షుల్ సక్సేనా, జర్నలిస్ట్


వ్యతిరేక భగత్



భగత్ సింగ్ 115 ఏళ్ల క్రితం ఈరోజు (సెప్టెంబర్ 28) జన్మించారు. భగత్ సింగ్ ఒక కమ్యూనిస్ట్. ఉర్దూ, పంజాబీ భాషల్లో వ్యాసాలు రాశారు. ఆయన పాపులర్ చేసిన 'ఇంక్విలాబ్ జిందాబాద్' స్లోగన్ ఉర్దూ కవి మౌలానా హస్రత్ మోహానీ పుట్టించింది. భగత్ సింగ్ బతికివుంటే భక్తులు ఆయన మీద జాతి వ్యతిరేకుడన్న ముద్ర వేసేవారు. – అద్వైద్, హిస్టారియన్

నెరవేరిన చిరకాల స్వప్నం

సందర్భం



సీహెచ్ ద్వారకా తిరుమల రావు

ఇది 21వ శతాబ్దం. ఆధునికత, సాంకేతికతల సమ్మేళనంతో వాహన రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. విమాన, రైలు ప్రయాణాలు తప్పించి, రోడ్డు మీద తిరుగాడే అన్ని వాహనాలకు ఇప్పటివరకు పెట్రోలు / డీజిలు వినియోగమే అధికంగా జరుగుతున్నది. కాగా, ఇటీవలి కాలంలో ఈ పెట్రోలు / డీజిలు ధరలు గరిష్ఠంగా పెరిగి ప్రభుత్వాలకు, ప్రజలకు ఆర్థికంగా పెనుభారంగా మారాయి. వీటికి ప్రత్యామ్నాయ ఆలోచనే విద్యుత్ వాహనాలను ప్రవేశ పెట్టాలనుకోవడం.

రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) పాలసీని రాష్ట్ర పురోభివృద్ధికి ఉపయోగపడేలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నది. దశల వారీగా రాష్ట్రంలో 'ఈవీ'ల వినియోగాన్ని ప్రోత్సహించి, పర్యావరణ పరిరక్షణకు తన వంతు కర్తవ్యాన్ని పూర్తి స్థాయిలో చేపడుతున్నది. ఈ ఎలక్ట్రిక్ వాహనాలతో అనేక ప్రయోజనాలు సమకూరుతాయి.

ఎలక్ట్రిక్ వాహనాలు అత్యంత సమర్థంగా పని చేస్తాయి. డీజిల్, పెట్రోలు వాహనాలతో పోలిస్తే, తక్కువ నిర్వహణ ఖర్చులు కలిగి ఉంటాయి. డీజిల్ / పెట్రోలుతో పోల్చినప్పుడు విద్యుత్ ఇంధన ఆదా గణనీయంగా ఉంటుంది. ఎలక్ట్రిక్ వాహనాలు సురక్షితమైనవి, నమ్మదగినవి. ఇతర సాంకేతికతలకు సమానమైన సమయ వ్యవధిని కలిగి ఉంటాయి. వాటి నిశ్శబ్ద, మృదువైన పయనం ప్రయాణికులు విశ్రాంతి తీసు కోవడానికి అనువుగా ఉంటుంది. డీజిల్ / పెట్రోలు ఇంజిన్ లేకపోవడం వల్ల శబ్ద కాలుష్యం తగ్గుతుంది. డీజిల్/ పెట్రోలు వాహనాల వల్ల గాలిలోకి హానికర ఉద్గారాలు విడుదలై ప్రజలకు... ముఖ్యంగా పిల్లలకు ఉబ్బసం, ఊపిరితిత్తుల సమస్యలు వంటివి తలెత్తుతాయి. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వల్ల ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఈవీలు ఇప్పటికీ వాటి సంప్రదాయ ప్రత్యర్థుల కంటే తక్కువ ఉద్గారాలు, తక్కువ గ్లోబల్ వార్మింగ్‌లతో వాతావరణ కాలుష్యాన్ని తగ్గిస్తాయి.

ఈ విద్యుత్ వాహనాల వినియోగంతో ప్రజా రవాణా శక్తి పెరుగుతుంది. పర్యావరణాన్ని దెబ్బతీసే హానికరమైన కార్బన్ డయాక్సైడ్ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు తగ్గుతాయి. ఎలక్ట్రిక్ డ్రైవింగ్ నుండి ఒక కిలో మీటరుకు వచ్చే ఉద్గారాలు పెట్రోల్ లేదా డీజిల్ డ్రైవింగ్ వల్ల విడుదలయ్యే ఉద్గారాల కంటే చాలా తక్కువ. అలాగే, పవర్ స్టేషన్ (ఛార్జింగ్ స్టేషన్) ఉద్గారాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు కూడా ఇది నిజం.



ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి చాలా ఉత్సాహపూరితమైన వాతావరణం ఉన్నప్పటికీ, అధిక కొనుగోలు ధరలు, కొత్త ఛార్జింగ్ స్టేషన్ల స్థాపన వంటి కొన్ని ఆర్థికపరమైన భారాలు ఇప్పటికీ ఉన్నాయి. అయితే, ఈ సవాళ్లు తొలిదశలోనే వుంటాయి. తదనంతరం ప్రత్యామ్నాయ మార్గాలూ వుంటాయి. ఎలక్ట్రిక్ వాహనాలకు ఆశాజనకమైన భవిష్యత్తు ఉంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వ స్ఫూర్తితో ప్రజలకు, ప్రయాణికులకు తన వంతు కర్తవ్యంగా ఈ విద్యుత్ బస్సుల వినియోగానికి ఏపీఎస్‌ఆర్టీసీ శ్రీకారం చుడుతున్నది.

ఇటీవలి కాలంలో రవాణా రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఒక్కసారి గతంలోకి తొంగి చూస్తే, ప్రజా రవాణాలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏపీఎస్‌ఆర్టీసీ ఎన్నో చర్యలు చేపట్టినది. సాధారణమైన ఎర్ర బస్సు స్థాయి నుంచి, క్రమేపీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ, ఏసీ, చివరగా అత్యున్నత స్థాయి ఏసీ స్లీపర్ బస్సుల స్థాయి వరకు ఎదిగి, గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులలో కూడా వాసికెక్కి, ప్రయాణికుల మన్ననలు పొంది, జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, రివార్డులు పొందుతున్నది కూడా. ప్రస్తుతం తలపెట్టిన ఈవీల వాడకం ఈ సంస్థ కిరీటంలో మరో కలికి తురాయి కానున్నది. మొదటి దశలో 100 ఎలక్ట్రిక్ బస్సులను పవిత్ర నగరమైన తిరుపతి – తిరుమల, తిరుపతి పరిసర ప్రాంతాలలో నడపటానికి ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి.

ఈ విద్యుత్ బస్సుల వల్ల ప్రయాణికులకు ఆహ్లాదకరమైన ప్రయాణం చేసే అవకాశం లభిస్తుంది. అంటే శబ్దం, కాలుష్యం లేని ప్రశాంత ప్రయాణమన్న మాట. ఈవీలకు చార్జింగ్ చేసే విద్యుత్ ఛార్జీల పెరుగుదలతో పోలిస్తే పెట్రోలు, డీజిల్ ధర పెరుగుదల ఎక్కువ. ఈవీ బ్యాటరీ ధర క్రమంగా తగ్గుతూ ఉండటం గమనించవచ్చు. అలాగే కాపెక్స్ మోడల్‌తో పోల్చినప్పుడు ఈవీల ఆపరేషన్ ఖర్చు తక్కువగా ఉంటుంది.

ఈవీలను సమకూర్చుకోవడానికి ఏపీఎస్‌ఆర్టీసీ అనేక సంవత్సరాలుగా యోచిస్తున్నది. పైన పేర్కొన్న విస్తృత ప్రయోజనాలు, ప్రస్తుత ప్రభుత్వ సహకారం వల్ల, ఇన్నాళ్ళకు ఈ చిరకాల స్వప్నం నెరవేరబోతున్నది. ఇందువల్ల ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుంది. అలాగే ఏపీఎస్‌ఆర్టీసీ ప్రయాణికులకు మరింత చేరువ అయ్యే అవకాశంగా దీన్ని భావిస్తున్నది.

వ్యాసకర్త ఏపీఎస్‌ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్

5జీ టెక్నాలజీ గొప్పదే కానీ...

సందర్భం



మురాల తారానాథ్

అక్టోబర్ 1 నుండి 5జీ టెక్నాలజీ వాణిజ్య సేవలను భారత్‌లో అధికారికంగా ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. అసలు ఈ 5జీ టెక్నాలజీ అంటే ఏమిటో, దానివల్ల సామాన్య ప్రజలకు, ఇతరులకు కలిగే ప్రయోజనాలు ఏమిటో, నష్టాలు ఏమిటో తెలుసుకుందాం.

నిజానికి టెలికాం రంగంలో ఇంత త్వరితగతిన వచ్చినన్ని సాంకేతిక మార్పులు మరే ఇతర రంగంలో రాలేదు. 1980లలో 1జీ టెక్నాలజీ ద్వారా అనలాగ్ వాయిస్ కాల్స్ మాట్లాడుకునే సౌకర్యం వస్తే, 1990 నాటికి 2జీ టెక్నాలజీ ద్వారా డిజిటల్ వాయిస్, ఎస్ఎంఎస్ ఇచ్చుకునే సదుపాయం వచ్చింది. 2000 నాటికి 3జీ సాంకేతికత ద్వారా మొబైల్‌లో డేటా వాడుకునే సౌకర్యం కల్పించారు. 2010 నాటికి 4జీ ద్వారా మొబైల్ బ్రాడ్ బ్యాండ్ వెసులుబాటు వచ్చింది. ఇప్పుడు 5జీ ద్వారా మొబైల్‌లోనే హై స్పీడ్ నెట్‌వర్క్ కల్పిస్తున్నారు. ఎక్కువ స్పీడ్ కలిగిన నెట్‌వర్క్ కావాలంటే భూగర్భ కేబుల్ ద్వారా వేసిన బ్రాడ్ బ్యాండ్, లేక ఎఫ్‌టీటీహెచ్ కనెక్షన్ తీసుకోవాలని అనుకునే దశ నుండి, మొబైల్‌లోనే రియల్ టైమ్ వేగంతో బ్రాడ్ బ్యాండ్ వాడుకునే వెసులుబాటు 5జీ ద్వారా కలుగు తుంది.



5జీ టెక్నాలజీ అందుబాటులోకి వస్తే విద్య, వైద్య, వ్యవసాయ, విద్యుత్, ఐటీ, వాతావరణ, అంతరిక్ష రంగాలలో పెను మార్పులు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థల్లో 5జీ అమలు ద్వారా లోడ్ నియంత్రణ నెట్‌వర్క్ గణనీయంగా మెరుగవుతుంది. వర్చ్యువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ సౌకర్యం వల్ల... విద్యారంగం, వైద్య సేవలు ప్రపంచ స్థాయికి చేరుతాయని భావిస్తున్నారు. మిషన్ లెర్నింగ్ టెక్నాలజీ ద్వారా యంత్ర పరికరాల రిపేరు, యంత్రాలను నడపటం మొబైల్ ద్వారానే చేయగలం. మరింత అధునాతన వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం ఏర్పడుతుంది. ఐటీ లేదా పెద్దపెద్ద కంపెనీలలో హై స్పీడ్ నెట్‌వర్క్ వినియోగం ద్వారా పెను మార్పులు వస్తాయి.

5జీ టెక్నాలజీ నిరంతరం రావడానికి ఎక్కువ టవర్లు అవసరం వీటికి అయ్యే ఖర్చు ఎక్కువ. 4జీతో పోలిస్తే ఎక్కువ దూరం ప్రయాణించదు. అందుకే ఎక్కువ టవర్లు, డబ్బు అవసరం. ఇప్పుడు వాడుతున్న మొబైల్స్ బదులుగా 5జీ టెక్నాలజీ మొబైల్స్ వాడాల్సి ఉంటుంది. హాకర్లు సైబర్ నేరాలకు మరింత ఎక్కువగా పాల్పడే అవకాశం ఎక్కువ. వర్షం వచ్చినా 5జీ నెట్‌వర్క్ సరిగా పనిచేయదు. కేవలం వినోదం, గేమింగ్, డేటా వినియోగం పెంచుకోవడంపై ప్రయివేట్ టెలికాం కంపెనీలు దృష్టి పెడతాయి కనుక యువత చెడిపోయే ప్రమాదం ఎక్కువ. ప్రయివేట్ టెలికాం కంపెనీలతో పాటు 5జీ టెక్నాలజీని ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్‌కు కూడా ఇచ్చి గ్రామీణ ప్రాంతాల్లో 5జీ సేవల అభివృద్ధికి తోడ్పాటు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యాసకర్త టెలికామ్ రంగ విశ్లేషకులు
మొబైల్: 94405 24222

చిన్నశేష వాహనంపై శేషాద్రివాసుడు!



చిన్నశేష వాహనంపై ఊరేగుతున్న శ్రీ మలయప్ప స్వామి

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు మలయప్పస్వామి వారు ఐదు తలల చిన్నశేష వాహనంపై బద్రి నారాయణ అలంకారంలో దర్శనమిచ్చారు. మాడ వీధుల్లో అంగరంగ వైభవంగా జరిగిన వాహనసేవలో వివిధ కళాబృందాల ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వాహన సేవలోని స్వామి వారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. పురాణ ప్రాశస్త్యం ప్రకారం చిన్నశేషుడిని వాసుకి (నాగలోకానికి రాజు)గా భావిస్తారు. ఈ వాహన సేవను దర్శిస్తే కుటుంబ శ్రేయస్సుతోపాటు కుండలినీ యోగ సిద్ధిఫలం లభిస్తుందని ప్రశస్తి. కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు, ఈవో ఏవీ ధర్మారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హంస వాహనంపై హరినాథుడు..



తిరుమలేశుని బ్రహ్మోత్సవాల రెండో రోజు బుధవారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మలయప్ప స్వామి హంస వాహనాన్ని అధిరోహించి సర్వ విద్యా ప్రదాయిని అయిన సరస్వతిదేవి రూపంలో భక్తులను కటాక్షించారు. చేతిలో వీణ, విశేష దివ్యాభరణాలు, పట్టుపీతాంబరాలు ధరించి స్వామివారు మాడ వీధుల్లో ఊరేగారు. అంతకుముందు కొలువు మండపంలో స్వామి వారు ఊయలూగుతూ దర్శనమిచ్చారు. వాహన సేవలో వివిధ సాంస్కృతిక కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

సులభంగా శ్రీవారి దర్శనం

తిరుమలలో భక్తుల రద్దీ తక్కువగా ఉండటంతో కంపార్ట్‌మెంట్‌ల్లో భక్తులను వేచి ఉంచకుండా నేరుగా దర్శనానికి పంపిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి వరకు 51,308 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 18,812 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.2.03 కోట్లు వేశారు.

చంద్రఘంట అలంకారంలో భ్రమరాంబాదేవి



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శరన్నవరాత్రోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి స్వామిఅమ్మవార్లు రావణ వాహనాన్ని అధిష్టింపగా, భ్రమరాంబాదేవి చంద్రఘంట అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో మూడవ రోజున అలంకార మండపంలో ఉత్సవ మూర్తులను రావణ వాహనంపై ఆవహింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత ఆలయ ప్రదక్షిణ చేయించారు. తర్వాత ప్రారంభమైన గ్రామోత్సవం అంకాలమ్మగుడి, నందిమండపం, బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు కొనసాగింది.

గాయత్రీ దేవిగా కనకదుర్గమ్మ దర్శనం



సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గగుడిలో దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజైన బుధవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. క్యూలైన్లు సాఫీగా సాగిపోయేలా ఏర్పాట్లు చేయడంతో సామాన్యులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం అవుతోంది. కొండపైకి ప్రొటోకాల్, డిజిగ్నేటెడ్ వీఐపీల వాహనాలు తప్ప, ఇతరుల వాహనాలు రాకుండా కట్టడి చేశారు.

కనులవిందుగా నగరోత్సవం

ఆది దంపతుల నగరోత్సవం నయన మనోహరంగా సాగింది. గంగాసమేత దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవమూర్తులతో మల్లేశ్వరాలయం దిగువన ఉన్న మహా మండపం నుంచి నగరోత్సవం ప్రారంభమైంది. దుర్గమ్మను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స, కారుమూరి దర్శించుకున్నారు. కాగా, దివ్యాంగులకు మోడల్ గెస్ట్‌హౌస్ నుంచి దుర్గగుడికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు బస్సు సౌకర్యం ఉంది. పున్నమి ఘాట్ నుంచి భక్తులను ప్రత్యేక బస్సుల్లో ఓం టర్నింగ్ వరకు తరలించేలా ఏర్పాట్లు చేశారు. అక్కడి నుంచి వలంటీర్లు వారిని సేకరించుకొని, వీల్‌చైర్లలో తీసుకెళ్లి దర్శనం చేయిస్తున్నారు.

నేడు అన్నపూర్ణాదేవిగా..

దసరా మహోత్సవాల్లో భాగంగా ఆశ్వయుజ శుద్ధ చవితిని పురస్కరించుకుని గురువారం కనకదుర్గమ్మను శ్రీ అన్నపూర్ణాదేవిగా అలంకరిస్తారు. శ్రీ అన్నపూర్ణాదేవి అన్నం ప్రసాదించే మాతృమూర్తి. శ్రీ అన్నపూర్ణాదేవి ఎడమ చేతిలో ఉన్న బంగారు పాత్రలో ఉన్న అమృతాన్నాన్ని, వజ్రాలు పొదిగిన గరిటెతో సాక్షాత్తు ఈశ్వరునికే భిక్షను అందించే అంశం అద్భుతం. లోకంలో జీవుల ఆకలిని తీర్చడం కన్నా మిన్న ఏదీ లేదు. ఈ నిత్యాన్నదానేశ్వరి అలంకారంలో దుర్గమ్మను దర్శిస్తే అన్నాదులకు లోపం లేకుండా, ఇతరులకు అన్నదానం చేసే సౌభాగ్యాన్ని పొందగలుగుతామని భక్తుల విశ్వాసం.

క్లుప్తంగా

వైష్ణవీదేవిగా రాజశ్యామల



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర

సింహాచలం: విశాఖ శ్రీశారదా పీఠంలో జరుగుతోన్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో మూడో రోజు శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు వైష్ణవీ దేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర పూజలు నిర్వహించి హారతులు అందజేశారు. అమ్మవారి మూలవిరాట్‌కి స్వరూపానందేంద్ర అభిషేకం నిర్వహించారు. పీఠం ప్రాంగణంలో చండీహోమం, చతుర్వేదపారాయణం, దేవీ భాగవత పారాయణ పఠనం నిర్వహించారు.

ప్రకృతి సాగులో ఓబులమ్మ ఆదర్శం

- జర్మన్ కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంక్ ప్రతినిధి ఐరిష్



ఓబులమ్మను సన్మానిస్తున్న ఐరిష్

సాక్షి, అమరావతి : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను సాగు చేయడమే కాదు.. స్వయంగా మార్కెట్ చేస్తూ బండి ఓబులమ్మ రైతులకు ఆదర్శంగా నిలిచారని జర్మన్‌కు చెందిన కేఎఫ్ డబ్ల్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ప్రతినిధి ఐరిష్, రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్‌లు ప్రశంసించారు. వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండలం టి.కొత్తపల్లెకు చెందిన ప్రకృతి రైతు ఓబులమ్మకు ఇటీవల ప్రతిష్టాత్మక జైవిక్ ఇండియా అవార్డును సొంతం చేసుకున్నారు. రైతు సాధికార సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఓబులమ్మను సన్మానించారు. ఉన్నత చదువులు చదవకున్నా ఓబులమ్మ.. వ్యవసాయం ద్వారా సమాజానికి తన వంతు సాయం చేస్తోందంటూ ఐరిష్ కొనియాడారు. మార్కెటింగ్‌పై ఐరిష్ అడిగిన ప్రశ్నకు ఓబులమ్మ సమాధానం ఇస్తూ.. తాను, తన కుటుంబ సభ్యుల సహకారంతో వాట్సాప్ గ్రూపు ద్వారా మార్కెటింగ్ చేస్తున్నట్టు తెలిపారు. ఈ గ్రూపులో 300 మంది సభ్యులున్నారని, వారిలో అత్యధిక మంది డాక్టర్లేనని వివరించారు. విజయకుమార్ మాట్లాడుతూ టి.కొత్తపల్లిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులందరికీ ఆర్గానిక్ సర్టిఫికెట్ అందేలా కృషి చేస్తామన్నారు.

రక్షణ రంగంలో రూ.8,431 కోట్ల ఎగుమతులు

ఆకాష్, టార్పెడోలు, రాడార్ల ఎగుమతులపై పలు దేశాలతో చర్చలు

- స్టార్టప్‌లకు డీఆర్‌డీవో నుంచి సాంకేతిక బదలాయింపు
- ఇప్పటివరకు 60 పరిశ్రమలకు రూ.250 కోట్లు
- నిరంతర పరిశోధనలకు ప్రోత్సాహం
- 'సాక్షి'తో రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్ అమలు ద్వారా అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయని రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి చెప్పారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బుధవారం విశాఖపట్నం వచ్చిన ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. మేకిన్ ఇండియాలో భాగంగా డీఆర్‌డీవో నుంచి సాంకేతిక బదలాయింపుని ప్రోత్సహించడం ద్వారా రక్షణ సామగ్రి ఉత్పత్తులు పెరిగాయని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

పెరుగుతున్న ఎగుమతులు

దేశీయ తయారీ రంగానికి ఉత్తేజం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రెండు రక్షణ పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేసింది. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా తయారవుతున్న ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతిచేసే స్థాయికి చేరుకున్నాం.



2014–15 నాటికి రూ.2 వేల కోట్ల కంటే తక్కువలో ఉన్న డిఫెన్స్ ఎక్స్‌పోర్ట్స్ 2020–21 నాటికి రూ.8,431 కోట్లకు చేరుకోవడం విశేషం. పదుల సంఖ్యలో దేశాలకు ఎగుమతులు జరుగుతుండటం శుభపరిణామం. ప్రస్తుతం 334 శాతం పెరుగుదల ఉన్న ఎగుమతులు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

టార్పెడోలు, రాడార్ల ఎగుమతులపై చర్చలు

పలు దేశాలు మన రక్షణరంగ పరికరాలతో పాటు ఆయుధ సంపత్తిని తీసుకుంటున్నాయి. త్వరలోనే అత్యంత శక్తిమంతమైన ఆయుధాల ఎగుమతులకు కూడా ఒప్పందాలు జరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఆకాష్, టార్పెడోలు, రాడార్లతో పాటు క్షిపణుల ఎగుమతులపై ప్రభుత్వం వివిధ దేశాలతో చర్చిస్తోంది.

సాంకేతిక బదలాయింపుతో ప్రోత్సాహం

రక్షణ రంగానికి అవసరమైన ఇన్నోవేషన్స్‌ని సృష్టించే అంకుర పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తున్నాం. డిఫెన్స్ ఇన్నోవేషన్ స్టార్టప్ చాలెంజ్ ద్వారా సాంకేతికత బదలాయింపు జరుగుతోంది. ఇప్పటికే డీఆర్‌డీవో నుంచి 60 పరిశ్రమలకు దాదాపు రూ.250 కోట్లకుపైగా టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫండ్ అందించాం. డిఫెన్స్ రంగం వైపు ఎక్కువ స్టార్టప్స్ అడుగులు వేస్తున్నాయి. పరిశోధనల అభివృద్ధి (ఆర్ అండ్ డీ)లోను మార్పులు వస్తున్నాయి. క్వాంటం, హైపవర్ లేజర్, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్.. ఇలా ఎన్నో పరిశోధనలు వస్తున్నాయి. వీటిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్ అండ్ డీ బడ్జెట్‌లో 25 శాతం వరకు పరిశ్రమలు, స్టార్టప్స్, విద్యారంగానికి కేటాయించడం చరిత్రాత్మకమైన నిర్ణయం.

ఏఐపీ ప్రయోగాలు విజయవంతమవుతున్నాయి

డీఆర్‌డీవోకి చెందిన నేవల్ మెటీరియల్స్ రీసెర్చ్ ల్యాబొరేటరీ (ఎన్ఎంఆర్ఎల్)లో అభివృద్ధి చేసిన ఇంధన ఆధారిత ఎయిర్ ఇండిపెండెంట్ ప్రొపల్షన్(ఏఐపీ) ల్యాండ్ బేస్డ్ ప్రోటోటైప్ ప్రయోగాలు విజయవంతమయ్యాయి. త్వరలో ఇంటిగ్రేషన్ చేయాలి. ఇతర సాంకేతికతలతో పోల్చిచూస్తే ఫ్యూయల్ బేస్డ్ ఏఐపీ సబ్‌మెరైన్లకు ఎంతో ఉపయోగపడుతుంది.

శారదాపీఠంలో సతీష్‌రెడ్డి పూజలు

సింహాచలం: విశాఖపట్నం చినముషిడివాడలోని శ్రీ శారదాపీఠాన్ని బుధవారం కేంద్ర రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు సతీష్‌రెడ్డి దర్శించుకున్నారు. పీఠంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు. శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి పూజలు చేశారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి ఆశీస్సులు అందుకున్నారు.

కులవాదుల ఆగడాలను జాషువా స్ఫూర్తితో తరిమికొడతాం

731వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ : కులవాదుల ఆగడాలను గుర్రం జాషువా స్ఫూర్తితో తరిమికొడతామని బహుజన పరిరక్షణ సమితి నేతలు స్పష్టం చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారం నాటికి 731వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ సమాజాన్ని సంస్కరించేందుకు కవిత్వం ద్వారా ఉద్యమాన్ని తీసుకొచ్చి మేల్కొలిపిన జాషువా రచనలు అజరామరం అన్నారు. బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజన పరిరక్షణ సమితి ఉద్యమం కొనసాగుతోందన్నారు. రెండేళ్లుగా చేస్తున్న పోరాటం రాష్ట్రంలో సత్ఫలితాలు సాధిస్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి తమ పోరాటానికి మద్దతు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఓ వైపు ప్రజా రాజధాని అని చెబుతున్న బాబు అండ్ కో.. ఈ ప్రాంతంలో బహుజనులకు ప్రభుత్వం జానెడు జాగా కల్పించేందుకు ప్రయత్నిస్తుంటే అడ్డుకున్నారని, పేదలకు రాజధానిలో స్థలాలిస్తే సామాజిక అసమతుల్యత ఏర్పడుతుందంటూ అంటరానితనాన్ని ఎత్తిచూపుతూ తప్పుడు కేసులు వేయడం సిగ్గుచేటన్నారు. పేదలపై కుల వివక్ష చూపుతూ తప్పుడు కేసులు వేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. గుర్రం జాషువా 127వ జయంతిని పురస్కరించుకుని దీక్షా శిబిరంలో జాషువా చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నేతలు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

గుట్కా విక్రయాలపై సెబ్ దాడులు

రూ.46 లక్షల విలువైన గుట్కాలు, విదేశీ సిగరెట్లు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్) : గుట్కా విక్రయాలపై శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు బుధవారం దాడులు చేసి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.46 లక్షల విలువ చేసే గుట్కాలు, పారిస్ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులో జిల్లా ఎస్పీ సీహెచ్ విజయారావు, సెబ్ జాయింట్ డైరెక్టర్ శ్రీలక్ష్మిలు మీడియాకు వివరాలు వెల్లడించారు. గుడ్లూరు మండలం తెట్టు గ్రామానికి చెందిన తిరుమలరాజు వెంకటేశ్వర్లు, కందుకూరు పట్టణానికి చెందిన సుధాకర్‌లు కొంతకాలంగా బెంగళూరులోని తుమ్మకూరు ఫ్యాక్టరీ నుంచి వేర్వేరుగా పెద్ద ఎత్తున గుట్కాలను దిగుమతి చేసుకుని వాటిని అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై సెబ్ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీలక్ష్మికి సమాచారం అందింది. ఆమె ఆదేశాల మేరకు సెబ్ జేడీ టీమ్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌బాషా తన సిబ్బందితో కలిసి తిరుమలరాజు ఇళ్లు, గోదాముపై బుధవారం తెల్లవారుజామున దాడులు చేసి రూ.30 లక్షల విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కందుకూరు రూరల్ మండలం ఓగూరులోని సుధాకర్‌కు చెందిన గోదాముపై దాడిచేసి రూ.16 లక్షల విలువచేసే గుట్కాలు, విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులకు సరఫరా చేసిన వారిపై సైతం కేసులు నమోదు చేయనున్నట్టు ఎస్పీ వివరించారు.

విజయవాడ మీదుగా దసరా ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ)/లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విజయవాడ మీదుగా దసరా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్–తిరుపతి (02764) రైలు అక్టోబర్ 1న రాత్రి 8.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 9 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (02763) అదే 2వ తేదీ సాయంత్రం 5 గంటలకు తిరుపతిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు జనగాం, ఖాజీపేట, వరంగల్లు, మహబూబ్‌నగర్, డోర్నకల్లు, ఖమ్మం, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది. సికింద్రాబాద్–యశ్వంతపూర్ (07233) రైలు ఈ నెల 29, అక్టోబర్ 6, 13, 20 తేదీల్లో రాత్రి 9.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 10.45 గంటలకు యశ్వంతపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07234) ఈ నెల 30, అక్టోబర్ 7, 14, 21 తేదీల్లో సాయంత్రం 3.50 గంటలకు యశ్వంతపూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 4.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

నరసాపూర్ –సికింద్రాబాద్‌కు ప్రత్యేక రైలు కేటాయింపు

నరసాపూర్–సికింద్రాబాద్–నరసాపూర్ వయా గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లు కేటాయించినట్లు సీనియర్ డీసీఎం ఆంజనేయులు పేర్కొన్నారు. నరసాపూర్ – సికింద్రాబాద్ (07466) రైలు ఈ నెల 30న సాయంత్రం 6 గంటలకు నరసాపూర్‌లో బయల్దేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4.10 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్ –నరసాపూర్ (07467) రైలు అక్టోబరు 1న సికింద్రాబాద్‌లో రాత్రి 9.05 గంటలకు బయల్దేరి నరసాపూర్ స్టేషన్‌కు మరుసటిరోజు ఉదయం 8.35 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలు పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుంది.

నేర పరిశోధనలో జాగిలాల పాత్ర కీలకం

- హోం మంత్రి తానేటి వనిత
- ఘనంగా పోలీసు జాగిలాల 20వ బ్యాచ్ పాసింగ్ అవుట్‌పరేడ్



పోలీసు శునకాల పాసింగ్ అవుట్ పెరేడ్‌కు హాజరైన హోంమంత్రి తానేటి వనిత

సాక్షి, అమరావతి : నేర పరిశోధన, భద్రత చర్యల్లో పోలీసు జాగిలాల పాత్ర కీలకమైనదని హోం మంత్రి తానేటి వనిత చెప్పారు. పోలీసు జాగిలాల 20వ బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్‌ను మంగళగిరిలోని ఆరో బెటాలియన్ మైదానంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వనిత మాట్లాడుతూ నేరస్తుల జాడ కనిపెట్టడం, ప్రముఖుల భద్రత ఏర్పాట్లు, ఆగంతకులపై దాడి చేసి వారిని నిలువరించడం మొదలైన వాటిలో పోలీసు జాగిలాలు కీలక భూమిక నిర్వర్తిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలోని 177 పోలీసు జాగిలాల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ఒక వెటర్నరీ వైద్యుడి పోస్టును ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మన పోలీసు శాఖ జాతీయ స్థాయిలో 189 అవార్డులు దక్కించుకోవడం గర్వకారణమన్నారు. సైబర్ మిత్ర, ఉమెన్ హెల్ప్ డెస్క్, గ్రామ, వార్డు సచివాలయాల్లో మహిళా పోలీసుల నియామకం సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్‌గుప్తా, డీజీ (ఇంటెలిజెన్స్) ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జాగిలాల విన్యాసాలు

పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా జాగిలాల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బాంబులను గుర్తించడం, వీఐపీలపై దాడికి పాల్పడేవారిని నిరోధించడం, ఆగంతకులపై దాడి చేయడం మొదలైన విన్యాసాలను ప్రదర్శించాయి. 20వ బ్యాచ్ కింద 35 జాగిలాలు, 52 మంది జాగిలాల సంరక్షకులు మంగళగిరిలోని ఆరో బెటాలియన్‌లో 8 నెలలపాటు శిక్షణ ఇచ్చారు. ఇక్కడ 2017 నుంచి ఇప్పటి వరకు 4 బ్యాచ్‌ల కింద 124 జాగిలాలు, 175 మంది హ్యాండ్లర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ జాగిలాలను జిల్లా పోలీసు కేంద్రాలు, ఆక్టోపస్, గ్రేహౌండ్స్, టీటీడీలకు కేటాయిస్తారు.

చిరుధాన్యాల్లో పోషకాహార గనులు

సెర్ప్ సీఈవో ఇంతియాజ్

భవానీపురం (విజయవాడ పశ్చిమ): మనిషి ఆరోగ్యంగా ఉండటానికి చిరుధాన్యాలు ఎంతగానో ఉపయోగపడతాయని, వాటిల్లో పోషకాహార గనులు ఉన్నాయని సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్ చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2023 సంవత్సరాన్ని 'ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్'గా ప్రకటించిందని, ఇందులో భాగంగా చిరుధాన్యాల్లో ఉన్న పోషక విలువలను తెలియజేయడం, రైతులు చిరుధాన్యాలను పండించే విధంగా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని టీటీడీసీలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర స్థాయి పోషకాహార ప్రదర్శన, వర్క్‌షాప్ జరిగాయి. పలు జిల్లాల నుంచి స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల మహిళలు చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార ఉత్పత్తులతో స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇంతియాజ్ మాట్లాడుతూ..చిరుధాన్యాలను పండించడం వల్ల భూమి సారం పెరుగుతుందని, నీటి వినియోగం తక్కువగా ఉండి పర్యావరణానికి ఎలాంటి హానీ జరగదని తెలిపారు. చిరుధాన్యాల వినియోగంపై ప్రజలకు మరింత ప్రచారం కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. కమిషనరేట్ అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ బాలు నాయక్ చిరుధాన్యాల ఉత్పత్తిపై ప్రభుత్వం నుంచి అందించే వివిధ ప్రోత్సాహకాల గురించి వివరించారు.



చిరుధాన్యాల ఉత్పత్తులను పరిశీలిస్తున్న సెర్ప్ సీఈఓ ఇంతియాజ్

జాతి గర్వించదగ్గ వ్యక్తి.. జాషువా

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి
వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా గుర్రం జాషువా జయంతి

సాక్షి, అమరావతి: కుల వివక్షకు వ్యతిరేకంగా కలమే ఆయుధంగా మలుచుకొని రచనలు చేసిన వ్యక్తి మహాకవి గుర్రం జాషువా అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి కొనియాడారు. నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకలను గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నేతలు గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. విజయసాయిరెడ్డి మాట్లాడుతూ.. 1895లో గుంటూరు జిల్లా వినుకొండలో ఆయన జన్మించడం గుంటూరు జిల్లా ప్రజలందరికీ గర్వకారణమన్నారు. ఆయన జాతి గర్వించదగ్గ వ్యక్తి అని చెప్పారు.



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

హోం శాఖ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ.. సమాజంలో బడుగు, బలహీనవర్గాల వారికి, మహిళలకు సమానత్వం కోసం కృషి చేసిన వ్యక్తి జాషువా అని ప్రశంసించారు. ఎక్కడైతే అవమానాలు పొందారో అక్కడే సత్కారాలు పొందారని చెప్పారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. గుర్రం జాషువా జాతి గర్వించదగిన కవి అని తెలిపారు. శాసనమండలిలో చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... గుర్రం జాషువాతో వ్యక్తిగత సాన్నిహిత్యం ఉండటం తన అదృష్టమన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాషువా కోరుకున్న విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలను సమాజంలో ఓ స్థాయికి తీసుకురావాలని సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. శాసనమండలిలో విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ.. గుర్రం జాషువా సమసమాజాన్ని ఆశించారని తెలిపారు. ఎమ్మెల్యేలు అనంత వెంకట రామిరెడ్డి, హఫీజ్ ఖాన్, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్ కుమార్, కల్పలతారెడ్డి, విజయవాడ నగర మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమెరికా వీసాల వేగవంతానికి చర్యలు

జైశంకర్‌కు బ్లింకెన్ హామీ

వాషింగ్టన్: అమెరికా వీసాల కోసం భారతీయులు దీర్ఘకాలం వేచి ఉండే పరిస్థితులకు కరోనా మహమ్మారియే కారణమని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్ నిందించారు. కొద్ది నెలల్లోనే సమస్యను పరిష్కరిస్తామని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌కు హామీ ఇచ్చారు. వాషింగ్టన్‌లో మంగళవారం బ్లింకెన్‌తో జై శంకర్ భేటీ అయ్యారు. వీసా అపాయింట్‌మెంట్ల కోసం రెండేళ్లకు పైగా ఎదురు చూడాల్సిన పరిస్థితులున్నట్టు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కరోనా సంక్షోభంతో 2020 మార్చి నుంచి కొద్ది నెలల పాటు వీసా ప్రక్రియ నిలిపివేయడంతో వేచి చూసే సమయం పెరిగిపోయిందని, వీసాల త్వరితగతి మంజూరు కోసం ఒక ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని బ్లింకెన్ స్పష్టం చేశారు. ''కరోనా కారణంగా మా దౌత్య కార్యాలయాల్లో సిబ్బందిని తగ్గించాం. ఇప్పుడు మళ్లీ సిబ్బందిని పెంచడానికి ఒక ప్రణాళిక ప్రకారం చర్యలు చేపడతాం. మరి కొద్ది నెలల్లోనే వీసాల జారీ వేగవంతం అవుతుంది'' అని బ్లింకెన్ స్పష్టం చేశారు. వీసా ప్రక్రియ వేగవంతం చేయడం ఇరుదేశాలకూ ప్రయోజనకరమని జైశంకర్ అన్నారు. వీసాల జారీలో అడ్డంకుల్ని అధిగమించాలన్నారు.

తల్లి గర్భంలోనే రుచుల మక్కువ

గర్భిణి తీసుకొనే ఆహారాన్ని బట్టి శిశువుల ఇష్టాయిష్టాలు.. ● డర్హామ్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడి


మామూలుగా ఉన్న గర్భస్థ పిండం


నవ్వు ముఖంతో...


ముఖం చిట్లిస్తూ...

లండన్: కొందరు కొన్ని రకాల ఆహార పదార్థాలపై జిహ్వాచాపల్యం ప్రదర్శిస్తారు. మరికొందరు వాటిని చూడగానే ఇబ్బందిగా మొహంపెడతారు. ఇలా ఆహారాన్ని ఇష్టపడడం లేదా పడకపోవడం తల్లి గర్భంలో ఉన్నప్పుడే మొదలవుతుందని ఇంగ్లాండ్‌లోని డర్హాం యూనివర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో తేలింది. తల్లి తీసుకొనే ఆహారం, వాటి రుచులకు గర్భంలోని శిశువులు చక్కగా స్పందిస్తున్నట్లు గమనించారు. 18–40 ఏళ్ల వయసున్న 100 మంది గర్భిణులకు 4డీ అల్ట్రాసౌండ్ స్కానింగ్ నిర్వహించారు. 32, 36 వారాల గర్భంతో ఉన్నప్పుడు రెండుసార్లు స్కానింగ్ చేశారు. 100 మందిని మూడు గ్రూపులుగా విభజించారు. స్కానింగ్‌కు 20 నిమిషాల ముందు మొదటి గ్రూప్‌లోని గర్భిణులకు క్యారెట్‌ను, రెండో గ్రూప్‌లోని వారికి క్యాబేజీని 400 ఎంజీ మాత్రల రూపంలో ఇచ్చారు. మూడో గ్రూప్‌లోని గర్భిణులకు ఏమీ ఇవ్వలేదు. క్యారెట్ మాత్ర తీసుకున్న మహిళల గర్భంలోని శిశువుల ముఖాల్లో చిరునవ్వు కనిపించింది. క్యాబేజీ మాత్ర తీసుకున్న వారి గర్భంలోని శిశువులు మాత్రం ఇష్టం లేదన్నట్లుగా ముఖం చిట్లించారు. మాత్రలేవీ తీసుకోనివారి గర్భంలోని శిశువుల్లో ఎలాంటి ప్రతిస్పందన లేదు. ఈ అధ్యయనం వివరాలను సేజ్ జర్నల్‌లో ప్రచురించారు. గర్భిణి తీసుకొనే ఆహారం శిశువును కచ్చితంగా ప్రభావితం చేస్తుందని పరిశోధకులు చెప్పారు. గర్భంతో ఉన్నప్పుడు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకొంటే జన్మించిన బిడ్డలు చక్కటి ఆహారపు అలవాట్లు అలవర్చుకొంటారని తెలిపారు. గర్భస్థ శిశువలకు నిర్దిష్ట ఆహారం పరిచయం చేస్తే భవిష్యత్తులో దానిపైవారు మక్కువ పెంచుకుంటారని సూచించారు.

సీడీఎస్‌గా చౌహాన్



న్యూఢిల్లీ: దేశ రెండో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) అనిల్ చౌహాన్ (61) నియమితులయ్యారు. రక్షణ శాఖ బుధవారం ఈ మేరకు ప్రకటించింది. ఆయన సైనిక వ్యవహారాల శాఖ కార్యదర్శిగా కూడా కొనసాగుతారని పేర్కొంది. జనరల్ హోదాలో చౌహాన్ బాధ్యతలు స్వీకరిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. లెఫ్టినెంట్ జనరల్‌గా రిటైరయ్యాక జనరల్‌గా పదోన్నతిపై తిరిగి విధుల్లో చేరనున్న తొలి సైనికాధికారి ఆయనే. హెలికాప్టర్ ప్రమాదంలో జనరల్ బిపిన్ రావత్ దుర్మరణం నేపథ్యంలో 9 నెలలకు పైగా సీడీఎస్ పదవి ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే. 1961లో జన్మించిన చౌహాన్ నేషనల్ డిఫెన్స్ అకాడెమీలో శిక్షణ అనంతరం 1981లో 11, గూర్ఖా రైఫిల్స్‌లో చేరారు. కశ్మీర్, ఈశాన్య ప్రాంతాల్లో చొరబాట్ల నిరోధక కార్యకలాపాల్లో ఆయనకు సుదీర్ఘ అనుభవముంది. అంగోలాలో ఐరాస మిషన్‌లోనూ సేవలందించారు. 2019లో పుల్వామా ఉగ్ర దాడులకు ప్రతీకారంగా పాకిస్తాన్‌లోని బాలాకోట్‌పై వాయుసేన దాడుల సందర్భంగా మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్‌గా ఉన్నారు. ఈ హోదాలో పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 2021 మేలో తూర్పు ఆర్మీ కమాండర్‌గా రిటైరయ్యారు. పరమ విశిష్ట సేవా మెడల్, ఉత్తమ యుద్ధ సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్, సేనా మెడల్, విశిష్ట సేవా మెడల్ అందుకున్నారు. చైనా వ్యవహారాలపై నిపుణుడిగా చౌహాన్‌కు పేరుంది. ప్రస్తుతం ఆయన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సారథ్యంలోని నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్‌లో సైనిక సలహాదారుగా సేవలందిస్తున్నారు. త్రివిధ దళాలను మరింతగా సంఘటితపరిచి దేశ సైనిక సామర్థ్యాన్ని ఇనుమడింపజేసే లక్ష్యంతో సీడీఎస్ పదవిని కేంద్రం తెరపైకి తెచ్చింది. తొలి సీడీఎస్‌గా జనరల్ రావత్ 2020 జనవరి 1న బాధ్యతలు స్వీకరించడం తెలిసిందే. త్రివిధ దళాల చీఫ్‌గా రిటైరైన వారితో పాటు లెఫ్టినెంట్ జనరల్, ఎయిర్ మార్షల్, వైస్ అడ్మిరల్‌గా రిటైరైన వాళ్లకు కూడా సీడీఎస్ అయ్యేందుకు అర్హత కల్పిస్తూ జూన్‌లో నిబంధనలను మార్చారు.

క్లుప్తంగా...

హిమాచల్‌లో బీజేపీ గూటికి...

కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ హిమాచల్ ప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ హర్ష్ మహాజన్ బుధవారం ఢిల్లీలో బీజేపీ నేత పియూశ్ గోయల్ సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర మాజీ మంత్రి, మాజీ సీఎం వీరభద్ర సింగ్‌కు అత్యంత సన్నిహితుడైన మహాజన్ ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీని విమర్శించారు. రాష్ట్రంలో ఇటీవల ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా బీజేపీ గూటికి చేరారు.

కర్నాటక పీసీసీ చీఫ్ డీకే ఇంట్లో సీబీఐ సోదాలు

బెంగళూరు: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ నివాసం, ఆయనకు సంబంధించిన ఇతర ప్రాంతాల్లో సీబీఐ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. రామనగర జిల్లాలోని ఆయన స్వగ్రామంతోపాటు కనకపుర, దొడ్డనహళ్లి, సంతే కొడిహళ్లిలో ఈ సోదాలు జరిగాయి. శివకుమార్‌కు చెందిన ఆస్తులు, భూములు, వాటికి సంబంధించిన పత్రాలను అధికారులు పరిశీలించారు. కనకపుర తహసిల్దార్‌ను కలుసుకున్నారు. శివకుమార్ ఆస్తుల వివరాలపై ఆరా తీశారు. 2017లో శివకుమార్ ఇళ్లు, కార్యాలయాలపై ఐటీ శాఖ దాడులు చేపట్టింది. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు గుర్తించింది. అనంతరం ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), తర్వాత సీబీఐ పరిధిలోకి వచ్చింది. శివకుమార్‌పై దర్యాప్తు కొనసాగించేందుకు 2019 సెప్టెంబర్ 25న కర్ణాటక ప్రభుత్వం సీబీఐకి అనుమతి మంజూరు చేసింది.

మనీ లాండరింగ్ కేసులో మద్యం వ్యాపారి సమీర్ అరెస్ట్



న్యూఢిల్లీ: రద్దయిన ఢిల్లీ ఎక్సయిజ్ పాలసీ విధానం అమలు కాలంలో అక్రమాలకు పాల్పడ్డారని మద్యం వ్యాపారి సమీర్ మహేంద్రును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు బుధవారం అరెస్ట్‌చేశారు. ఇండోస్పిరిట్ లిక్కర్ డిస్ట్రిబ్యూటర్ సంస్థకు సమీర్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. సెంట్రల్ ఢిల్లీలో మనీ లాండరింగ్ కేసులో అరెస్ట్‌చేసిన ఈడీ ఆయనను తమ రిమాండ్‌లోకి తీసుకునేందుకు అనుమతి కోసం స్థానిక కోర్టులో ప్రవేశపెట్టనుంది. ఇదే కేసును విచారిస్తున్న సీబీఐ గతంలో సమీర్‌ను విచారించింది. వ్యాపారి వినయ్ నాయర్‌ను సీబీఐ అరెస్ట్‌చేసిన మరుసటి రోజే సమీర్‌ను ఈడీ అరెస్ట్‌చేయడం గమనార్హం. ఢిల్లీ డెప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా సన్నిహితులకు సమీర్ దాదాపు రూ.5 కోట్లు చెల్లించాడని ఎక్సయిజ్ పాలసీ కేసు ఎఫ్ఐఆర్‌లో సీబీఐ పేర్కొంది. మద్యం లైసెన్సుదారుల నుంచి వసూలు చేయాల్సిన రూ.144.36 కోట్ల టెండర్ లైసెన్స్ ఫీజులను కోవిడ్ ఆర్థిక కష్టాలను కారణంగా చూపి ఢిల్లీ ఎక్సయిజ్ శాఖ మాఫీ చేసిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఎక్సయిజ్ విధానంలో అక్రమాలు జరిగాయంటూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ సక్సేనా 11 మంది ఎక్సయిజ్ అధికారులను సస్పెండ్ చేసి సీబీఐ దర్యాప్తును కోరిన విషయం తెల్సిందే.

త్వరలో లాంఛనంగా విలీనం!

రష్యాకే జైకొట్టిన ఉక్రేనియన్లు

కీవ్: ఉక్రెయిన్‌లోని డొనెట్స్క్, లెహాన్స్క్, జపోరిజియా, ఖెర్సన్ తదితర ఆక్రమిత ప్రాంతాలను లాంఛనంగా విలీనం చేసుకునేందుకు రష్యా చేస్తున్న ప్రయత్నాలు తుది దశకు చేరుకున్నాయి. ఆయా ప్రాంతాల్లో రష్యా అధికారులు ఇప్పటికే రిఫరెండం నిర్వహించడం తెలిసిందే. జపోరిజియాలో 93 శాతం, ఖెర్సన్‌లో 87, లుహాన్స్క్‌లో 98, డొనెట్స్క్‌లో 99 శాతం విలీనానికి ఓటేసినట్టు వారు ప్రకటించారు. కాబట్టి ఆ ప్రాంతాలను రష్యాలో విలీనం చేసుకోవాల్సిందిగా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను కోరనున్నట్టు బుధవారం చెప్పారు. సైన్యంతో బెదిరించి బలవంతంగా విలీనానికి ఒప్పిస్తున్నట్టు విమర్శలు విన్పిస్తున్న సంగతి తెలిసిందే. ఇదంతా బూటకమంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో పాటు అమెరికా, పాశ్చాత్య దేశాలు ఇప్పటికే తూర్పారబడుతున్నాయి. లక్షలాది బలగాలను ఉక్రెయిన్‌లోకి తరలిస్తామని పుతిన్ ప్రకటించడం, అణ్వాయుధాల ప్రయోగానికీ వెనుదీయబోమని హెచ్చరించడం తెలిసిందే.

పీఎఫ్ఐపై ఉక్కుపాదం

ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద ఐదేళ్ల పాటు నిషేధం

8 అనుబంధ సంస్థలపైనా నిషేధం విధించిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ సమగ్రత, సార్వభౌమాధికారం, భద్రతకు విఘాతం కలిగించేలా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇస్లామిక్ అతివాద సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ), దాని 8 అనుబంధ సంస్థలపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ప్రజా శాంతికి, మత సామరస్యానికి భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న దృష్ట్యా వాటిపై ఐదేళ్ల పాటు నిషేధం విధించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ బుధవారం గెజిట్ విడుదల చేసింది. పీఎఫ్ఐ, అనుబంధ సంస్థలు రిహాబ్ ఇండియా ఫౌండేషన్(ఆర్ఐఎఫ్), క్యాంపస్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(సీఎఫ్ఐ), ఆల్ ఇండియా ఇమామ్స్ కౌన్సిల్ (ఏఐఐసీ), నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ (ఎన్‌సీహెచ్ఆర్ఓ), నేషనల్ ఉమెన్స్ ఫ్రంట్, జూనియర్ ఫ్రంట్, ఎంపవర్ ఇండియా ఫౌండేషన్, రిహాబ్ ఫౌండేషన్–కేరళలను ఐదేళ్ల పాటు నిషేధిస్తున్నట్లు ప్రకటించింది.

ఐసిస్‌తోనూ సంబంధాలు

సమాజంలో యువత, విద్యార్థులు, మహిళలు, ఇమామ్‌లు, న్యాయవాదులు, బడుగు బలహీన వర్గాల్లో పట్టు పెంచుకోవాలన్న లక్ష్యంతో పీఎఫ్ఐ వివిధ అనుబంధ సంస్థలు, ఫ్రంట్‌లను ఏర్పాటు చేసిందని కేంద్రం వెల్లడించింది. ''సభ్యత్వ విస్తరణ, నిధుల సేకరణ సామర్థ్యంతో ఆయా సంస్థలను పెంచిపోషిస్తోంది. పీఎఫ్ఐ నాయకులే అనుబంధ సంస్థలను పర్యవేక్షిస్తుండటంతో పాటు సమన్వయం చేస్తున్నారు. పీఎఫ్ఐ సహా మిగతా సంస్థలు సామాజిక–ఆర్థిక, విద్యా, రాజకీయ సంస్థలుగా బహిరంగంగా పనిచేస్తున్నాయి. దేశంలో ప్రజాస్వామ్య భావనను అణగదొక్కడానికి, సమాజంలో ఒక నిర్దిష్ట వర్గం పట్ల పూర్తి అగౌరవాన్ని ప్రదర్శించడానికి పీఎఫ్ఐ నేతలు రహస్య ఎజెండాను అమలు చేస్తున్నారు. వీటి కార్యకలాపాలు దేశ సమగ్రతను దెబ్బతీసేలా, ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చేలా ఉన్నాయి'' అని ఆక్షేపించింది.

ఉద్దేశపూర్వకంగా నేరపూరిత కుట్రలు

''పీఎఫ్ఐకి కరడుగట్టిన అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా(ఐసిస్)తోనూ సంబంధాలు ఉన్నాయని చెప్పడానికి అనేక ఉదాహరణలున్నాయి. పీఎఫ్ఐ వ్యవస్థాపక సభ్యుల్లో కొందరు స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా(సిమి) నాయకులే. జమాత్ ఉల్ ముజాహిదీన్ బంగ్లాదేశ్ (జేఎంబీ)తోనూ పీఎఫ్ఐ సంబంధాలు కలిగి ఉంది. ఈ రెండూ ఇప్పటికే నిషేధానికి గురైన సంస్థలే. ప్రపంచ ఉగ్రవాద ముఠాలతో పీఎఫ్ఐ సంబంధాలకు అనేక రుజువులున్నాయి. పీఎఫ్ఐ నేతలు, సభ్యులు కొందరు అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థల్లో చేరారు. పీఎఫ్ఐ ఆఫీస్ బేరర్లు, సభ్యులు ఇతరులతో కలిసి దేశ విదేశాల నుంచి హవాలా మార్గాల్లో నిధులు సమీకరిస్తున్నారు. సేవా కార్యక్రమాల ముసుగులో విరాళాలు సేకరిస్తున్నారు. ఉద్దేశపూర్వకంగా నేరపూరిత కుట్రలకు పాల్పడుతున్నారు'' అని కేంద్రం పేర్కొంది.

దేశ అంతర్గత భద్రతకు పెనుముప్పు

''పీఎఫ్ఐకి పలు ఉగ్రవాద, క్రిమినల్ కేసులతో సంబంధముంది. దేశం పట్ల పూర్తి అగౌరవాన్ని ప్రదర్శిస్తోంది. ఇతర దేశాల సైద్ధాంతిక, నిధుల మద్దతుతో భారత్‌లో హింసాత్మక, విధ్వంసక చర్యలకు పాల్పడుతూ దేశ అంతర్గత భద్రతకు పెనుముప్పుగా పరిణమిస్తోంది. ఓ కాలేజీ ప్రొఫెసర్‌ను నరికివేయడం, ఇతర మతాలను సమర్థించే సంస్థలతో సంబంధం ఉన్న వ్యక్తులను హత్య చేయడం, ప్రముఖ వ్యక్తులు, ఆధ్యాత్మిక కేంద్రాలు, స్థలాలను లక్ష్యంగా చేసుకుని పేలుడు పదార్థాలు ప్రయోగించడం, ప్రభుత్వ ఆస్తులను నాశనం చేయడం వంటివాటికి పాల్పడుతోంది. శాంతికి భంగం కలిగించడం, రాజ్యాంగ ప్రక్రియను బలహీనపర్చడం, ఉగ్రవాద ఆధారిత తిరోగమన పాలనను ప్రోత్సహించడం, దేశ వ్యతిరేక భావాలను ప్రచారం చేయడం, ఒక నిర్దిష్ట వర్గాన్ని సమూలంగా మార్చడం వంటి అనుచిత వ్యవహారాలు సాగిస్తోంది. అందుకే పీఎఫ్ఐ, దాని అనుబంధ సంస్థలపై యూఏపీఏ చట్టం కింద ఐదేళ్ల పాటు నిషేధం విధిస్తున్నాం'' అని కేంద్రం వివరించింది.

ఎస్‌డీపీఐకి రూ.11 కోట్ల విరాళాలు

పీఎఫ్ఐ రాజకీయ విభాగమైన సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ)కి 2019–21 మధ్య రూ.11 కోట్లకుపైగా విరాళాలందాయని ఈసీ వద్ద ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. ఎస్‌డీపీఐ 2009 జూన్‌లో ఏర్పాటయ్యింది. 2010 ఏప్రిల్‌లో ఢిల్లీలో గుర్తింపులేని రాజకీయ పార్టీగా రిజిస్టరైంది. 2018–19లో రూ.5.17 కోట్లు, 2019–20లో రూ.3.74 కోట్లు, 2020–21లో రూ.2.86 కోట్ల విరాళాలు స్వీకరించింది. ఇవి అత్యధికంగా తమిళనాడు, కేరళ, కర్ణాటక నుంచే అందడం గమనార్హం.



ప్రజాస్వామ్యంపై కేంద్రం దాడి: ఎస్‌డీపీఐ

పీఎఫ్ఐ, అనుబంధ సంస్థలపై నిషేధాన్ని ఎస్‌డీపీఐ ఖండించింది. ఇది ప్రజాస్వామ్యం దాడేనని పార్టీ అధ్యక్షుడు ఎం.కె.ఫైజీ విమర్శించారు. నిషేధాన్ని బీజేపీ స్వాగతించగా, స్వలాభం కోసం సమాజాన్ని విడగొట్టడానికి మతాన్ని వాడుకొనే సిద్ధాంతాలను, సంస్థలను కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. అతివాదం విషయానికొస్తే పీఎఫ్ఐ కంటే ముందు హిందూ అతివాదాన్ని విస్తరింపజేస్తున్న ఆర్ఎస్ఎస్‌ను నిషేధించాలని ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. పీఎఫ్ఐ వంటివాటిపై నిషేధం చాలదని, రాజకీయంగా ఏకాకిని చేయాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభిప్రాయపడ్డారు. కేరళలో ప్రతిపక్ష ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ కూడా నిషేధాన్ని స్వాగతించింది.

ఇక పీఎఫ్ఐ ఆస్తుల స్వాధీనం

న్యూఢిల్లీ: పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ), అనుబంధ సంస్థలపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించిన నేపథ్యంలో అధికారులు తదుపరి చర్యలు ప్రారంభించనున్నారు. తొలుత ఆయా సంస్థల ఆస్తులను స్వాధీనం చేసుకుంటారు. వాటి బ్యాంకు ఖాతాలను సైతం స్తంభింపజేస్తారు. ఆ సంస్థల రోజువారీ సాధారణ కార్యకలాపాలు కూడా ఇకపై కొనసాగే అవకాశం లేదు. నిషేధం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు ఐదేళ్లపాటు అమల్లో ఉంటుంది. ఆ తర్వాత కూడా అప్పటి పరిస్థితుల దృష్ట్యా కొనసాగించవచ్చు. పీఎఫ్ఐ, అనుబంధ సంస్థలు చట్టవిరుద్ధమని ప్రకటించడానికి తగిన కారణం ఉందా? లేదా? అనే దానిపై తీర్పు కోసం నోటిఫికేషన్ వెలువడిన తేదీ నుండి 30 రోజుల్లోపు కేంద్ర ప్రభుత్వం ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తుంది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల(నియంత్రణ) చట్టం–1967 ప్రకారం.. నిధులను ఖర్చు చేయకుండా, బదిలీ చేయకుండా నిషేధిత సంస్థలోని సభ్యుడిని అడ్డుకోవచ్చు. ఒక సంస్థ చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తేలితే ఆ సంస్థ భవనాన్ని ప్రభుత్వం సీజ్ చేయొచ్చు.

ఇందుకే నిషేధం...

కేంద్రం పీఎఫ్ఐపై అయిదేళ్ల నిషేధం విధించడానికి ఎన్నో కారణాలున్నాయి...

- పీఎఫ్ఐచెందిన సభ్యులకు ఉగ్రవాదం, హింస, చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో ప్రమేయమున్నట్టు ఆరోపణలున్నాయి. రెండు మతాల మధ్య చిచ్చే లక్ష్యంగా సభ్యుల్ని ఉసిగొల్పుతూ ఉంటుంది.
- పీఎఫ్ఐ సభ్యులపై వివిధ రాష్ట్రాల్లో 1300కి పైగా క్రిమినల్ కేసులున్నాయి.
- కేరళలో 2021లో ఆర్ఎస్ఎస్ సభ్యుడు సంజిత్, తమిళనాడులో 2019లో హిందూ నాయకుడు వి.రామలింగం, కర్నాటకలో హిందూ సామాజిక కార్యకర్త ప్రవీణ్ నెట్టారుతో పాటు పలువురు హిందూ నేతలు తదితరులను పీఎఫ్ఐ కార్యకర్తలు దారుణంగా చంపినట్టు ఆరోపణలున్నాయి.
- కేరళలోని కొల్లం జిల్లా అటవీ ప్రాంతంలో గతేడాది సోదాల్లో పేలుడు పదార్థాలు, పీఎఫ్ఐ జిహాదీ సాహిత్యం లభించాయి. 2013లో కన్నూర్ జిల్లాలో సాయుధ శిక్షణ కేంద్రంలో పేలుడు పదార్థాలు, ఆయుధాలు దొరికిన కేసులో 41 మంది పీఎఫ్ఐ సభ్యులు దోషులుగా తేలారు.
- పీఎఫ్ఐ, దాని అనుబంధ సంస్థలకు భారీగా బ్యాంకు ఖాతాలున్నాయి. దేశ విదేశాల నుంచి అనుమానాస్పద వ్యక్తులు, సంస్థల నుంచి భారీగా నిధులు వస్తున్నాయి. దీంతో ఐటీ చట్టంలోని కొన్ని సెక్షన్ల ద్వారా పీఎఫ్ఐ రిజిస్ట్రేషన్ హోదాను కేంద్రం ఉపసంహరించింది.
- 2047 నాటికి భారత్‌ను ఇస్లామిక్ రాజ్యంగా మార్చాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్టుగా చెప్పే పోస్టర్లు, బాంబుల తయారీకి సంబంధించిన వీడియోలు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) జరిపిన దాడుల్లో లభించాయి.

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు... 4% డీఏ పెంపు



జూలై 1 నుంచి వర్తింపు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు దసరా కానుక లభించింది. ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యాన్ని (డీఏ), 4 శాతం పెంచుతూ కేంద్ర కేబినెట్ బుధవారం నిర్ణయం తీసుకుంది. ఈ పెరుగుదల జూలై 1 నుంచి అమల్లోకి తీసుకురానున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వంలోని 41.85 లక్షల మంది ఉద్యోగులకు, 69.76 లక్షల మంది ఫించనుదారులకు లబ్ధి చేకూరుతుంది. మూల వేతనంపై 34శాతంగా ఉన్న డీఏకి అదనంగా 4% పెంచడంతో 38శాతానికి చేరుకుంది. ఈ పెంపుతో ఖజానాపై ఏడాదికి 12.852 కోట్ల అదనపు భారం పడుతుంది.

మరో మూడు నెలలు ఉచితంగా రేషన్

కరోనా సంక్షోభ సమయంలో లాక్‌డౌన్లతో ఉపాధి కోల్పోయిన నిరుపేదల్ని ఆదుకోవడానికి ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) పేరుతో ఉచితంగా ఇచ్చే రేషన్ పథకం ఈ శుక్రవారంతో ముగిసిపోనుంది. ధరల భారం, పండుగ సీజన్ వస్తూ ఉండడంతో మరో మూడు నెలలు ఉచితంగా రేషన్ అందించాలని కేంద్ర మంత్రిమండలి నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర కేబినెట్ బుధవారం సమావేశమై పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పీఎంజీకేఏవై కింద ఉచిత రేషన్ పథకాన్ని మరో మూడు నెలలు కొనసాగించాలని నిర్ణయించింది. వివరాలను కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు వెల్లడించారు గరీబ్ కళ్యాణ్ అన్న యోచన పథకం కింద నిరుపేదలు ఒక్కొక్కరికి ప్రతీ నెల 5 కేజీల బియ్యం, గోధుమలు ఉచితంగా అందిస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు ఈ పథకాన్ని పొడిగించడంతో కేంద్రానికి అదనంగా రూ.44,762 కోట్లు ఖర్చు అవుతుంది. ప్రతీ నెల 80 కోట్ల మంది ఉచిత రేషన్‌ని తీసుకుంటున్నారు.

రైల్వేల అభివృద్ధికి రూ.10వేల కోట్లు

రైల్వేల అభివృద్ధి ప్రాజెక్టుకి రూ.10 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయింది. న్యూఢిల్లీ, అహ్మదాబాద్, ముంబై సీఎస్ఎంటీ రైల్వే స్టేషన్ల ఆధునీకరణ కోసం రైల్వే చేసిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. అత్యంత ఆధునిక టెక్నాలజీతో ఈ రైల్వే స్టేషన్ల ఆధునీకరణ 2.5 నుంచి మూడున్నరేళ్లలో పూర్తి చేయనున్నట్టు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.


భారత్ జోడో యాత్ర సందర్భంగా బుధవారం కేరళలో ఓ చిన్నారిని ఎత్తుకున్న రాహుల్. యాత్ర గురువారం మరోసారి తమిళనాడులో ప్రవేశించి, అక్టోబర్ 1 తేదీన కర్నాటకలో అడుగు పెట్టనుంది.

కాంగ్రెస్ అధ్యక్ష బరిలో దిగ్విజయ్!

రేపు నామినేషన్ దాఖలు చేసే అవకాశం



బెంగళూరు/న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఎన్నిక అనూహ్య మలుపులు తిరుగుతోంది. రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లాట్ ధిక్కార స్వరం వినిపిస్తుండడంతో తాజాగా సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ పేరు తెరపైకి వచ్చింది. అధ్యక్ష ఎన్నికలో దిగ్విజయ్ బరిలోకి దిగడం ఖాయమని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ఆయనవైపే మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. నామినేషన్ల ప్రక్రియ మరో రెండు రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో సోనియా గాంధీ బుధవారం సీనియర్ నాయకుడు, పార్టీకి విధేయుడైన ఏకే ఆంటోనీతో సమావేశయ్యారు. అధ్యక్ష ఎన్నికల బరిలోకి దింపాల్సిన అభ్యర్థిపై గంటన్నరకు పైగా చర్చించినట్లు తెలిసింది. మరోవైపు అశోక్ గెహ్లాట్ గురువారం సోనియాతో భేటీ అయ్యే అవకాశం ఉంది. తన వర్గం ఎమ్మెల్యేలు అధిష్టానంపై ప్రదర్శించిన ధిక్కార వైఖరి పట్ల సోనియాకు గెహ్లాట్ ఫోన్‌లో ఇప్పటికే వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల తిరుగుబాటు వెనక తన హస్తం లేదని ఆయన చెప్పినట్టు సమాచారం.

అది దిగ్విజయ్ వ్యక్తిగత నిర్ణయం

దిగ్విజయ్ సింగ్ సాధ్యమైనంత త్వరగా ఢిల్లీకి చేరుకుంటారని, శుక్రవారం నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉందని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలో పోటీ చేయాలన్నది ఆయన వ్యక్తిగత నిర్ణయమని, ఇందులో పార్టీ నాయకత్వం ప్రమేయం లేదని వెల్లడించాయి. దిగ్విజయ్ ప్రస్తుతం కేరళలో భారత్ జోడో యాత్రలో పాల్గొంటున్నారు. ఇదిలా ఉండగా, తాను సైతం బరిలో ఉంటానని సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. శుక్రవారం నామినేషన్ దాఖలు చేయబోతున్నానని ఆయన ఇటీవలే తేల్చి చెప్పారు. అధినేత్రి సోనియాగాంధీ ఆదేశిస్తే కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక బరిలో దిగేందుకు పార్టీ సీనియర్ నాయకుడు మల్లికార్జున ఖర్గే (80) సిద్ధమని ఆయన సన్నిహితుడొకరు బుధవారం చెప్పారు. అధ్యక్ష బరిలో దిగేందుకు తనకు ఆసక్తి లేదని సీనియర్ నేత కమల్‌నాథ్ మరోసారి స్పష్టం చేశారు. తన దృష్టంతా ఏడాదిలో జరగనున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలపైనే ఉందన్నారు.

యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం...

10 మంది దుర్మరణం

లఖీమ్‌పూర్ ఖేరి(యూపీ): ఉత్తరప్రదేశ్‌లోని లఖీమ్‌పూర్ ఖేరీ పరిధిలో 730 నంబర్ జాతీయ రహదారిపై బుధవారం బస్సు, మినీ ట్రక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. దౌరాహా నుంచి లక్నోకు వెళ్తున్న ప్రైవేట్ బస్సును ఐరా వంతెన మీద ఎదురుగా వస్తున్న మినీ ట్రక్ ఢీకొట్టింది. ఘటనలో గాయపడిన 41 మందికి వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్సచేస్తున్నారు. రోడ్డు ప్రమాదంపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి సంతాపం వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలు ప్రధాని జాతీయ సహాయ నిధి కింద మృతుల కుటుంబాలకు చెరో రూ.2 లక్షల ఆర్థికసాయం అందనుంది.





కండోములూ కావాలంటారేమో!

విద్యార్థినులపై మహిళా ఐఏఎస్ నోటి దురుసు



పట్నా: ఆమె పేరు హర్‌జోత్ కౌర్. ఐఏఎస్ అధికారి. బిహార్ మహిళాభివృద్ధి కార్పొరేషన్‌కు ఎండీ. అలాంటి బాధ్యతాయుత పదవిలో ఉండి, పైగా ఓ మహిళ అయ్యుండీ, ప్రభుత్వం తమకు ఉచితంగా శానిటరీ నాప్కిన్స్ ఇవ్వొచ్చుగా అన్న స్కూలు విద్యార్థినులపై నోరు పారేసుకున్నారు! ఇటీవల ఓ చర్చా గోష్ఠి సందర్భంగా ఈ ఉదంతం చోటుచేసుకుంది. ''ప్రభుత్వం ఎంతోమందికి ఉచితంగా ఎన్నో ఇస్తోంది. ఓ 30 రూపాయలు చేసే నాప్కిన్స్ మాకు ఉచితంగా ఇవ్వలేదా?'' అని ఓ విద్యార్థిని ప్రశ్నించారు. దాంతో చిర్రెత్తుకొచ్చిందో ఏమో, ''ఇవాళ నాప్కిన్స్ అడుగుతున్నారు. రేపు జీన్స్, అందమైన షూ కావాలంటారు. చివరికి ఫ్యామిలీ ప్లానింగ్ కోసం ఉచితంగా కండోమ్స్ కూడా కావాలంటారు. ఇలాంటి డిమాండ్లకు అంతన్నదే లేదా?'' అన్నారు హర్‌జోత్! ''అన్నీ ప్రభుత్వమే ఎందుకివ్వాలి? ఇది తప్పుడు ఆలోచనా ధోరణి'' అంటూ హితబోధ కూడా చేశారు. ఎన్నికలప్పుడు ప్రభుత్వాలు చాలా వాగ్దానాలు చేస్తుంటాయిగా అని అమ్మాయిలనడంతో, ''అయితే ఓటేయకండి. దేశాన్ని పాకిస్తాన్‌లా మార్చేయండి. ఇది మూర్ఖత్వానికి పరాకాష్ట'' అంటూ పెడసరంగా బదులిచ్చారు. మరో విద్యార్థిని తమ టాయ్‌లెట్ సరిగా లేదని, తరచూ బాలురు కూడా వస్తున్నారని చెబితే, ''ఇంట్లో నీకు వేర్వేరుగా టాయ్‌లెట్స్ ఉంటాయా?'' అంటూ హర్‌జోత్ ఎదురు ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

అటార్నీ జనరల్‌గా ఆర్.వెంకటరమణి



న్యూఢిల్లీ: భారత తదుపరి అటార్నీ జనరల్‌గా సీనియర్ న్యాయవాది ఆర్.వెంకటరమణి న్యాయ శాఖ మంత్రి కిరెన్ రిజిజు ఈ మేరకు ట్వీట్ చేశారు. నియామకాన్ని నిర్ధారిస్తూ కేంద్ర న్యాయ శాఖ పరిధిలోని లీగల్ అఫైర్స్ విభాగం బుధవారం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ పదవిలో వెంకటరమణి మూడు సంవత్సరాలపాటు కొనసాగుతారు. ప్రస్తుత అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ పదవీకాలం ఈ నెల 30వ తేదీతో ముగియనుంది. వేణుగోపాల్ స్థానంలో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని నియమించాలని గతంలో కేంద్రం నిర్ణయం తీసుకుంది. అయితే, సొంత కారణాలతో రోహత్గీ ఆ ప్రతిపాదనను ఇటీవల తిరస్కరించారు. వెంకటరమణి అక్టోబర్ ఒకటో తేదీన బాధ్యతలు స్వీకరిస్తారు. మోదీ తొలిసారిగా ప్రధాని అయినపుడు 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు రోహత్గీనే అటార్నీగా ఉన్నారు. ఆయన పదవీకాలం ముగిశాక వేణుగోపాల్ సేవలందించారు.

సాక్షి
విజయనగరం
గురువారం । 29 । సెప్టెంబర్ । 2022

గాయత్రీదేవిగా కనకమహాలక్ష్మి



చీపురుపల్లి: భక్తుల కొంగుబంగారం కనక మహాలక్ష్మి అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు బుధవారం దర్శనమిచ్చారు. గాయత్రీదేవి అలంకరణలో ఉన్న అమ్మవారికి పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చన జరిపారు.

30న కౌన్సెలింగ్

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్యశాఖ, వైద్య విధాన్ పరిషత్, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మిగులు పోస్టుల భర్తీకి ఈ నెల 30న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్వీ రమణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని చెప్పారు. అర్హుల జాబితాను విజయనగరం.ఏపీ.ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు వెల్లడించారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు జెరాక్స్‌సెట్‌పై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి తీసుకురావాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: సమాజ బాగుకు అహర్నిశలు శ్రమించేవారికి ఇచ్చే వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుల కోసం మహిళలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా శిశు అభివృద్ధి, సాధికారత అధికారిణి బి.శాంతకుమారి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వ్యక్తులు మాత్రమే అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని, సంస్థలు కాదని చెప్పారు. హార్డ్ కాపీలను ఐసీడీఎస్ కార్యాలయానికి 20వ తేదీలోగా సమర్పించాలన్నారు.

న్యూస్‌రీల్

డీఆర్ఎమ్‌ను కలిసిన ఎంపీ



డీఆర్ఎమ్‌తో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: వాల్తేరు డివిజన్ రైల్వే డీఆర్ఎమ్ అనూప్‌కుమార్ సత్పతిను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ విశాఖపట్నంలోని డీఆర్ఎమ్ కార్యాలయంలో బుధవారం కలిశారు. విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని రైల్వే స్టేషన్లలో కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. చీపురుపల్లిలో ఆర్‌ఓబీ పనులు మరింత వేగవంతం చేయాలని కోరారు. త్వరితగతిన ఆర్‌ఓబీ పనులు వేగవంతం చేయాలని కోరారు.

భయం.. భయం..



పులిదాడిలో మృతి చెందిన ఆవు

బొండపల్లి: ఒక్కరోజు వ్యవధిలో రెండుసార్లు పులి పంజా విసిరింది. రెండు ఆవులను పొట్టనపెట్టుకుంది. ఎప్పుడు ఎలా దాడిచేస్తుందోనన్న భయంతో గిరిజన గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. బొండపల్లి మండలంలోని వెదురువాడ పంచాయతీ పరిధిలోని చీడిపాలెం గ్రామానికి చెందిన కోటపర్తి జోగమ్మకు చెందిన ఆవును బుధవారం ఉదయం సమీపంలోని అటవీ ప్రాంతంలో మేతకు విడిచిపెట్టారు. సాయంత్రానికి ఆవు రాకపోవడంతో యజమాని వెతకసాగాడు. గ్రామానికి సమీపంలో ఆవు మృతి చెంది ఉండడం, ఆ ప్రాంతమంతా పెనుగులాటతో నలిగి ఉండడం, పులి పాదముద్రలు కనిపించడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. అటవీ, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఇదే మండలంలోని శివుడిపాలెంలో మంగళవారం ఓ ఆవును హతమార్చిన విషయం తెలిసిందే.

మంత్రి బొత్స రాక నేడు

విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ జిల్లా పర్యటనలో భాగంగా గురువారం రాత్రి రానున్నారు. రాత్రి 8.00 గంటలకు పట్టణంలోని తన నివాసానికి చేరుకుంటారు. 30న ఉదయం 10 గంటలకు మెరకముడిదాం మండలం గర్భాంలో గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం నూతన భవనాలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు చీపురుపల్లి మండలం నిమ్మలవలసలో గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతుభరోసా కేంద్రం నూతన భవనాలను ప్రారంభించనున్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల విజేత వంశీకృష్ణ



మిస్టర్ విజయనగరం బాడీబిల్డర్స్ విజేత వంశీకృష్ణకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

విజయనగరం: మిస్టర్ విజయనగరం-22 పేరిట జిల్లా స్థాయిలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీల్లో వంశీకృష్ణ విజేతగా నిలిచారు. జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఒక్కరోజు చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 120 మంది బాడీ బిల్డర్లు పాల్గొన్నారు. అందులో విజేతగా నిలిచిన వంశీకృష్ణకు అతిథులు ముచ్చు రామలింగస్వామి, జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి శంకరరావు, కోరాడ శ్రీనివాసరావులు ట్రోఫీతో పాటు రూ.3000 నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. అంతకుముందు పోటీలను నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి ప్రారంభించారు. పోటీల్లో పాల్గొన్న 120 మంది బాడీబిల్డర్స్‌కు టీషర్టులను నిర్వాహకులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నమ్మి ప్రసాద్, అజయ్, సురేష్, డి.శ్రీను, డి.సన్నిబాబు, నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను తరలివచ్చిన వేళ...




సిరిమాను తరలింపులో పాల్గొన్న యువత



ముహూర్తం ప్రకారం సిరిమాను చెట్టుకు గాటుపెడుతున్న ప్రధాన పూజారి వెంకటరావు

- పులకించిన భక్తజనం
- సిరిపురంలో పూజలు జరిపిన సిరిమాను పూజారి, ప్రజాప్రతినిధులు
- జయజయధ్వానాల నడుమ సిరిమాను తరలింపు
- దారిపొడవునా అమ్మకు పసుపు నీటితో అభిషేకాలు
- సిరిమాను తరలింపులో మమేకమైన యువత
- సిరిపురం నుంచి హుకుంపేటకు చేరుకున్న సిరిమాను



అమ్మకు పసుపునీటితో చల్లదనం

విజయనగరం టౌన్/గంట్యాడ:

భక్తుల జై పైడిమాంబ.. జైజై పైడిమాంబ జయజయధ్వానాలు.. దీక్షధారుల భజనల నడుమ సిరులతల్లి పైడితల్లి సిరిమాను గంట్యాడ మండలంలోని సిరిపురం నుంచి బుధవారం బయలుదేరింది. దారి పొడవునా పసుపు నీటితో భక్తులు అభిషేకాలు జరపగా.. వేలాది మంది భక్తుల సమక్షంలో సిరిమాను బండి ముందుకు సాగింది. విద్యల నగరానికి చేరుకున్న వేళ సిరిమానును చూసి భక్తలోకం పులకించిపోయింది. ఎడ్లబండ్లపై సిరిమాను, ఇరుసుమానులను పైడితల్లి దీక్షధారులు, దేవదాయశాఖ అధికారులు, పోలీసుల సహకారంతో తరలించారు. అయ్యన్నపేట, కలెక్టరేట్ కూడలి, జిల్లా పోలీస్ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్, ఎత్తుబ్రిడ్జి మీదుగా రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారు పుట్టిన వనంగుడికి రాత్రి 8.30 గంటలకు చేరుకుంది. అక్కడ అమ్మకు జనం హారతిపట్టారు. అభిషేకాలు చేశారు.

ప్రత్యేక పూజలు అనంతరం అక్కడ నుంచి బయలుదేరిన సిరిమాను గాడీఖానా, వైఎస్సార్ సర్కిల్, ఎన్‌సీఎస్ రోడ్డు, కన్యకాపరమేశ్వరి ఆలయం, గంటస్తంభం మీదుగా చదురుగుడికి చేరింది. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం శివాలయం వీధి మీదుగా పార్కుగేట్, సుద్దవీధి మీదుగా హుకుంపేటలో ఉన్న పూజారి బంటుపల్లి వెంకటరావు ఇంటి వద్దకు రాత్రి 11 గంటలకు చేరుకుంది.



చెట్టువద్ద టెంకాయ కొడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

అమ్మకు ప్రత్యేక పూజలు

గంట్యాడ మండలం సిరిపురం గ్రామంలోని సిరిమాను, ఇరుసుమాను చెట్లకు ఉదయం భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. మహూర్తం ప్రకారం 8.15 గంటలకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణాల నడుమ చెట్లను నరికే కార్యక్రమాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. సిరిమాను పూజారి వెంకటరావుతో కలిసి చెట్టుపై తొలిగాటు పెట్టారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ పైడితల్లి జాతరకు రాష్ట్రం నలుమూలాల నుంచి భక్తులు వస్తారని, ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. 37 సంవత్సరాలుగా సిరిమాను తరలింపు కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు వెల్లడించారు. అమ్మవారు ప్రజలందరినీ చల్లగా చూడాలన్నారు. అమ్మవారి దయతో జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాక్షించారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి మరిన్ని సంక్షేమ పథకాలు అమలుచేసే శక్తిని అమ్మవారు అందించాలని ఆకాంక్షించారు.

సిరిపురంలో భక్తజన సందడి

సిరిమాను చెట్టు తరలింపు కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున సిరిపురం చేసుకున్నారు. దీంతో ఆ గ్రామం భక్తసంద్రంగా మారింది. సిరిమాను చెట్టుకు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ఇసరపు రేవతి దేవిలు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అవనాపువిక్రమ్, కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, ఆర్డీఓ ఎ.వి.సూర్యకళ తదితరులు పూజలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్న రాఘవ, ఎంపీడీఓ వై.భవానీ, ఈఓపీఆర్డీ భానోజీరావు, డిప్యూటీ తహసీల్దార్ స్వర్ణకుమార్‌లు పాల్గొన్నారు.



పులివేషాల ప్రదర్శన

మధ్యాహ్నం 3.30 నుంచి...

సిరిపురం గ్రామం నుంచి సిరిమాను, ఇరుసుమాను చెట్లను నరికి తరలింపునకు సిద్ధం చేశారు. 3:30 గంటల ప్రాంతంలో గ్రామం నుంచి సిరిమాను బయలుదేరింది. విజయనగరం వరకు ఎడ్లబండిపైన, అనంతరం ఆ బండిని యువకులే ముందుకు నడిపించారు.










చెట్టును కొడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, మేయర్ విజయలక్ష్మి, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, విక్రమ్, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ

అక్టోబర్ 9, 10 తేదీల్లో సినీ, లలిత సంగీత పోటీలు

- 30లోగా దరఖాస్తుల స్వీకరణ
- కలెక్టర్ సూర్యకుమారి



కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా జిల్లాకు చెందిన గాయకులకు సినీ, లలిత సంగీత పోటీలు నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.సూర్యకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 9, 10 తేదీల్లో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగే పోటీలకు 15 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సుగల స్త్రీ, పురుషులు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు తమ దరఖాస్తులను కలెక్టరేట్‌లో ఉన్న జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయానికి నేరుగా గానీ 'డీఐపీఆర్ఓవిజయనగరం' జీమెయిల్ ద్వారా గానీ పంపవచ్చని తెలిపారు. దరఖాస్తుదారులు తమ బయోడేటా, చిరునామా, మొబైల్ నంబర్ తదితర వివరాలను పూరించి దరఖాస్తులను మెయిల్‌కు నేరుగా పంపించాలని సూచించారు. అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ప్రవేశ రుసుముగా రూ.100 చెల్లించాలన్నారు. రుసుమును నేరుగా లేదా నగదు రూపంలో గాని 96181 88624 ఫోన్ నంబర్‌కు ఫోన్ పే ద్వారా చెల్లించి స్క్రీన్ షాట్‌ను అదే ఫోన్‌కు పంపాలని స్పష్టం చేశారు. దరఖాస్తులను సెప్టెంబర్ 30వ తేదీలోగా అందేలా పంపాలన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు జ్ఞాపికలు, సర్టిఫికేట్‌లను అందజేస్తామని చెప్పారు. అశ్లీల సాహిత్యం ఉన్న పాటలు నిషిద్ధమని, పాల్గొనే వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందిస్తామని తెలిపారు. మిగిలిన వివరాలకు సెల్: 9121 215263 నంబర్‌ను సంప్రదించాలన్నారు. శాస్త్రీయ సంగీత పోటీలను అదే వేదిక వద్ద అవే తేదీల్లో నిర్వహిస్తామని చెప్పారు. ఈ విభాగానికి చెందిన దరఖాస్తులను జిల్లా ఆడిట్ ఆఫీసర్ కార్యాలయానికి అందజేయాలన్నారు.

ర్యాగింగ్ చేస్తే జైలు శిక్ష తప్పదు

- సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీ కుమారి




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి లక్ష్మీకుమారి

డెంకాడ: ర్యాగింగ్ చేస్తే చట్టప్రకారం జైలు శిక్ష విధిస్తామని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి తెలిపారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం యాంటీ ర్యాగింగ్‌పై న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే జైలు శిక్షతో పాటు అపరాధ రుసుము, కళాశాల నుంచి పంపివేయడం జరుగుతుందన్నారు. వేరే కళాశాలల్లో కూడా వీరిని చేర్చుకోరని వివరించారు. విద్యార్థులు తోటి విద్యార్థులను సోదర భావంతో చూడాలన్నారు. మత్తు పదార్థాలకు యువత బానిసలు కావొద్దన్నారు. డ్రగ్స్‌ను ఎవరైనా సరఫరా చేస్తే టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎల్ రాజు మాట్లాడుతూ కళాశాల వెలుపల ఆరోగ్యకరమైన వాతావరణాన్ని, సంస్కృతిని సృష్టించేందుకు నిత్యం తమ వంతు సహాయం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాన్సాస్ న్యాయ సలహాదారుడు యు.రవిశంకర్, కళాశాల వివిధ విభాగాల ప్రతినిధులు జి.ఆంజనేయులు, బి.హరికుమారి, రాజేంద్రప్రసాద్ సింగ్, ఎస్.షణ్ముఖరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఉద్యాన వర్సిటీకి ఎ-గ్రేడ్

- ఉపకులపతి జానకీరామ్



మాట్లాడుతున్న వర్సిటీ వీసీ డా.జానకిరామ్


గరుగుబిల్లి: న్యూఢిల్లీకి చెందిన భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి(ఐసీఏఆర్), జాతీయ వ్యవసాయ అక్రిడేషన్ బోర్డు (ఎన్ఏఇఏబి) స్థానిక డా.వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి ఎ-గ్రేడ్ అక్రిడేషన్‌ను ఇచ్చినట్టు వర్సిటీ వీసీ డా.టి.జానకిరామ్ తెలిపారు. ఉద్యాన కళాశాలలో విద్యార్థులతో బుధవారం నిర్వహించిన విజయోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడారు. దార్శనికుడైన దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి స్థాపించిన విశ్వవిద్యాలయం పరిశోధన, విద్య, డిజిటల్ విస్తరణలో మంచి ప్రగతిని సాధించిందన్నారు. ఎ-గ్రేడ్ అక్రిడేషన్ రావడానికి ఏపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు, సహకారం ఉందన్నారు. జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకును, అవార్డులను సాధించడంతోపాటు విశ్వవిద్యాలయం రూపొందించిన 15 నూతన వంగడాలకు కేంద్రం ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. డిజిటల్ విస్తరణ ద్వారా నిరంతరం రైతులకు అందుబాటులో ఉండేలా కార్యక్రమాలను, మౌలిక సదుపాయాలను కల్పించడం, వందకుపైగా సహాయ ఆచార్యుల పోస్టులను భర్తీచేసినట్టు తెలిపారు. అనంతరం కళాశాల అసోసియేట్ డీన్ బి.ప్రసన్నకుమార్‌ను దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా.బి.శ్రీనివాసరావు, ఎస్టేట్ ఆఫీసర్ ఎంవీ మల్లికార్జునరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

విజయనగరం గంటస్తంభం: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు గురువారం విజయనగరం జిల్లాకు వస్తారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ధర్మపురి మెయిన్‌రోడ్డులో జరిగే సమావేశంలో పాల్గొంటారన్నారు.

హోరాహోరీగా..





పరుగు పోటీని ప్రారంభిస్తున్న జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్‌కోచ్ అప్పలనాయుడు, తదితరులు, (ఇన్‌సెట్లో) హైజంప్ చేస్తున్న క్రీడాకారిణి

- అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు
- ఏలూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన పోటీలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి కె.సన్యాసినాయుడు ప్రారంభించారు. అండర్-14, 16, 18, 20 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 500 మంది హాజరయ్యారు. పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, షార్ట్‌పుట్, జావిలిన్‌త్రో తదితర విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక పోటీలు సాగాయి. ఇందులో ప్రతిభ చూపిన వారిని వచ్చేనెల 15, 16, 17 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఎంపిక పోటీల్లో అర్హత సాధించిన క్రీడాకారుల వివరాలను రెండు రోజు ల్లో వెల్లడిస్తామని చెప్పారు. ఎంపికలకు న్యాయ నిర్ణేతలుగా వ్యాయామ ఉపాధ్యాయులు వి.ఆనంద్‌కిశోర్, పి.గౌరీశంకర్, తవిటినాయుడు, జి.గురునాయుడు, ఎ.గణేష్‌కుమార్, శ్రీనివాసరావు, జి. నర్సింగరావు, జి.శ్రీకాంత్, పి.సతీష్ ఎస్.శ్రీనివాసరావు, సీనియర్ క్రీడాకారులు పి.సత్తిబాబు, ఎం.మధు శ్రీనివాసరావు, టి.అప్పారావులు వ్యవహరించినట్టు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి లీలాకృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

పుణ్యగిరిలో వేలంపాట

శృంగవరపుకోట: ఉత్తరాంధ్రలో విశిష్ట శైవక్షేత్రంగా పేరుగాంచిన పుణ్యగిరి దేవస్థానంలో అమ్మకాల హక్కుల కోసం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వై.వి.రమణి నేతృత్వంలో బుధవారం వేలంపాట నిర్వహించారు. పుణ్యగిరిరోడ్డులో ఉన్న ధారగంగమ్మ ఆలయంలో వేలంపాట సాగింది. అక్టోబర్ 30 నుంచి డిసెంబర్ 30వ తేదీ వరకు రెండు నెలల కాలానికి పండ్లు, భరిణెలు అమ్ముకునే హక్కులను రూ.1,21,000లకు, ఫొటోలు, ప్రమిదల అమ్మకాలకు రూ.84,000లకు, కొబ్బరి చెక్కల పాటను రూ.36,000లకు పాటదారులు కైవసం చేసుకున్నారు. వేలంపాటలో దేవస్థానం ఈఓ కె.నాగేంద్ర, చైర్మన్ పాలమరశెట్టి రామకృష్ణ, డైరెక్టర్ ఎలమంచిలి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖైనీ,గుట్కా స్వాధీనం

విజయనగరం క్రైమ్: స్థానిక పుత్సల వీధి జంక్షన్‌లో బొలెరో వాహనంలో తరలిస్తున్న రూ.40వేల విలువైన ఖైనీ,గుట్కా ప్యాకెట్ల బస్తాలను టూటౌన్ పోలీసులు బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక వైఎస్సార్ నగర్‌కు చెందిన వెంకటరమణ ఎటువంటి అనుమతుల్లేకుండా వాటిని రవాణా చేస్తుండగా పట్టుకుని సీజ్ చేసి, నిందితుడ్ని అదుపులోకి తీసుకుని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగకు దేహశుద్ధి

- పోలీసులకు అప్పగించిన ప్రజలు



రామభద్రపురం: మండలకేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికుడి జేబులోనుంచి సెల్‌ఫోన్ దొంగతనం చేస్తూ స్థానికులకు నిందితుడు పట్టుబడడంతో దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే అంతరరాష్ట్ర కూడలి రామభద్రపురం మండలకేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఇటీవల సెల్‌ఫోన్‌ల దొంగతనాలు అధికమయ్యాయి. బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు ఆదుర్దాపడుతుంటే అదే అదునుగా దొంగలు తమ పని చక్కబెడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఓ ప్రయాణికుడు బస్సు ఎక్కుతుండగా అతని జేబులో నుంచి మెంటాడ మండలం పిట్టాడకు చెందిన కార్తీక్ సెల్‌ఫోన్ దొంగలించాడు. ఆర్టీసీ బస్సుల దగ్గర వేరుశనగ కాయలు, పండ్లు విక్రయిస్తున్న చిరువ్యాపారి గమనించి నిందితుడు కార్తీక్‌ను పట్టుకున్నాడు. దీంతో ప్రయాణికులు, స్థానికులు గుమికూడి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. నిందితుడు గతంలో సెల్‌ఫోన్‌లు ఏమైనా దొంగిలించాడా, కేసులేమైనా నమోదై ఉన్నాయా? అని ఎస్సై సురేంద్రనాయుడు విచారణ చేయగా ఆంధ్రలో జరిగిన హత్య కేసులో నిందితుడిగా కేసు నమోదైనట్లు తెలియడంతో డీఎస్పీ మోహనరావు దృష్టికి ఎస్సై తీసుకెళ్లారు. పూర్తి విచారణ జరిగిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని ఎస్సై వివరించారు.

హవ్వ..!

- డీజిల్ ట్యాంక్ లేకుండా బయల్దేరిన బస్సు
- పట్టణ శివారులో ఆగిపోవడంతో చూసిన డ్రైవర్
- వేరే బస్సుల్లో ప్రయాణికుల తరలింపు



జాతీయ రహదారిపై ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

విజయనగరం అర్బన్: నడుస్తున్న బస్సు సడన్‌గా ఆగిపోయి ఇక వెళ్లదని డ్రైవర్ ప్రకటించాడంటే..సహజంగా టైర్స్ బరస్ట్ అవ్వడమో, బ్రేక్ ఫెయిల్ అవ్వడమో జరిగి ఉంటుందని ప్రయాణికులు భావిస్తారు. ప్రైవేట్ బస్సు సర్వీసులకైతే ఒక్కోసారి డీజిల్ అయిపోయిన సంఘటనలు ఎదురవుతాయి. విజయనగరం పట్టణం నుంచి వైజాగ్ వెళ్లే హైవే రూట్ ఆర్టీసీ బస్సు బుధవారం సడన్‌గా ఆగిపోయింది. బస్సు వెళ్లలేకపోవడానికి కారణాన్ని ప్రయాణికులకు చెప్పడానికి డ్రైవర్, కండక్టర్ సందేహించారు. ఎందుకంటే గతంలో ఎప్పుడూ ఎక్కడా జరగని సంఘటన అది. బస్సు నడవడానికి అవసరమైన డీజిల్ ట్యాంక్ బస్సు కింద భాగంలో లేదు. ఇంజిన్‌లోని ఫిల్టర్‌లో ఉన్న పరిమిత డీజిల్‌తో అంతవరకు బస్సు నడిచింది. డీజిల్ ట్యాంక్‌లేదని చెప్పడానికి సిగ్గుపడి కారణం బయటకు చెప్పకుండా ప్రయాణికులను వేరే బస్సుల్లో పంపడానికి డ్రైవర్, కండక్టర్ హడావుడి పడ్డారు.

గ్యారేజీ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమా..?

విజయనగరం డిపో పరిధిలోని బస్సు సర్వీసుల్లో విజయనగరం-అనకాపల్లి మధ్య తిరిగే 'ఏపీ 28 జెడ్ 3761' నంబర్ గల బస్సు విజయనగరం బస్టాండ్‌లో ఉదయం 5.45 గంటలకు బయలుదేరింది. బస్టాండ్ నుంచి కిలోమీటర్ దూరం వెళ్లాక పట్టణ శివారులో ఆగిపోయింది. ఇంజిన్ ఫిల్టర్‌లో ఉన్న ఒక లీటర్ డీజిల్‌తో అంతవరకు వచ్చిందని ఆర్టీసీ మరో డ్రైవర్ వివరణ ఇస్తున్నారు. సహజంగా పూర్తిగా ఫిట్‌నెస్ ప్రమాణాలను నిర్ధారించాకే గ్యారేజీ అధికారులు బస్సులను బయటకు పంపుతారు. అందుకోసం వివిధ స్థాయిల్లో పరిశీలించి సర్వీసుకు వెళ్లే జాబితాలోని బస్సుల్లో గల డీజిల్ ట్యాంక్‌ల్లో డీజిల్ నింపి ముందురోజు సిద్ధంగా ఉంచుతారు. ఉదయాన్నే విధులకు వెళ్లే డ్రైవర్లు ఆ బస్సులను నేరుగా తీసుకెళ్లారు. గ్యారేజీలోని వివిధ స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఫిట్‌నెస్ లేని బస్సు బయటకు వచ్చినట్లు తెలుస్తోంది.



బస్సు కిందిభాగం మధ్యలో ఉండాల్సిన ట్యాంక్ స్థానం

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం

ఫిట్‌నెస్ ఉన్న బస్సులను మాత్రమే గ్యారేజీ నుంచి విధులకు పంపుతాం. విధులకు పంపకూడని బస్సులను గ్యారేజీలో మరో వైపు ఉంచుతాం. అలాంటి బస్సులు బుధవారం 11 వరకు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంపకూడని బస్సులను విధులకు పొరపాటున పంపినట్లున్నారు. దీనిపై విచారణకు ఆదేశించాం. కారకులపై చర్యలు తీసుకుంటాం.

-కొటాన శ్రీనివాసరావు, జిల్లా పబ్లిక్ రవాణా అధికారి

సైనిక పాఠశాలలో వార్షిక అథ్లెటిక్స్ మీట్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కల్నల్ అరుణ్ ఎం.కులకర్ణి



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం రూరల్: సైనిక్ స్కూల్ కోరుకొండలో వార్షిక అథ్లెటిక్ మీట్ 'జోష్' 2022ను క్యాడెట్‌ల మార్చ్‌పాస్ట్‌తో ప్రిన్సిపాల్, కల్నల్ అరుణ్ ఎం.కులకర్ణి బుధవారం ప్రారంభించారు. 28 నుంచి 30వ తేదీ వరకు వివిధ ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్‌లలో 24 మంది బాలికలు, బాలురు క్యాడెట్‌లతో కలిపి 400 మంది క్యాడెట్‌లు పోటీ పడనున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బాలురు, బాలికలు, సిబ్బందికి వివిధ ట్రాక్ అండ్ ఫీల్డ్ క్రీడలను నిర్వహించి విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు. క్యాడెట్‌లను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వివిధ క్రీడల్లో విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి అదనపు జోష్‌లో ఉంచాలని క్యాడెట్‌లందరికీ పిలుపునిచ్చారు. క్రీడలతో శారీరక దారుఢ్య, మానసిక ఉల్లాసం కలుగుతుందని, ప్రతి విద్యార్థి వాటి పట్ల ఆసక్తికనబరచాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన మేకల పోతన్నదొర మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఎస్సై పి.లీలావతి బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ఒమ్మి గ్రామానికి చెందిన వంగా వెంకటరమణకు పోతన్నదొర గతంలో రూ.14 లక్షలు అప్పు ఇచ్చాడు. ఆ డబ్బులను తిరిగి అడిగినప్పటికీ వెంకటరమణ ఇవ్వకపోగా పోతన్నదొరపై బెదిరింపులకు దిగుతూ దుర్భాషలాడి డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించాడు. ఈ విషయమై కోర్టును ఆశ్రయించిన పోతన్నదొర డిసెంబర్ 2021లో కేసు గెలిచాడు. అయినప్పటికీ తనకు ఇవ్వాల్సిన డబ్బులు వెంకటరమణ తిరిగి ఇవ్వకుండా ప్రతిరోజూ దుర్భాషలాడడంతోపాటు చంపుతానని బెదిరిస్తున్నాడు. వస్త్రపురికాలనీ వద్ద చేపలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న పోతన్నదొర దగ్గరకి ఈ నెల 26న వెంకటరమణ వచ్చి నన్ను ఏమీ చేయలేవని దుర్భాషలాడుతూ కులంపేరుతో దూషించాడు. దీంతో మనస్తాపం చెందిన పోతన్నదొర ఈ నెల 27న రాత్రి ఇంట్లో పురుగు మందు తాగాడు. విషయం గమనించిన కుటుంబసభ్యులు రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్స అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండె నిబ్బరం అవసరం

- ఒత్తిడితో పెరుగుతున్న హృద్రోగాలు
- నేడు ప్రపంచ గుండె దినోత్సవం



రోగికి బీపీ చెక్ చేస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: మానవుని ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు వచ్చాయి. ఉరుకులు పరుగులతో జీవనంతో ఉద్యోగులకు పనిఒత్తిడి, నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల వారు జీవనం ఎలా సాగించాలనే ఆందోళన, విద్యార్థులకు భవిష్యత్తుపై బెంగ ఇలా ప్రతి ఒక్కరిలోనూ కలిగే మానసిక సమస్యతో ప్రధానమైన గుండెకు హానిజరిగే ప్రమాదం ఉంది.

ఒత్తిడే ప్రధాన కారణం

గుండె పోటుకు ప్రధాన కారణం ఒత్తిడే. ప్రమాదకర ఒత్తిడి పట్ల ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. కోవిడ్ మహమ్మారి ప్రజల మానసిక ఆరోగ్య నాణ్యతను దెబ్బతీసింది. మనిషిలో కనిపించే ఒత్తిడిని కోవిడ్ వ్యాధి మరింత పెంచింది. తగినంత నిద్ర లేకపోవడం, అనారోగ్య కారణాల వల్ల సాధారణంగా ఒత్తిడి కనిపిస్తుంటుంది. భావోద్వేగ కారణాలు, తగినంత డబ్బులేదనే బాధ, ప్రియమైన వారు మరణించడం కూడా ఒత్తిడికి కారణం. ఒత్తిడికి శరీరం స్పందించే తీరు మనిషిని రక్షిస్తుంటుంది. ఒత్తిడి నిరంతరం పెరిగితే ప్రమాదకరంగా పరిణమిస్తుంది. ఒత్తిడి పెరగడం వల్ల రక్త నాళాల్లో కొవ్వు పేరుకుపోతుంది. దీని వల్ల హార్ట్ ఎటాక్ (గుండెపోటు) హార్ట్ ఫెయిల్యూర్స్(గుండె పనిచేయకపోవడం) జరుగుతుంది.

వ్యాధిని గుర్తించడం

గుండె జబ్బులో సాధారణంగా లక్షణాలు కనిపించవు. బీపీని వైద్యులు పరీక్షించి గుండె జబ్బును గుర్తిస్తారు. రక్తపోటు అధికంగా ఉన్నప్పుడు కొన్ని లక్షణాలు బయటపడతాయి. తలనొప్పి, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీలో నొప్పి లక్షణాలు కనిపిస్తాయి.

అధిక రక్తపోటు

రక్తనాళాల్లో రక్తం సాధారణ ఒత్తిడికంటే ఎక్కువ ఒత్తిడితో ప్రసరించినప్పుడు దానిని అధిక రక్తపోటు అంటారు.బిపి 140/90 ఎంఎంహెచ్‌జీ లేదా అంతకన్నా ఎక్కువగా ఉన్నట్టు అయితే వైద్యులు అధిక రక్తపోటుగా గుర్తిస్తారు.

హైపర్ టెన్షన్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ప్రతి రోజూ అరగంట పాటు వ్యాయమం చేయాలి. మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా గడపాలి. పొగ, మద్యం తాగడం పూర్తిగా మానివేయాలి. యోగా, దైవభక్తి పెంపొదించుకోవాలి. ఉప్పు, మసాలాలు, తగ్గించుకోవాలి. అధిక పిండి పదార్థాలు, జంక్ ఫుడ్ తగ్గించుకోవాలి. 30 సంవత్సరాలు పైబడిన వారు ప్రతి 6 నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు చేయించకోవాలని హృద్రోగ చికిత్స నిపుణులు సూచిస్తున్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల ఫలితాలు విడుదల

విజయనగరం పూల్‌బాగ్: ఈ ఏడాది జూలైలో జరిగిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్, హయ్యర్ గ్రేడ్ (డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, హ్యాండ్‌లూమ్ వీవింగ్) పరీక్షల ఫలితాలు విడుదలైనట్టు డీఈఓ కె.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలను www. bre.ap.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు. ఉత్తీర్ణులైనవారు మార్కుల జాబితాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెపిల్లలు

మెరకముడిదాం: కుక్కలు దాడి చేయడంతో మండలంలోని రాచగుమడాం గ్రామస్తుడు బాగు నరసింహులుకు చెందిన 30 గొర్రె పిల్లలు బుధవారం మృతి చెందాయి. గ్రామానికి కొంత దూరంలో ఉన్న కళ్లాల వద్ద గొర్రె పిల్లలు శాలలో ఉండగా కుక్కలు దాడి చేసి చంపేశాయని బాధితుడు నరసింహులు వాపోయాడు. గొర్రెలను మేతకు తీసుకుని వెళ్లిపోయామని, కళ్లం వద్ద సాయంత్రం ఎవరూ లేని సమయంలో కుక్కలు దాడి చేయడంతో గొర్రె పిల్లలు మృతి చెందాయని చనిపోయిన వాటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని ఆవేదన చెందాడు. తనను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నాడు.

జాతీయ సెపక్‌తక్రా పోటీలకు జిల్లా క్రీడాకారులు



జాతీయ సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న సెపక్‌తక్రా పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు అర్హత సాధించారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెలగాంలో జరగబోయే 25వ సబ్ జూనియర్స్ జాతీయ బాల, బాలికల పోటీలకు సంబంధించి జిల్లాలోని గంట్యాడ మండలంలో కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న వర్రి ధరణి బాలికల విభాగంలో, గజపతినగరం జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న ఎం.నవీన్‌కుమార్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ ఇద్దరు క్రీడాకారులు అనంతపురం జిల్లాలోని ఉరవకొండలో నిర్వహిస్తున్న కోచింగ్ క్యాంప్‌కు హాజరవుతున్నట్లు జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ కార్యదర్శి వై.రాజేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జె.రామారావులు తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావులు అభినందించారు. జాతీయ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్టలు చాటి చెప్పాలని ఆకాంక్షించారు.

ఆటో, లారీ ఢీ: ఐదుగురికి తీవ్రగాయాలు



అరకు-విశాఖ రోడ్డులో జరిగిన ప్రమాదంలో రోడ్డుపై పడి ఉన్న యువతి, తుళ్లపడిన ఆటో

లక్కవరపుకోట: అరకు-విశాఖ రోడ్డులో గోల్డ్‌స్టార్ జంక్షన్ సమీపంలో బుధవారం సాయంత్రం ఓ ఆటోను వెనకనుంచి లారీ వచ్చి బలంగా ఢీ కొట్టడంతో ఐదుగురు వ్యక్తులు తీవ్ర గాయాల పాలయ్యారు. ఘటనకు సంబంధించి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తామరాపల్లి గ్రామానికి చెందిన సబ్బి అప్పలనాయుడు తన ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకుని కొత్తవలస నుంచి ఎస్.కోట వెళ్తున్నాడు. గోల్డ్‌స్టార్ జంక్షన్‌కు చేరుకునేసరికి ముందు గల దాబా వద్ద ప్రయాణికుడిని దించేందుకు ఆటో ఆపాడు. అదే సమయంలో ప్రజాపంపిణీ బియ్యం లోడుతో వెనుక నుంచి వచ్చిన లారీ బలంగా ఢీకొట్టడంతో ఆటో తుళ్లిపోయి సుమారు 10 అడుగుల దూరంలో పడడంతో అందులో ప్రయాణిస్తున్న ఎస్.కోట,ఎల్.కోట మండలాలకు చెందిన నలుగురు వ్యక్తులు, డ్రైవర్ అప్పలనాయుడు తీవ్రంగా గాయపడ్డారు క్షతగాత్రులను 108 వాహనంలో విశాఖపట్నం తరలించారు. క్షతగాత్రుల్లో రంగరాయపురం గ్రామానికి చెందిన యువతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. సమాచారం మేరకు ప్రమాద స్థలానికి స్థానిక ఎస్సై ఎం.ముకుందరావు సిబ్బందితో వెళ్లి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

విశాఖ ఫారెస్ట్ సర్కిల్ విభజన

డివిజన్	ఫారెస్ట్ విస్తరణ(హెక్టార్లు)	అధికారి	మొబైల్ నంబర్
పార్వతీపురం	107724.57	జి.ఎ.పి.ప్రసూన	94408 10124
విజయనగరం	17240.15	ఎస్.వెంకటేష్	94408 10038

బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): మూడు జిల్లాలు, ఐదు టెరిటోరియల్స్, మూడు సోషల్ ఫారెస్ట్రీ డివిజన్లుగా ఉన్న విశాఖపట్నం ఫారెస్ట్ సర్కిల్‌ను విభజించారు. ఈ సర్కిల్‌ను ఆరు జిల్లాలు, ఏడు టెరిటోరియల్స్, ఒక సోషల్ ఫారెస్ట్రీ డివిజన్‌గా విభజిస్తూ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రామ్మోహనరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా డివిజన్లకు సంబంధించి అధికారులను ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 435.00
విజయనగరం	రూ. 439.00
శ్రీకాకుళం	రూ. 439.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	50,200-00
బంగారం(22కి. 10గ్రా.)	46,000-00
వెండి (కిలో)	60,700-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240



వైఎస్సార్ చేయూత ఓ వరం

- విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్
- లబ్ధిదారులకు రూ.27.32 కోట్ల చెక్కు పంపిణీ



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎంపీ బెల్లాన, మేయర్ విజయలక్ష్మి, ఎంపీపీ అప్పలనాయుడు, డిప్యూటీ మేయర్

విజయనగరం:

వైఎస్సార్ చేయూత పథకం మహిళలకు ఒక వరమని, మహిళాభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో విజయనగరం నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ చేయూత మూడో విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, రేవతీదేవి, తదితరులతో కలిసి ఎంపీ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజయనగరం అర్బన్ పరిధిలోని 11,131 మంది లబ్ధిదారులకు గాను రూ.21.21 కోట్లు, రూరల్ పరిధిలో ని 3,258 మంది లబ్ధిదారులకు రూ.6.11 కోట్ల చెక్కులను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ, మహిళల ఆర్థిక స్వావలంబనకు వైఎస్సార్ చేయూత ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్ చేయూత పథకం కింద రూ.18,750 చొప్పున ఇప్పటికీ మూడు విడతలుగా ఒక్కొక్కరికి రూ.75 వేల రూపాయలను జమ చేసినట్లు చెప్పారు. జగనన్న అందిస్తున్న ప్రోత్సాహక పథకాలతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకొని స్వశక్తితో ఎదగాలని పిలుపునిచ్చారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, అక్క,చెల్లెమ్మలకు అండగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో మరలా ముఖ్యమంత్రి పదవి ఇచ్చి ఆశీస్సులు అందించాలని కోరారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, నేరుగా మహిళల ఖాతాలకే డబ్బులు జమ చేస్తూ అందిస్తున్న ఆదర్శవంతమైన పాలన దేశంలో మరెక్కడా లేదని కొనియాడారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి తద్వారా ప్రజాసేవలు మరింత సరళతరం చేయడం గొప్ప విషయంగా వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ సుధాకరరావు, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, మండల పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు, కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



హాజరైన మహిళలు

అందరి సహకారంతో ఉత్సవాలు

- నగరంలో ప్లాస్టిక్ సంచుల వినియోగంపై కఠిన అంక్షలు
- ఉత్సవాల్లో పాల్గొనేందుకు ముందస్తు అనుమతులు తప్పనిసరి
- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



విజయనగరం: ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పైడితల్లమ్మ జాతరతో పాటు విజయనగరం ఉత్సవాలు అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు అన్నారు. బుధవారం తన చాంబర్‌లో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 9,10,11 తేదీల్లో జరగనున్న రెండు ఉత్సవాలు నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఉత్సవాలు విజయవంతంగా ముగించేందుకు ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా నగరంలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్న నేపథ్యంలో ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు చేపట్టరాదని వ్యాపారులకు సూచించారు. మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తూ అనేక దుకాణాలలో ఉన్న ప్లాస్టిక్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకోవడం జరిగిందని, అయినప్పటికీ కొన్ని దుకాణాలలో ఇంకా విక్రయాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణ మండలి, కార్పొరేషన్ సిబ్బంది సంయుక్తంగా ప్రతిరోజూ దాడులు చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా వీధి విక్రయదారులు తప్పనిసరిగా తమ పేర్లను నమోదు చేసుకుని గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తూ కొన్నిచోట్ల దుకాణాలు నిర్వహిస్తున్నారని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏ ప్రాంతంలోనైనా దుకాణం నిర్వహించాలనుకునేవారు ముందుగా ఆయా సచివాలయ పరిధిలోని ఏమినిటీస్ కార్యదర్శికి సమాచారం అందించాలన్నారు.

అనుమతి తప్పనిసరి..

విజయనగర ఉత్సవాల నేపథ్యంలో అయోధ్య మైదానంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయటం జరుగుతుందని, ఇందులో భాగంగా రెండు రోజులపాటు ఫుడ్ స్టాల్స్‌ను (తాత్కాలిక ఆహార విక్రయ కేంద్రాలు) నిర్వహించాలనుకునేవారు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ వారికి తమ వివరాలను అందించి అనుమతి తీసుకోవాలని సూచించారు. అలాగే గురజాడ కళాభారతి ప్రాంగణంలో అక్టోబర్ 9 ,10 తేదీలలో నిర్వహించనున్న నాటక ప్రదర్శనలకు ఔత్సాహిక కళాకారులు తమ వివరాలను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారికి వివరాలు అందించి అనుమతి పొందాలని చెప్పారు. ఉత్సవాల నిర్వహణకు అందరి సహకారం అవసరమన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

భోగాపురం: మండలంలోని రామచంద్రపేటలో 'మనబడి నాడు- నేడు' రెండో విడత కార్యక్రమంలో భాగంగా రూ.13.50 లక్షల నిధులతో చేపట్టిన నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు సర్పంచ్ దుక్క గౌరి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుక్క అప్పన్న, ఎంపీటీసీ మాజీ సభ్యులే సుగ్గి రాము, దుక్క రమణ, అంగన్‌వాడీ కార్యకర్త పైడితల్లి, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ దుక్క గౌరి



ప్రకృతి కరుణించింది. వర్షాలు సమృద్ధిగా కురవడంతో వరి చేలు ఏపుగా పెరుగుతున్నాయి. విజయనగరం జిల్లా గంట్యాడ రోడ్డులో కనుచూపు మేర కనిపించే పచ్చని చేలు అటువైపుగా వెళ్లేవారికి కనువిందు కలిగిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు



సీఎం కప్ తైక్వాండో పోటీలకు పయనమైన జిల్లా క్రీడాకారులు

- ఈ 29 నుంచి నెల్లూరులో జరగనున్న పోటీలు

విజయనగరం: ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే 4వ ఏపీ సీఎం కప్ తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు బుధవారం పయనమయ్యారు.

ఈ నెల 29 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో జరగబోయే పోటీలకు జిల్లా నుంచి 60 మంది క్రీడాకారులు వివిధ కేటగిరీల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు, కోశాధికారి అవనాపు విక్రమ్‌లు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జూదరుల అరెస్ట్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బొప్పడాంలో పేకాటాడుతున్న వారిపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి 1,10,330 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై నారాయణరావు మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు దాడులు చేపట్టామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి

విజయనగరం ఫూల్‌బాగ్: ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సర్దార్ భగత్‌సింగ్ జయంతిని కోట ప్రాంతంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు డి. రాము, ఎన్. రుద్రప్రసాద్ మాట్లాడుతూ, 23 ఏళ్లకే దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన భగత్‌సింగ్ నేటి సమాజానికి ఆదర్శనీయడని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శులు సౌమ్య, కె. జగదీష్, జె. రవికుమార్, డీవైఎఫ్‌ఐ నాయకుడు సీహెచ్ అరవింద్, ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముంపు సమస్యలకు చెక్



కలెక్టరేట్‌లో జరుగుతున్న నిర్మాణ పనులు

- రూ.26 లక్షల వ్యయంతో ఇంటర్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు

విజయనగరం అర్బన్: పట్టణంలో ఏ మాత్రం వర్షం పడినా కలెక్టరేట్ ప్రాంగణం వర్షపు నీటితో మునిగిపోయేది. దీంతో ఉద్యోగులు, ప్రజలు ఇబ్బంది పడేవారు. ఈ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఎ.సూర్యకుమారి చొరవ చూపారు. వర్షపునీరు బయటకు వెళ్లే మార్గం లేకుండా గతంలో ఇక్కడి అంతర రహదారుల నిర్మాణం లోతుగా జరిగాయని గుర్తించి పునఃనిర్మాణానికి సిద్ధమయ్యారు. ఇందు కోసం రూ.26 లక్షలు కేటాయించారు.

ఈ మేరకు నిర్మాణ పనులను ఇటవల డీఆర్‌ఓ ఎం.గణపతిరావు ప్రారంభించారు. ప్రధాన పోర్టుకో నుంచి ప్రాంగణానికి ఇరువైపులా ఉన్న ఇన్, అవుట్ గేట్ల పక్కనుంచి వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు డ్రైనేజీ నిర్మిస్తున్నట్లు కలెక్టరేట్ ఏఓ దేవీప్రసాద్ తెలిపారు.

జ్ఞాన సరస్వతికి ప్రత్యేక పూజలు

- ఆకట్టుకున్న మైలవరపు శ్రీనివాస్ ఆధ్యాత్మిక ప్రసంగం
- వాడవాడలా దుర్గమ్మ ఉత్సవాలు



అమ్మవారి పల్లకీసేవలో పాల్గొన్న, ఆధ్యాత్మిక ప్రవచనకర్త మెలవరపు శ్రీనివాసరావు, తదితరులు



రైల్వేస్టేషన్ వద్దనున్న వనం గుడిలో గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న దుర్గాదేవి



గాజులరేగ సాలివీధిలో పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న దుర్గమ్మ



సిటీ బస్టాండ్ వద్దనున్న ఆలయంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న కనకమహాలక్ష్మి అమ్మవారు

విజయనగరం టౌన్: పట్టణంలోని రింగ్‌రోడ్డులో ఉన్న ధన్వంతరీ, సప్తమేధాగణ, లక్ష్మీ భువనేశ్వరీ సహిత జ్ఞానసరస్వతీ ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని శారదా సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించారు. విద్యాగణపతి, లక్ష్మీ హయగ్రీవస్వాములకు క్షీరాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం కోటలక్ష్మయ్యనాయుడు సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ మైలవరపు శ్రీనివాసరావు రామాయణంలోని వివిధ ఘట్టాలపై భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనం అందజేశారు.

సంగీత దర్శకుడు కోటికి జ్ఞానసరస్వతీ పురస్కారం

ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరు కోటేశ్వరరావుకి (కోటి) జ్ఞానసరస్వతీ విశిష్ట పురస్కారం అందజేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి శ్రీధర్, గుడిశ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు ఆలయ ఆవరణలో మాట్లాడుతూ, గురువారం సాయంత్రం ఆరు గంటలకు పురస్కారం ప్రదానం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి హాజరవుతారన్నారు. అలాగే మరికొందరికి డాక్టర్ చెరుకూరి చక్రపాణి స్మారక జ్ఞాన సరస్వతీ ప్రతిభా అవార్డుల ప్రదానంతో పాటూ శ్రీ సరస్వతీ ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని చెప్పారు. అనంతరం ఘంటసాల స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సంగీత గాన లహరి ఉంటుందన్నారు.

పోటెత్తుతున్న భక్తులు..

శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు దుర్గాదేవి వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో కొలువైన దుర్గాదేవి గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ వేద పండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయి శాస్త్రోక్తంగా శ్రీచక్ర కుంకుమార్చనలు నిర్వహించారు. అదేవిధంగా గాజులరేగ సాలివీధిలో కొలువైన దుర్గాదేవీ పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సిటీ బస్టాండ్ వద్దనున్న కనక మహాలక్ష్మి అన్నపూర్ణగా దర్శనమివ్వగా.. ప్రధానార్చకుడు వీకే గాయత్రీశర్మ ప్రత్యేక పూజలు చేశారు.

సిరిమాను సందడి..





సిరిమానును భుజాలపై మోస్తున్న భక్తజనం , (ఇన్‌సెట్లో) సిరిమాను చెట్టును కొడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు అవనాపు విజయ్

జిల్లా కేంద్రంలో సిరిమాను సందడి కనిపించింది. పైడితల్లి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవానికి సంబంధించిన చెట్టును గంట్యాడ మండలం సిరిపురంలో ఎంపిక చేశారు. ఈ మేరకు చెట్టుకు బుధవారం పూజలు చేపట్టి మేళతాళాలు, పులివేషాల మధ్య పట్టణానికి తరలించారు. దారిపొడవునా వేలాది మంది భక్తులు సిరిమానుపై ముగ్గులు, పసుపు, కుంకుమలు వేసి పూజలు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

అభివృద్ధిపథంలో కెల్ల పీఏసీఎస్



సూర్యనారాయణరాజును సన్మానిస్తున్న ఎంపీపీ ప్రమీల, సొసైటీ డైరెక్టర్లు

గుర్ల: మండలంలోని కెల్ల పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం) జిల్లాలోనే ఉత్తమ సొసైటీగా పేరు సాధించడం గర్వ కారణమని ఎంపీపీ పొట్నూరు ప్రమీల అన్నారు. కెల్ల పీఏసీఎస్ కార్యాలయం వద్ద పీఏసీఎస్ చైర్మన్ కె.వి.సూర్యనారయణరాజును బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సూర్యనారాయణరాజు 35 ఏళ్లుగా కెల్ల పీఏసీఎస్‌కు చైర్మన్‌గా ఉంటూ పీఏసీఎస్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. అనంత రం నిర్వహించిన సొసైటీ సర్వసభ్య సమావేశంలో సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రైతుల సహారారంతోనే సొసైటీని అభివృద్ధి సాధ్యపడిందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, కెల్ల వెంకటరమణ, కొంచాడ ఈశ్వరరావు, కెల్ల పైడిరాజు, కెల్ల సురేష్, కెల్ల భీమారావు, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాగునీటి సరఫరాను పరిశీలించాలి..



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల: పట్టణంలోని అన్ని వార్డులకు జరుగుతున్న నీటి సరఫరాను ఎప్పటికప్పుడు పరిశీలించాలని నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీప్రసాద్ ఆదేశించారు. జరజాపుపేట 17వ వార్డులోని కొన్ని ప్రాంతాలకు కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు పరిశుభ్రంగా ఉండడం లేదన్న స్థానికుల ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన పరిశీలించారు. నది నుంచి ట్యాంక్‌కు, ట్యాంక్ నుంచి కుళాయిలకు సరఫరా చేస్తున్న పైపులైన్లను తనిఖీచేశారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పైప్‌లైన్ల లీకులను సరిచేయడంతో పాటు సరఫరాను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు.

ఆకట్టుకుంటున్న దుర్గమ్మ మంటపం



డమరకంలో కొలువైన దుర్గమ్మ

నెల్లిమర్ల: పట్టణంలోని నాయుడుకాలనీలో దసరా ఉత్సవాల నేపథ్యంలో డమరకంలో దుర్గమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సెట్ ఆకర్షణీయంగా ఉండడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. అక్టోబర్ 5వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

కళాకారులకు సన్మానం



కళాకారులను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

విజయనగరం టౌన్: దుర్గా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బొబ్బాదిపేటలో కళాకారులను బుధవారం సత్కరించారు. పౌరాణిక, బుర్రకథ, కోలాటం, రేలారేరేలా వంటి జానపద కళాకారులను సన్మానించినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధి కె. రమణరావు తెలిపారు. మరుగున పడిపోతున్న కళలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తొగరోతు సంధ్యారాణి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఏ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మపురి, బియ్యాలపేట, ఎస్‌వీఎన్ నగర్, కమలనగర్, నోబుల్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ వినూత్న వేషధారణలతో చిన్నారులు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం సమీపంలో గల సెయింట్ అన్స్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి 9,10వ తరగతి విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు పలువురిని ఆలోచింపజేశాయి. సోలార్ శక్తి, ఇకో ఫ్రెండ్లీ వాహనాలు, విద్యుత్ చార్జింగ్ వాహనాల నమూనాలను ప్రదర్శించి, వాటివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ వినూత్నంగా నిర్వహించిన చిన్నారుల ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు అలరించాయి.

6 నుంచి గ్రామసభలు

జామి: అక్టోబర్ 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ ఏ.వి.లక్ష్మి తెలిపారు. సంబంధిత షెడ్యూల్‌ను బుధవారం ఆమె విడుదల చేశారు. 6న జాగరం, వి.ఆర్.పాలెం, వెన్నె, భీమసింగి, కలగాడ, జామి, లక్ష్మీపురం, లొట్లపల్లి, జె.డి.వలస గ్రామాల్లో, 7న విజినిగిరి, చింతాడ, ఎం.కె.వలస, జన్నివలస, తాండ్రంగి, కుమరాం, శిరికిపాలెం, ఆర్.బి.పురం, రామయ్యపాలెం, 10న ఎ.ఆర్.పేట, తానవరం, శాశనపల్లి, అట్టాడ, అలమండ, పావాడ, గొడికొమ్ము గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించునున్నట్లు పేర్కొన్నారు.

ఇంటింటా ఆనందం



విజయవాడలో సంక్షేమ పథకాల పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణు



ఏలూరు జిల్లా రాట్నాలకుంటలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



నెల్లూరు జిల్లా కందులవారిపాలెంలో ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రతి ఇంటివద్దా ప్రజలు ఆనందంతో స్వాగతం చెబుతున్నారు. అన్ని జిల్లాల్లోనూ బుధవారం నాయకులు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తమ సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెంటే తామంతా నడుస్తామన్నారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అన్ని హామీలను తప్పకుండా నెరవేరుస్తున్నామని ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరించారు.



గుండెను గాబరా పెట్టొద్దు

చిన్నా పెద్దా తేడా లేకుండా కబళిస్తున్న గుండె జబ్బులు

- ఆధునిక జీవన శైలి, ఆహారపు అలవాట్లు, దురలవాట్లే కారణం
- రాష్ట్రంలో 2020లో 60 వేల మంది మృతి

చిన్న వయసు నుంచే జాగ్రత్తలు పాటిస్తే మంచిదంటున్న వైద్యులు

సాక్షి, అమరావతి: గుండె జబ్బుతో చనిపోయారు.. పూర్వం ఈ మాట చాలా పెద్ద వయస్సు వారి గురించే వినపడేది. 40 ఏళ్ల లోపు వయస్సు వారిలో చాలా అరుదు. మరి ఇప్పుడు..?? వయసుతో సంబంధం లేదు. అన్ని వయసుల వారినీ గుండె జబ్బు వేధిస్తోంది. కాలానుగుణంగా వచ్చిన వాతావరణ మార్పులు, ఆహార అలవాట్లు, దురలవాట్లు, మానసిక ఒత్తిళ్ల వంటి కారణాల వల్ల చిన్నా పెద్దా అందరినీ గుండె జబ్బులు వెంటాడుతున్నాయి. ఇటీవలి కాలంలో 25 ఏళ్ల వయస్సు నిండని వారు కూడా గుండె పోటుతో మరణించడం తరచూ వింటున్నాం. ఈ క్రమంలో చిన్న వయస్సు నుంచే జాగ్రత్తలు పాటిస్తూ, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వైద్యులు సూచిస్తున్నారు.

రాష్ట్రంలో పరిస్థితి ఇలా

'రిపోర్ట్ ఆన్ మెడికల్ సర్టిఫికేషన్ ఆఫ్ కాజ్ ఆఫ్ డెత్స్' నివేదిక ప్రకారం 2020 సంవత్సరంలో రాష్ట్రంలో 4.55 లక్షల మరణాలు నమోదవగా వీటిలో 22.3 శాతం.. అంటే 1,01,353 మంది వివిధ అనారోగ్య సమస్యలు, జబ్బులతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వీటిలో గుండె జబ్బులతో మరణించిన వారు సుమారు 60 వేల మంది ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ మరణాల్లో హార్ట్ అటాక్, కార్డియాక్ అరెస్ట్, కరోనరీ ఆర్టరీ, కార్డియోమయోపతి (గుండె కండరాల వ్యాధి) మరణాలే అధికంగా ఉన్నాయి. మృతుల్లో పురుషులే ఎక్కువగా ఉన్నారు. ఇదే ఏడాది దేశవ్యాప్తంగా సుమారు 80 లక్షల మంది మరణించినట్లు లెక్కలు చెబుతున్నాయి. వీటిలో 18,11,688 మరణాలు వివిధ జబ్బులు, అనారోగ్య కారణాల వల్ల సంభవించినట్లు వైద్యులు ధృవీకరించారు. ఇందులో 32 శాతం మరణాలకు గుండె జబ్బులే కారణం. 2020 జూలై 1వ తేదీ నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 108 అంబులెన్స్‌లను 23 లక్షల మంది వినియోగించుకున్నారు. 108 అంబులెన్స్‌లు అటెండ్ అవుతున్న ఎమర్జెన్సీ కేసుల్లో నాలుగు శాతం మేర గుండెపోటు, గుండె సంబంధిత సమస్యలతో కూడిన కేసులు ఉంటున్నాయి.

ఈ జీవన విధానంతోనే గుండె సురక్షితం



- నలభై దాటిన వారు, రిస్క్ ఫ్యాక్టర్స్ (బీపీ, సుగర్, ఊబకాయం, ఇతర ఆరోగ్య సమస్యలు) ఉన్న వారు తరచూ జనరల్ చెకప్ చేయించుకోవాలి
- రోజుకు కనీసం 30 నిమిషాలు వాకింగ్, జాగింగ్ లేదా స్విమ్మింగ్ చేయాలి. రోజువారీ శారీరక శ్రమను అలవరుచుకోవాలి.
- ఆకు కూరలు, చిరు ధాన్యాలు, తాజా పళ్లు, కూరగాయలు ఆహారంగా తీసుకోవాలి. తినే ఆహారంలో తీపి, ఉప్పు, నూనె పదార్థాలు తగ్గించాలి
- రెడ్ మీట్ (బీఫ్, పోర్క్, మటన్) తగ్గించాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి
- ధూమపానం, మద్యపానం మానేయాలి
- శరీరం బరువు పెరగకుండా జాగ్రత్తపడాలి. కొలెస్ట్రాల్ నియంత్రణలో పెట్టుకోవాలి
- మానసిక ఒత్తిడి తగ్గించే యోగా, ధ్యానం చేయాలి.

గుండె జబ్బుల లక్షణాలు

- ఆయాసం, నడిచినప్పుడు ఛాతిలో నొప్పి, ఛాతి మధ్యలో మంటగా, బిగుతుగా, బరువుగా ఉండటం
- చెమటలు పట్టడం
- అలసట, కళ్లు తిరిగినట్లు అనిపించడం
- గుండెలో దడ, కాళ్ల వాపులు

రూ.377.97 కోట్లు ఖర్చు

ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా ఏటా లక్షలాది మందికి కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందిస్తోంది. ఇందులో గుండెజబ్బులు కూడా ఉన్నాయి. రాష్ట్రంలో 2021–22లో 45,034 మంది, 2022–23లో ఇప్పటి వరకు 28,822 మంది.. మొత్తంగా 73,856 మంది వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద గుండె జబ్బులకు చికిత్స పొందారు. ఇందులో 8 వేల మందికి పైగా బాధితులకు బైపాస్ సర్జరీ జరిగింది. గుండె జబ్బుల చికిత్సల కోసం ప్రభుత్వం రూ.377.97 కోట్లు ఖర్చు చేసింది. ఇది కాకుండా వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద చికిత్స అనంతరం విశ్రాంతి సమయానికి ప్రభుత్వం ఆర్థిక సాయం కూడా అందించింది.



– హరేంధిరప్రసాద్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో

కర్నూలు, విజయవాడకు సీబీఐ కోర్టులు తరలించండి

- తక్షణమే చర్యలు చేపట్టండి
- విశాఖ, విజయవాడ, కర్నూలు పీడీజేలకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: విశాఖపట్నంలోని రెండో అదనపు సీబీఐ కోర్టును కర్నూలుకు, మూడో అదనపు సీబీఐ కోర్టును విజయవాడకు తరలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో జారీ చేసిన ఉత్తర్వుల అమలుకు హైకోర్టు చర్యలు చేపట్టింది. ఆ కోర్టులను తరలించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని విశాఖపట్నం, కృష్ణా, కర్నూలు జిల్లాల ప్రిన్సిపల్ జిల్లా జడ్జిల (పీడీజే)ను హైకోర్టు ఆదేశించింది. 2020లో రాష్ట్ర ప్రభుత్వం ఆ కోర్టుల న్యాయ పరిధిని నిర్దేశిస్తూ జారీ చేసిన జీవోలకు అనుగుణంగా సీబీఐ కేసులను ఆయా కోర్టులకు బదిలీ చేయాలని విశాఖపట్నం పీడీజే హైకోర్టును అభ్యర్థించారు. దీంతో కర్నూలు, విజయవాడకు అదనపు సీబీఐ కోర్టులను తరలించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని మూడు జిల్లాల పీడీజేలను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) ఆలపాటి గిరిధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రైల్వే జోన్ రాకుంటే రాజీనామా చేస్తా

- వస్తే ఈనాడు, ఆంధ్రజ్యోతిని మాకు రాసిస్తారా?
- రామోజీ, రాధాకృష్ణకు విజయసాయిరెడ్డి సవాల్



సాక్షి, అమరావతి: విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ నూటికి నూరు శాతం వచ్చి తీరుతుందని వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. విశాఖ రైల్వేజోన్‌పై ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు అభూత కల్పనలతో అవాస్తవాలను ప్రచురించాయని ధ్వజమెత్తారు. విభజన సమస్యలపై కేంద్ర ప్రభుత్వం మంగళవారం నిర్వహించిన సమావేశంలో విశాఖ రైల్వే జోన్ అంశం ప్రస్తావనకే రాలేదని వెల్లడించారు. రైల్వే జోన్ వస్తే రామోజీరావు, రాధాకృష్ణ వారి పత్రికలను మాకు అప్పగిస్తారా? అని సవాల్ చేశారు. ఒకవేళ రైల్వే జోన్ రాకుంటే తాను రాజీనామా చేస్తానని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వంపై విషం చిమ్ముతూ కుల ప్రాతిపదికన ముందుకెళ్తున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి రాతలను ప్రజలెవరూ విశ్వసించరని చెప్పారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి ప్రచురించిన వార్తలు అవాస్తవం అని తేలితే రామోజీ, రాధాకృష్ణ బహిరంగ క్షమాపణలు చెబుతారా? అని నిలదీశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

- విశాఖ కేంద్రంగా రాష్ట్రానికి రైల్వే జోన్ రావట్లేదని, అది కలగా మిగిలిపోతుందని ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు బ్యానర్ కథనాలను ప్రచురించాయి. రైల్వే మంత్రిని వైఎస్సార్‌సీపీ ఎంపీల బృందం కలిసినప్పుడు అతి త్వరలో విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని ఆయన స్వయంగా స్పష్టమైన హామీ ఇచ్చారు.
- ఈనాడు రామోజీ, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ రైల్వే జోన్ రాదని ఊహల్లో బతుకుతూ వాటిని ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారు. వారి పత్రికల్లో అవాస్తవాలు ప్రచురిస్తున్నారు. కేంద్రం నిర్వహించిన సమావేశంలో విశాఖ రైల్వే జోన్ అంశం చర్చకు రాలేదని తేలితే వారిద్దరూ బహిరంగంగా క్షమాపణలు చెబుతారా?
- పునర్విభజన చట్టంలో రైల్వేజోన్‌కు సంబంధించి చాలా స్పష్టంగా ఉంది. రాజధాని ఎక్కడైతే ఉందో ఆ రాజధానిని కొవ్వూరు మీదుగా తెలంగాణ ప్రాంతాలతో కలిసే విధంగా రైల్వే లైన్ నిర్మించి హైదరాబాద్‌తో అనుసంధానించాలనే అంశంపై చర్చ జరిగింది. దీనికి సంబంధించి రాష్ట్రం వాటా సొమ్ము ఇవ్వాలనేది కేంద్ర ప్రతిపాదన. పునర్విభజన చట్టంలోనే చాలా స్పష్టంగా పేర్కొన్నారు కాబట్టి కొవ్వూరు మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు చేసి హైదరాబాద్‌కు కనెక్ట్ చేయాలని, ఆ మొత్తం నిధులను కేంద్రమే భరించాలనేది రాష్ట్ర ప్రభుత్వ వాదన. దీనికి సంబంధించిన చర్చ వచ్చింది. అంతేకానీ విశాఖ రైల్వే జోన్‌కు సంబంధించిన చర్చ జరగలేదు.
- విశాఖ రైల్వే జోన్ తప్పకుండా వస్తుంది. రైల్వే జోన్ కోసం వైఎస్సార్‌సీపీ ఎన్నో పోరాటాలు చేసింది. అది రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. నూటికి నూరు శాతం విశాఖ రైల్వే జోన్ వచ్చి తీరుతుంది. రామోజీ, రాధాకృష్ణ అవాస్తవాలను ప్రచురిస్తూ కులాభిమానంతో స్థాయిని దిగజార్చుకోవద్దు.

ఖనిజ లీజులకు దశల వారీగా ఈ-వేలం

- తొలి దశలో 35, రెండో దశలో 27 లీజులకు ఈ-వేలం
- ఎక్కువ గనుల్ని ఆపరేషన్‌లోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చిన్న తరహా ఖనిజాల తవ్వకానికి గనులను లీజుకిచ్చేందుకు ప్రభుత్వం దశల వారీగా నిర్వహిస్తున్న ఈ-వేలం ప్రక్రియ విజయవంతంగా జరుగుతోంది. తొలి దశలో గ్రానైట్ మినహా మిగిలిన చిన్న తరహా ఖనిజాల లీజులకు మంచి స్పందన లభించింది. 35 లీజులకు నిర్వహించిన ఈ-వేలంలో రూ. 16 కోట్ల ఆదాయం లభించింది. రెండో దశలో 27 లీజులకు ఈ-వేలం ప్రక్రియ ప్రస్తుతం జరుగుతోంది. ఇప్పటి వరకు 20 లీజులకు వేలం పూర్తయింది. వారం రోజుల్లో మిగిలిన 7 లీజులకు ఈ-వేలం పూర్తి చేస్తామని మైనింగ్ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా లీజు పొంది పని చేయకుండా ఉన్న 2,724 చిన్న తరహా గనులను ఆపరేషన్‌లోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ-వేలం విధానాన్ని ప్రారంభించారు. సీఎం చొరవతో ఈ-వేలానికి సుమారు 700 గనులు ఆపరేషన్ చేయడం ప్రారంభించాయి. ఈ లీజుల్లో ఎక్కువ క్వార్ట్జ్, బ్లాక్ గ్రానైట్, బెరైటీస్, సిలికాశాండ్, గ్రాఫైట్ ఖనిజాలు ఎక్కువ ఉన్నాయి. మిగిలిన వాటికి ఈ-వేలం నిర్వహించి తవ్వకాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు.

గతంలో ఉన్న మైనింగ్ విధానం ప్రకారం లీజు దరఖాస్తులు సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉండిపోయేవి. లీజులు తీసుకున్న వారిలో ఎక్కువ మంది తవ్వకాలు జరపకుండా వదిలేయడంతో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. అనుమతిచ్చిన ఈ లీజుల్లో తవ్వకాలు చేయకపోవడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం నిలిచిపోవడంతో పాటు, మైనింగ్ ఆధారిత పరిశ్రమలకు ముడిసరుకు కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో తవ్వకాలు జరపని క్వారీలకు ఒక అవకాశం ఇచ్చి చూశారు. సద్వినియోగం చేసుకోని లీజులను రద్దు చేసి వాటికి ఈ-వేలం నిర్వహిస్తున్నారు. దశల వారీగా 6 నెలల్లో వెయ్యి లీజుల్లో తవ్వకాలు ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వీటి ద్వారా ప్రభుత్వ ఆదాయం రూ. 500 కోట్ల మేర పెరిగే అవకాశం ఉందని గనుల శాఖ అంచనా వేస్తోంది.

మరో 3 నెలలు ఉచిత రేషన్

- డిసెంబర్ వరకు పొడిగించిన కేంద్ర ప్రభుత్వం
- 7వ దశ పీఎంజీకేఏవై అమలుకు చర్యలు

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) కింద ఉచిత బియ్యం పంపిణీని మరో మూడునెలలు పొడిగించింది. పీఎంజీకేఏవై 7వ దశలో భాగంగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు జాతీయ ఆహార భద్రత (ఎన్ఎఫ్ఎస్ఏ) కార్డుదారులకు ఉచితంగా బియ్యం ఇవ్వనుంది. దేశ వ్యాప్తంగా కార్డులోని ఒక్కో వ్యక్తికి ఐదుకిలోల చొప్పున 122 లక్షల టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయనుంది. వచ్చే మూడునెలలు పండుగలు ఉండటంతో పేదలకు ఆర్థిక బాధలు లేకుండా ఆహారధాన్యాలను ఉచితంగా అందించాలని నిర్ణయించింది. కోవిడ్–19 విజృంభణ నేపథ్యంలో 2020 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం పీఎంజీకేఏవైకు శ్రీకారం చుట్టింది. మొదటి రెండు దశల్లో ఎనిమిది నెలల పాటు (ఏప్రిల్ 2020 నుంచి నవంబర్ 2020), మూడు నుంచి ఐదు దశల్లో 11 నెలలు (మే 2021 నుంచి మార్చి 2022), ఆరోదశలో ఆరునెలలు (ఏప్రిల్ 2022 నుంచి సెప్టెంబర్ 2022) వరకు.. మొత్తం 25 నెలల పాటు ఉచితంగా బియ్యం పంపిణీ చేసింది.

88 లక్షల కార్డులకే ఉచిత బియ్యం

రాష్ట్రంలో ఉన్న 1.45 కోట్ల రేషన్ కార్డుల్లో 88 లక్షల కార్డులనే కేంద్ర ప్రభుత్వం ఎన్ఎఫ్ఎస్ఏ కింద పరిగణిస్తోంది. 88 లక్షల ఎన్ఎఫ్ఎస్ఏ కార్డులకే ప్రతినెలా కేంద్రం బియ్యం 5 కిలోల చొప్పున (నాన్–సార్టెక్స్) ఇస్తుండగా మిగిలిన 57 లక్షల కార్డులకు రాష్ట్ర ప్రభుత్వం సొంత ఖర్చులతో మొత్తం అందరికి సార్టెక్స్ బియ్యం అందిస్తోంది. ఇక్కడ ఎన్ఎఫ్ఎస్ఏ, నాన్–ఎన్ఎఫ్ఎస్ఏ కార్డుదారులందరూ దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) ఉండగా కేంద్రం మాత్రం కొన్ని కార్డులకే బియ్యం ఇస్తోంది. కోవిడ్ సమయంలో ప్రారంభించిన పీఎంజీకేఏవై కింద ఉచిత బియ్యాన్ని కూడా ఎన్ఎఫ్ఎస్ఏ కార్డులకే పరిమితం చేయడంతో రాష్ట్రంలో 88 లక్షల కార్డులకు మాత్రమే ఉచిత బియ్యం దక్కనున్నాయి. మరోవైపు ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాల్లోని అన్ని కార్డులను ఎన్ఎఫ్ఎస్ఏ కింద పెట్టి మొత్తం అందరికీ కేంద్రమే బియ్యం ఇస్తుండటం గమనార్హం. ఎన్ఎఫ్ఎస్ఏ పరిధిని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కేంద్రాన్ని కోరినా పట్టించుకోవడంలేదు.

విశాఖ రైల్వే జోన్‌కు కట్టుబడి ఉన్నాం

- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టీకరణ
- నిజానిజాలు తెలుసుకోకుండా వార్తలు ప్రచురిస్తున్నారు: మండిపడ్డ రైల్వే మంత్రిత్వ శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖపట్నం రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం కట్టుబడి ఉందని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ వదంతులు మాటిమాటికి ఎవరు సృష్టిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. జోన్ ఏర్పాటు పురోగతిలో ఉందని తెలిపారు. బుధవారం ఢిల్లీలో సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా విశాఖ రైల్వే జోన్ సాధ్యం కాదంటూ కొన్ని మీడియాల్లో వచ్చిన కథనాలపై రైల్వే మంత్రిని 'సాక్షి' ప్రశ్నించింది. దీంతో ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'దయచేసి ఎలాంటి వదంతులు నమ్మొద్దు. నేను స్పష్టంగా చెబుతున్నా. రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం కట్టుబడి ఉంది. ఇప్పటికే భూమిని గుర్తించాం. నిర్మాణ అంచనాలు పూర్తయ్యాయి. గతంలో ఎక్కడి నుంచి భూమి సేకరించాలనే సమస్య ఉండేది. ఇప్పుడు దాన్ని మేం అధిగమించాం. డీఆర్ఎం కార్యాలయం సమీపంలోనే భూమిని గుర్తించాం. రైల్వే జోన్ ఏర్పాటు పురోగతిలో ఉంది. ఈ వదంతులను మాటిమాటికి ఎవరు, ఎందుకు వ్యాప్తి చేస్తున్నారో.. నాకు అర్థం కావట్లేదు' అని అశ్విని వైష్ణవ్ అన్నారు.

ఆ వార్తలతో రైల్వేపై దుష్ప్రభావం..

నిజానిజాలు తెలుసుకోకుండా కొన్ని వార్తా పత్రికలు కథనాలు ప్రచురిస్తున్నాయని రైల్వే మంత్రిత్వ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనివల్ల రైల్వేపై దుష్ప్రభావం పడుతోందని పేర్కొంది. దక్షిణ కోస్తా (సౌత్ కోస్ట్) రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణ ప్రణాళిక ప్రస్తుతం పరిశీలన దశలో ఉందని తెలిపింది. ''రైల్వేజోన్ సాధ్యం కాదు.. విశాఖ కేంద్రంగా జోన్ ఏర్పాటు చేయడం కుదరదని రైల్వే శాఖ స్పష్టం చేసింది.. ఆశలు పోయాయి''.. అంటూ కొన్ని వార్తాపత్రికలు కథనాలు రాయడంపై రైల్వే శాఖ బుధవారం మండిపడింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ''గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లతో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించాం. ఇందులో భాగంగా వాల్తేరు డివిజన్‌లోని కొంత భాగాన్ని విజయవాడ డివిజన్‌లో విలీనం చేయనున్నట్లు స్పష్టం చేశాం. వాల్తేరు డివిజన్‌లోని మిగిలిన భాగంతో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌లో రాయగఢ డివిజన్ ఏర్పాటవుతుంది. దక్షిణ మధ్య రైల్వేలో హైదరాబాద్, సికింద్రాబాద్, నాందేడ్ డివిజన్లు ఉంటాయి. విశాఖపట్నం ప్రధాన కేంద్రంగా కొత్త రైల్వే జోన్ ఏర్పాటుకు ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)ని నియమించాం. కొత్త జోన్ ఏర్పాటు ప్రణాళిక, సన్నాహక పనులు చేపట్టాలని ఆదేశించాం. ఈ మేరకు అధికారులు డీపీఆర్ సమర్పించారు. రూ.170 కోట్ల అంచనా వ్యయంతో సౌత్ కోస్ట్ రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వేలో రాయగఢ డివిజన్ ఏర్పాటుని 2020–21 బడ్జెట్‌లో కూడా పొందుపరిచాం. దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ పనులు చేపట్టడానికి తగిన ప్రాంతాన్ని కూడా గుర్తించాం. భూ సర్వే, ప్రధాన కార్యాలయం ఏర్పాటు, ఇతరత్రా నిర్మాణ అవసరాలకు పూర్తి లేఅవుట్ ప్లాన్ సిద్ధం చేసి ప్రాథమిక కార్యకలాపాలు చేపట్టాలని ఆదేశించాం. మా ఆమోదం కోసం నిర్మాణ ప్రణాళిక కూడా అందింది'' అని రైల్వే శాఖ ప్రకటనలో పేర్కొంది.

విశాఖ రైల్వే జోన్‌పై ఆ పత్రికలది దుష్ప్రచారం

బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్

సాక్షి, అమరావతి: విశాఖ రైల్వే జోన్ గురించి కొన్ని పత్రికలు(ఈనాడు, ఆంధ్రజ్యోతి) దుష్ప్రచారం చేస్తున్నాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు మండిపడ్డారు. నిజనిర్ధారణ చేసుకున్న తర్వాత కథనాలు రాయాలని హితవు పలికారు. బుధవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడారు. కేంద్ర కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారంటే.. రైల్వే జోన్ ఏర్పాటుకు ఆమోదం లభించినట్లేనన్నారు. రైల్వే జోన్‌కు కేంద్రం ఆమోదం తెలిపిందని గతంలో కథనాలు రాసినవారు.. ఇప్పుడు అబద్ధాలు ఎలా రాస్తారని ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంపై అపోహలు తొలగించేలా మరోసారి ప్రకటన చేయాలని రైల్వే శాఖను కోరినట్లు తెలిపారు. రైల్వే బోర్డు చైర్మన్ త్రిపాఠితో కూడా మాట్లాడినట్లు చెప్పారు.

ఇందిరాదేవి మృతి పట్ల సోము వీర్రాజు సంతాపం

ప్రముఖ సినీ నటుడు ఘట్టమనేని కృష్ణ సతీమణి, నటుడు మహేష్‌బాబు మాతృమూర్తి ఇందిరాదేవి మరణం పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మూడు రాజధానులు ఉండాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, గ్రామ ఆరోగ్యకేంద్రాలు, గ్రామరక్షణ వలయం పేరిట అనేక సంక్షేమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు ఇంకా చేరువగా పరిపాలన సౌలభ్యం కోసం 13 జిల్లాలను 26 జిల్లాలు చేశారని, రాష్ట్రానికి కూడా మూడు రాజధానులు ఉంటే ప్రజలకు పరిపాలన చేరువవుతుందన్న అభిప్రాయంతో ముందడుగు వేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమయంలో 29 గ్రామాలకు చెందిన కొంత మంది మిడతల దండులా పాదయాత్ర పేరిట బయలుదేరారని ఎద్దేవా చేశారు. శాంతికి నిలయంగా ఉన్న ఉత్తరాంధ్ర జిల్లాల్లో దాడి చేయడానికి వస్తున్న ఈ దండును అడ్డుకోకపోతే సర్వం నాశనం చేస్తుందని చెప్పారు. ఆంధ్రా యూనివర్సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, పోర్టు, డిఫెన్స్, షిప్‌యార్డ్, నేవల్ డాక్‌యార్డ్, ఎస్ఎస్‌టీఎల్, స్టీల్ ప్లాంట్, రైల్వేస్టేషన్.. ఇలా జల, రోడ్డు, వాయు మార్గాలున్న విశాఖలో పరిపాలన రాజధాని పెడితే చంద్రబాబు అండ్ కోకు బాధ ఎందుకని ప్రశ్నించారు. అధిక ఎమ్మెల్యే సీట్లు ఉత్తరాంధ్ర నుంచి పొంది, నేడు ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న చంద్రబాబు దుర్మార్గమైన చర్యను క్షమించరాదన్నారు. 29 గ్రామాల ప్రజలను రెచ్చగొట్టి ఉత్తరాంధ్రలో అశాంతిని సృష్టించడానికి చంద్రబాబు పూనుకున్నారని దుయ్యబట్టారు. విశాఖపట్నం పరిపాలన రాజధానిగా అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, ప్రొఫెసర్లు కోరుకుంటే.. ఉత్తరాంధ్ర జిల్లాలోని తెలుగుదేశం ఎమ్మెల్యేలు, ఎంపీ పాదయాత్రను స్వాగతించడం దారుణమని చెప్పారు. సమావేశంలో సీనియర్ న్యాయవాది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించాలి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: త్వరలో జరగనున్న పట్టభద్రుల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు పార్టీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నియోజకవర్గం పార్టీ అభ్యర్థిగా సీతంరాజుసుధాకర్, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల నియోజకవర్గం అభ్యర్థిగా పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల నియోజకవర్గం పార్టీ అభ్యర్థిగా వెన్నపూస రవి పోటీ చేస్తున్నారని తెలిపారు.


ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోరా?

- డీజీపీ స్వయంగా సర్క్యులర్ జారీ చేసినా పట్టదా?
- కిందిస్థాయి పోలీసులపై హైకోర్టు మండిపాటు
- ఈ నెల 30న కోర్టుకు హాజరు కావాలని డీజీపీకి ఆదేశం

సాక్షి, అమరావతి: నిత్యావసర వస్తువుల చట్టం (ఈసీఏ) కింద నిత్యావసరాలను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాల జప్తు వ్యవహారంలో రాష్ట్ర డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి వ్యక్తిగత హాజరుకు హైకోర్టు ఆదేశించింది. ఈ నెల 30న స్వయంగా తమ ముందు హాజరు కావాలని ఆదేశించింది. ఈసీ చట్టం కింద అక్రమ రవాణా వాహనాలను జప్తు చేసే అధికారం సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) కన్నా తక్కువ స్థాయి అధికారులకు లేదంటూ తాము పలుమార్లు ఉత్తర్వులు జారీ చేసినా క్షేత్రస్థాయిలో పట్టించుకోకపోవడంపై వివరణ ఇవ్వాలని డీజీపీని ఆదేశించింది. ఈ వాహనాల జప్తు అధికారం ఎస్ఐకన్నా తక్కువ స్థాయి అధికారులకు లేదంటూ అన్ని జిల్లాల యూనిట్లకు, పోలీస్ కమిషనర్లకు డీజీపీ స్వయంగా జారీచేసిన సర్క్యులర్ అమలుకు నోచుకోకపోవడంపై విస్మయం వ్యక్తం చేసింది. స్థాయి లేని అధికారులు తమ వాహనాలు జప్తు చేస్తూనే ఉన్నారన్న ఫిర్యాదులతో పిటిషన్లు దాఖలవుతూనే ఉన్నాయని తెలిపింది. సంబంధిత అధికారి జప్తు చేస్తేనే ఆ వాహనాలపై కేసులు చెల్లుబాటు అవుతాయని, లేని పక్షంలో చెల్లవని స్పష్టం చేసింది. ఆ కేసులు న్యాయ సమీక్షకు నిలబడవని తేల్చి చెప్పింది. కిందిస్థాయి పోలీసు అధికారుల అవిధేయత, అరాచక శైలిపై స్వయంగా కోర్టు ముందు హాజరై వివరణ ఇవ్వాలని డీజీపీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్నారంటూ తమ వాహనాలను పోలీసులు జప్తు చేశారని, వాటిని విడుదల చేసేలా ఆదేశాలివ్వాలంటూ నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మారుతీనగర్‌కు చెందిన షేక్ మహ్మద్, మరొకరు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై న్యాయమూర్తి విచారణ జరిపారు.

చిత్తడి నేలల సమాచారానికి కమిటీ

- 2 నెలల్లో కమిటీ నివేదిక
- వెట్‌ల్యాండ్ బోర్డు తొలి సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి



సాక్షి, అమరావతి: చిత్తడి నేలల గురించి నిర్దిష్టమైన సమాచారం రూపొందించేందుకు రెవెన్యూ, వ్యవసాయ, అటవీశాఖల అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర అటవీ, పర్యావరణ, ఇంధన, సైన్స్ అండ్ టెక్నాలజీ, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం అటవీ, పర్యావరణ శాఖ అధికారులతో కూడిన వెట్ ల్యాండ్ బోర్డ్ తొలి సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండునెలల్లో ఈ కమిటీ ప్రాథమిక నివేదికను వెట్ ల్యాండ్ బోర్డుకు సమర్పిస్తుందని తెలిపారు. ప్రజల జీవనోపాధికి విఘాతం లేకుండా అలాగే చిత్తడి నేలల్లో జీవజాలం మనుగడకు ముప్పులేకుండా వెట్ ల్యాండ్ బోర్డ్ ఆధ్వర్యంలో అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రంలోని 30 వేల ఎకరాల్లో చిత్తడి నేలలు ఉన్నట్లు గుర్తించిందన్నారు. వివిధ జిల్లాల్లో విస్తరించి ఉన్న ఈ నేలల్లో కొంతమేర ఆక్రమణలు జరిగినట్లు తెలుస్తోందని చెప్పారు. కొల్లేరు ప్రాంతంలో 5 నుంచి 2వ కాంటూరు వరకు చేపల చెరువులు విస్తరించాయన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో సీజనల్‌గా వ్యవసాయం, ఇతర పంటలు సాగుచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని చిత్తడి నేలల్లో జీవ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ అనేక రకాల జంతువులు, పక్షులు, జీవజాలం మనుగడ సాగిస్తున్నాయని చెప్పారు. కొల్లేరు, నేలపట్టు, పులికాట్, కోరింగ, శ్రీకాకుళంలోని పలు ప్రాంతాల్లో చిత్తడి నేలలున్నట్లు తెలిపారు. అరుదైన విదేశీపక్షులు వేల కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి వచ్చి కొల్లేరు, పులికాట్ ప్రాంతాల్లోని చిత్తడి నేలల్లో సంతానాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాయని చెప్పారు. చిత్తడి నేలల పరిరక్షణపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు చేసిందని, వాటి ఆధారంగా రాష్ట్రంలోను వెట్ ల్యాండ్ బోర్డు ఏర్పాటైందని తెలిపారు. అటవీ అధికారులు చిత్తడి నేలల సంరక్షణపై ప్రత్యేకదృష్టి సారించాలని కోరుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో అటవీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్‌ప్రసాద్, అటవీదళాల అధిపతి మధుసూదన్‌రెడ్డి, అటవీ శాఖ ఉన్నతాధికారులు ఎ.కె.ఝా, శాంతిపాండే తదితరులు పాల్గొన్నారు.

అది చట్టవిరుద్ధం ఎలా అవుతుంది?

- మూలధన విలువ ఆధారంగా ఆస్తి పన్ను మదింపుపై హైకోర్టు
- పాత విధానం స్థానంలో కొత్తది తీసుకొచ్చారంతే
- మిగిలిన రాష్ట్రాల్లో ఏ విధానం ఉందో చెప్పండి
- ఈ విధానాన్ని ఏ హైకోర్టు తప్పుపట్టిందో చెప్పండి
- పిటిషనర్లకు హైకోర్టు ఆదేశం • విచారణ నాలుగు వారాలకు వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆస్తి పన్నును స్థలాలు, భవనాల మూలధన విలువ ఆధారంగా మదింపు చేసేందుకు వీలు కల్పిస్తూ తీసుకొచ్చిన చట్టం, తదనుగుణంగా జారీ చేసిన జీవో చట్ట విరుద్ధమెలా అవుతాయని హైకోర్టు ప్రశ్నించింది. ఆస్తుల మార్కెట్ విలువ పెంపు చట్ట విరుద్ధం కానప్పుడు, ఆ విలువ ఆధారంగా ఆస్తి పన్ను మదింపు ఎలా చట్ట విరుద్ధమవుతుందని అడిగింది. గతంలో స్థలాలు, భవనాల అద్దె విలువ ఆధారంగా ఆస్తి పన్నును మదింపు చేసే వారని, ఇప్పుడు దాని స్థానంలో మూలధన విలువను తీసుకొచ్చారని, అంతమాత్రాన ఈ విధానం తప్పని తామెలా చెప్పగలమని ప్రశ్నించింది. ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి విధానం అమలు చేస్తున్నారో తెలియచేయాలంది. అలాగే మూలధన విలువ ఆధారంగా ఆస్తి పన్ను మదింపును తప్పుపడుతూ ఏదైనా హైకోర్టు తీర్పులిచ్చి ఉంటే, వాటిని తమ ముందుంచాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులకు హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో భూములు, భవనాల మూలధనం విలువ ఆధారంగా ఆస్తి పన్ను మదింపును చేపట్టేలా ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని, గత ఏడాది నవంబర్ 24న జారీ చేసిన జీవో 198ని సవాలు చేస్తూ గుంటూరుకు చెందిన 'అవగాహన సంస్థ', విశాఖపట్నం అపార్ట్‌మెంట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భవానీ గణేష్, గ్రేటర్ విశాఖ రెసిడెంట్ కాలనీ అసోసియేషన్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పి.నారాయణమూర్తి వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలన్నింటిపై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. కౌంటర్లు దాఖలు చేయని వ్యాజ్యాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

కురులకు టానిక్



కొబ్బరి నూనె, ఆముదం సమపాళ్లల్లో తీసుకుని చక్కగా కలపాలి. ఈ నూనెను మాడుకు, జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించి పది నిమిషాలపాటు మర్దన చేయాలి. రెండు గంటల తరువాత తలస్నానం చేయాలి.



వారానికి రెండు సార్లు ఇలా చేయడం వల్ల ఆముదంలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు జుట్టుకు అంది చుండ్రు రానివ్వకుండా చేస్తాయి. కురులలో వచ్చే కొన్ని రకాల ఇన్ఫెక్షన్స్ దరిచేరవు. పీహెచ్ స్థాయులు నియంత్రణలో ఉండి జుట్టురాలడం క్రమంగా తగ్గుముఖం పడుతుంది.



సేవాధీరలు

ఈ నెల 24వ తేదీ, జాతీయ సేవాపథకం ఆవిర్భావ దినోత్సవం. మన దేశరాజధాని నగరంలోని రాష్ట్రపతి భవనం 2020-21జాతీయ స్థాయి అవార్డుల ప్రదానోత్సవానికి వేదికైంది. విశిష్ట సేవలందించిన నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) కార్యకర్తలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆనంద తరుణం. ఆ సంతోషంలో మన తెలుగు మహిళలు ఇద్దరున్నారు. ఒకరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అనంతపురం అమ్మాయి సిరిశ్రీ దేవనపల్లి. మరొకరు తెలంగాణ రాష్ట్రం, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి.

గ్రామాల దత్తత

దేవనపల్లి సిరిశ్రీ సొంతూరు సత్య సాయి జిల్లా (పూర్వపు అనంతపురం జిల్లా) కదిరి. నాన్న పద్మనాభ రెడ్డి ఎల్ఐసీలో హైయ్యర్‌గ్రేడ్ అసిస్టెంట్‌గా రిటైరయ్యారు. అమ్మ అమరావతి గృహిణి. తమ్ముడు నిఖిల్ బీటెక్ ఫైనల్ ఇయర్. ఇదీ ఆమె కుటుంబ నేపథ్యం. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా కాగ్నిజెంట్‌లో ఉద్యోగం చేస్తున్న సిరి శ్రీ విద్యార్థి దశ నుంచి సామాజిక సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనేది. తాను పాల్గొన్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూ ''ఎస్ఆర్ఐటీ కళాశాలలో నిత్యం జాతీయ సేవా పథకంపై ప్రత్యేక క్యాంపులు నిర్వహించాం. రక్తదానం, మొక్కలు నాటడం, పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమాలు చాలా నిర్వహించాం. రోటరీపురం వద్ద రెండు గ్రామాలు దత్తత తీసుకున్నాం. గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి వివరాలు సేకరించాం. ప్రతిరోజూ కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి పంపాం. డేటా సేకరించి నిరక్షరాస్యులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాం. పాఠశాలల్లో విద్యార్థులకు టెక్నాలజీ (సాంకేతిక పరిజ్ఞానం) గురించి వివరించి వారికి అవగాహన కల్పించాం.

కాలేజీలో శారో హుండీ

మా ఎస్ఆర్ఐటీ కళాశాలలో 'శారో (సేవ్ ఏ రూపీ ఆర్గనైజేషన్)' పేరుతో ప్రతి బ్లాక్‌లోనూ హుండీ ఏర్పాటు చేశారు. విద్యార్థులం స్వచ్ఛందంగా ఇందులోకి నగదు జమ చేసేవాళ్లం. ఆరు నెలలకోసారి ఈ మొత్తంతో అనాథ, వృద్ధాశ్రమాల్లో కార్యక్రమాలను నిర్వహించేవాళ్లం. ఈ విధానం నచ్చడంతో జాతీయ సేవా కార్యక్రమాల వైపు ఆకర్షితమయ్యాను. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చిన్నపుల్లయ్య సార్ మాకు ఎంతో తోడ్పాటు అందించారు. జాతీయ సేవా పథకంలో పని చేయడం వల్ల సేవాభావం మాత్రమే కాదు నాయకత్వ లక్షణాలు కూడా పెంపొందుతాయి. ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌గా 2019లో గుజరాత్‌లో జరిగిన ప్రీ-రిపబ్లిక్ పరేడ్ క్యాంప్‌కు ఎంపికయ్యాను. 2020 జనవరి 26న రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే అవకాశం దక్కింది. ఇక ఇప్పుడు గౌరవనీయులు భారత రాష్ట్రపతి గారి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడాన్ని జీవితకాల సాఫల్యంగా భావిస్తున్నాను. ఇంతకు మించి గొప్ప ఘనత నా జీవితంలో ఉండదేమో! మాటల్లో చెప్పలేని ఆనందం కలుగుతోంది. ఫస్ట్ సిటిజన్ ఆఫ్ ఇండియా చేతుల మీదుగా సత్కారం అందుకోవడం గర్వకారణంగా భావిస్తున్నాను'' అని తన సంతోషాన్ని వ్యక్తం చేశారు సిరి శ్రీ దేవనపల్లి.

– బడ శ్రీనివాస రెడ్డి, సాక్షి, అనంతపురం





భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా నేషనల్ బెస్ట్ ఎన్ఎస్ఎస్ అవార్డు అందుకుంటున్న సిరిశ్రీ దేవనపల్లి, డాక్టర్ సుంకరి జ్యోతి (ఫైల్ ఫొటో)

లీడర్‌షిప్ మాత్రమే

''మాది హన్మకొండ. ఇంటర్ హన్మకొండలోని ప్రభుత్వ పింగిళి కళాశాల, డిగ్రీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో, పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో చేశాను. కాకతీయ యూనివర్సిటీ, కెమిస్ట్రీ విభాగంలో డాక్టరేట్ చేసి, 2007లో అదే యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కెరీర్ ప్రారంభించాను. 2008లో అప్పటి ప్రిన్సిపాల్ నన్ను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా నియమించారు. నాకు విద్యార్థి దశలో ఎన్ఎస్ఎస్‌తో పరిచయం లేదు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా బాధ్యతలను స్వీకరించిన తర్వాత నా టీమ్‌లోని వాలంటీర్ల సామాజిక సేవాపథం, వారు కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనే తీరు నన్ను స్ఫూర్తిమంతం చేశాయి. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో కుమ్మరిగూడెంలో ప్రత్యేక శిబిరం పెట్టి మొక్కలు నాటాం. సామాజిక రుగ్మతలపై ప్రజల్లో చైతన్య కల్పనకు కృషి చేశాం. అలా 2012వరకు నాలుగేళ్లపాటు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా కొనసాగాను.

కో ఆర్డినేటర్‌గా...

కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా 2017లో అప్పటి వీసీ ఆచార్య ఆర్ సాయన్న నియమించారు. యూనివర్సిటీ చరిత్రలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌గా ఒక మహిళకు అవకాశం రావడం అదే తొలిసారి. ఆ బాధ్యతలను సమర్థంగా నిర్వహించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేశాను. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల్లో కలిపి 360 ఎన్ఎస్ఎస్ యూనిట్లు 36 వేలమంది వాలంటీర్లతో పనిచేశాను. హరితహారంలో మొక్కలు నాటాం, పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కల్పించాం. రక్తదానం శిబిరాల్లో 25 వేల మంది వాలంటీర్లు, లక్షా 18వేల యూనిట్ల రక్తదానం చేశారు. 975 ఆరోగ్య శిబిరాలు నిర్వహించాం. గుప్పెడు బియ్యం (కప్ ఆఫ్ రైస్) పేరున ఇంటింటికి తిరిగి బియ్యం సేకరించి, నిరుపేదలకు, అనాథలకు పంపిణీ, జలశక్తి అభియాన్ కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించడం, శ్రమదానం చేసి యూనివర్సిటీ క్యాంపస్‌లో ఇంకుడు గుంతలు తవ్వడంతోపాటు క్యాంపస్‌లో ఉన్న చెక్ డ్యామ్‌లకు మరమ్మతులు కూడా చేశాం. మేడారం జాతరలో భక్తులకు సేవలందించడం, ఎన్నికల సమయాల్లో పోలింగ్ బూత్‌ల దగ్గర ఓటర్లకు సేవలందించడంలోనూ మా కార్యకర్తలు ముందుండేవాళ్లు. కోవిడ్ సమయంలో శానిటైజర్, మాస్కుల పంపిణీ చేశాం. ఇన్ని సేవల నేపథ్యంలో అందిన ఈ గౌరవం మధురానుభూతిగా మిగులుతుంది'' అన్నారు సుంకరి జ్యోతి.

– డి. రమేశ్, సాక్షి, హన్మకొండ

ఇంటిప్స్



- గ్యాస్ సిలిండర్‌లో గ్యాస్ ఎంతవరకు ఉందో తెలుసుకోవాలంటే...సిలిండర్ మొత్తాన్ని తడి బట్టతో తుడవాలి. అలా తుడిచిన ఐదునిమిషాల వ్యవధిలో సిలిండర్ పై తడి ఎంతవరకు ఉంటే అక్కడి వరకే గ్యాస్ ఉన్నట్లు. పొడిగా ఉన్న ప్రాంతంలో గ్యాస్ లేదని గుర్తించాలి.



- ప్లాస్టిక్ డబ్బాలో నెయ్యి నిల్వచేసినప్పుడు అడుగు భాగంలో పేరుకుపోయిన నెయ్యిని తీయడం కాస్త ఇబ్బందిగా ఉంటుంది. ఇటువంటప్పుడు ఏదైనా వేడిగా ఉన్న గిన్నె లేదా వేడినీళ్లు ఉన్న గిన్నె పైన మెటల్ జాలీ పాత్రను పెట్టాలి. ఈ జాలీపై నెయ్యి ఉన్న ప్లాస్టిక్ డబ్బాను ఐదు నిమిషాలు ఉంచితే ఆ వేడికి నెయ్యిమొత్తం కరిగి వస్తుంది. ఇలా చేయడం వల్ల నెయ్యి వృథాకాదు. ప్లాస్టిక్ డబ్బాకూడా కాలదు.



- ఇంట్లో అరటిపండ్లు ఎక్కువగా ఉన్నప్పుడు అన్నీ ఒకేసారి తినలేం. దీంతో అవి త్వరగా మగ్గిపోతుంటాయి. ఇటువంటప్పుడు అరటిపండు తొక్కతీసి ముక్కలుగా తరిగి ఎయిర్‌టైట్ కంటైనర్‌లో వేసి డీప్ ఫ్రీజర్‌లో నిల్వచేయాలి. చెడిపోకుండా ఎక్కువరోజులపాటు ఉండే ఈ ముక్కలను వివిధరకాల డిజర్ట్స్, మిల్క్ షేక్స్‌లో వాడుకోవచ్చు.
- అరటితొక్కలను పడేయకుండా నీటిలో వేసి నానబెట్టాలి. రెండురోజుల తరువాత తొక్కలు తీసేసి నీటిని మొక్కలకు పోయాలి. ఈ నీళ్లు మొక్కలకు పోషణ అందించే మంచి ఎరువుగా పనిచేస్తాయి. మొక్కలు చక్కగా పెరుగుతాయి.



- నల్లగా మారిన, చిలుము పట్టిన ఇనుప బాణలి, పెనాలను వేడిచేసి పాత ప్రమిదలతో పదిహేను నిమిషాలపాటు గట్టిగా రుద్దాలి. తరువాత నీటితో కడిగి కొద్దిగా డిష్ వాష్ లిక్విడ్‌తో తోమి కడగాలి. తడిలేకుండా తుడిచి కొద్దిగా నూనె రాసిపెట్టుకోవాలి. ఈ విధానంలో కడిగితే చిలుము పోయి చక్కగా పనిచేస్తాయి. అంతేగాక చిలుము కూడా పట్టదు.



సైబర్ రాక్షసులను ఎదగనీయవద్దు...



ప్రతీకాత్మక చిత్రం

దసరా నవరాత్రుల సమయంలో అమ్మవారిని వివిధ రూపాలలో కొలుస్తుంటాం. ఈ పూజలన్నీ మనచుట్టూ, మనలోనూ ఉన్న చెడును సంహరించి, జీవితాలను బాధ్యతగా మలచుకోమని సూచన ఇస్తున్నట్టుగా ఉంటాయి. ఇదే విషయాన్ని టెక్నాలజీ విషయంలో తీసుకుంటే... పిల్లలు డిజిటల్ రాక్షసులుగా మారకుండా, అలాంటి రాక్షసుల నుంచి ఎలా కాపాడుకోవాలో ఇంట్లో అమ్మలూ, స్కూల్‌లో టీచర్లూ పిల్లలకు సూచనలు ఇస్తే .. ఎన్నో సమస్యలకు అడ్డుకట్ట వేయచ్చు.

సైబర్ టాక్

ఐఫోన్‌లు, ఆండ్రాయిడ్‌లు రాకముందు, స్మార్ట్‌ఫోన్‌లపై అంతగా చర్చ లేదు. పాఠశాలల్లో సాంకేతికత అనేది ఇప్పుడు చాలా సర్వసాధారణమైపోయింది. ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ప్రయోజనాలను ఉపయోగించుకుంటూ విద్యార్థుల డేటాను సురక్షితంగా ఉంచడానికి, డిజిటల్ టెక్నాలజీతో వారి సామర్థ్యాన్ని ఎలా అంచనా వేయాలో, తమను తాము రక్షించుకోవడం ఎలాగో నేర్పడానికి ఉపాధ్యాయులూ సిద్ధంగా ఉండాలి.

ప్రమాదాలు పలు విధాలు...

స్కూల్లో... (ఎ) సైబర్-సేఫ్ క్లాస్‌రూమ్‌ని ఏర్పాటు చేయాలి, విద్యార్థుల ప్రైవేట్ డేటాను రక్షించడంలో ఫస్ట్ లెవల్ రక్షణ వ్యూహాలను కలిగి ఉండాలి (బి) విద్యార్థులకు ఆన్‌లైన్ గోప్యత భద్రతలో తీసుకోవాల్సిన ప్రాథమికాంశాలను బోధించాలి (డి) టెక్నాలజీని మితిమీరి ఉపయోగించడం వల్ల కలిగే నష్టాల గురించి, అది సంబంధాలు, భవిష్యత్తు కెరీర్‌లు, వ్యక్తిగత జీవితాలను ఎలా దెబ్బతీస్తుందో తెలియజేయాలి (సి) తరగతిలో, ఇంట్లో టెక్నాలజీని వాడటం ప్రయోజనకరంగా ఉండాలే తప్ప, అన్నింటిని దూరం చేసేలా ఉండకూడదు.

టీచర్లు పిల్లల తల్లిదండ్రుల అంగీకార పత్రాన్ని తీసుకోవాలి

మీ పిల్లలకు ఏదైనా ఇబ్బంది కలిగించే విషయం ఇంటర్నెట్‌లో కనిపిస్తే ఏమి చేయాలో వారితో మాట్లాడాలి. మీరు వారితో కలివిడిగా లేకపోతే, మీరు వారి సమీపంలోకి వెళ్లినప్పుడు వారు ల్యాప్‌టాప్ మూసివేస్తారు లేదా స్క్రీన్‌ను ఆఫ్ చేస్తారు. టీచర్లు తమ పిల్లలకు ఎంత స్క్రీన్ సమయం సరిపోతుందో పరిశీలించడానికి తల్లిదండ్రులతో తప్పనిసరిగా ఇంటరాక్ట్ కావాల్సిన కొన్ని ముఖ్యమైన అంశాలు తెలిసుండాలి. అవి..

◆ అన్ని అప్లికేషన్‌లు, గేమింగ్, బ్రౌజర్‌లు లోపలే కొన్ని నియంత్రణలను కలిగి ఉంటాయి, ఇవి మీ పిల్లలు ఆన్‌లైన్‌లో గడిపే సమయాన్ని పరిమితం చేయడానికి, పెద్దలు వాడే టెక్నాలజీలో పిల్లల జోక్యం పరిమితంగా ఉండాలి. అలాగే, పిల్లలు ఉపయోగించే షాపింగ్, చాటింగ్ వంటి ఫంక్షన్‌లను స్విచ్ ఆఫ్ చేయడానికి మీకు యాక్సెస్ ఉండాలి.

◆ అన్ని అప్లికేషన్‌లు, గేమింగ్, ఈ కామర్స్ సైట్‌లు తమ వినియోగదారులకు షాపింగ్, అదనపు పాయింట్‌లను కొనుగోలు చేయడం, ఇతర అదనపు ప్రయోజనాలను అందిస్తాయి. పిల్లలు పెద్దలకు తెలియకుండానే సులభంగా కొనుగోళ్లు చేయవచ్చు. అందుకని, యాప్ కొనుగోళ్లను ఆపేయాలి.

◆ పిల్లలకు ఆన్‌లైన్ ప్రమాదాల గురించి తెలియదు. మీరు రోజులో కొంత సమయాన్ని పిల్లలతో గడుపుతారు కాబట్టి, ఆ సమయం లో భవిష్యత్తులో కెరీర్‌ను ప్రభావితం చేసే సైబర్ బెదిరింపు, గోప్యత, ఆన్‌లైన్ పరువు గురించి తెలియజేయాలి.

◆ ఆన్‌లైన్‌లో కొత్త గేమ్‌లు, వెబ్‌సైట్‌లకు సైన్ అప్ చేసేటప్పుడు మీ పిల్లలు ఉపయోగించగల సాధారణ ఇ మెయిల్ చిరునామాను సెటప్ చేయండి. (అనగా కుటుంబ సభ్యులందరికీ వారి ఇ మెయిల్ యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ తెలుసుండాలి)

◆ మీ గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో 'గూగుల్ సేఫ్ సెర్చ్'ని యాక్టివేట్ చేయడం ద్వారా సెర్చ్ ప్రశ్నలకు ప్రతిస్పందనగా అనుచితమైన కంటెంట్‌ను వదిలించుకోవడానికి లేదా పిల్లల కోసం https://www.kiddle.co వంటి సెర్చ్ ఇంజిన్‌లను ప్రత్యామ్నాయంగా ఉపయోగించండి.

యాంటీ ర్యాగింగ్, జెండర్ ఈక్వాలిటీ కౌన్సిల్ మాదిరిగానే ఈ రోజుల్లో డిజిటల్ వెల్‌బీయింగ్ కౌన్సిల్ తప్పనిసరి. ఈ కౌన్సిల్ పిల్లలకు మంచి డిజిటల్ పరిశుభ్రత, సైబర్ నైతికతను పెంపొందించడానికి సహాయపడుతుంది. తరాలు మారాయి. కొత్త కొత్త సాంకేతికత రూపుకడుతోంది. పిల్లల ఆలోచనా ధోరణి మారుతోంది. అవగాహనారాహిత్యంతో ఉన్న పిల్లల ఎదుగుదలను సరి చేయకపోతే భవిష్యత్తు సమాజం సమస్యాత్మకంగా మారనున్నది. ఈ పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే పెద్దలే జాగ్రత్త వహించాలి.

పిల్లలు ఆన్‌లైన్‌లో ఏం చేస్తారు...

దాదాపుగా ప్రీ-టీన్స్, టీనేజ్ పిల్లల రోజువారీ జీవితంలో ఇంటర్నెట్ భాగమైపోయింది. చాలా మంది యుక్త వయస్కులు స్మార్ట్‌ఫోన్ లేదా టాబ్లెట్‌ని ఉపయోగిస్తారు. ఇంచుమించు అందరికీ ఇంటర్నెట్ ఉంటుంది. అనేక రకాల సోషల్ నెట్‌వర్కింగ్, గేమింగ్ సైట్‌లను ఉపయోగిస్తున్నారు. పిల్లలు ఇతరుల రహస్యాలను బయటపెట్టడం, లింక్ అప్‌లు, హుక్ అప్‌లు, ద్వేషం.. సర్వసాధారణం. వీరిలో మరొక చీకటి కోణం కూడా గమనించాలి. సాధారణంగా సామాజిక ప్లాట్‌ఫారమ్‌లలో కన్ఫెషన్ పేజీలు పెద్దవాళ్లు క్రియేట్ చేసినవి ఉంటాయి. దీనిని ఇప్పుడు పిల్లలు టీచర్లు, హెడ్మాస్టర్లపై ప్రేమ, సరస వ్యాఖ్యలను చేయడం చూస్తుంటే వారి భవిష్యత్తుపై ఆందోళన కలుగుతుంది.

అందుకని, టీచర్లు – తల్లిదండ్రులు ఈ విషయాలపై మాట్లాడుకొని, కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. టెక్నాలజీ వారి పిల్లల భవిష్యత్తు జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో టీచర్లు తెలియజేయాలి.

◆ **సమాచారం :** (ఎ) పిల్లలు వాడే కమ్యూనికేషన్ సాధనాలేమున్నాయి, వాటి సమాచారాన్ని తల్లిదండ్రులు తప్పనిసరిగా చూడాలి. (బి) మూలాన్ని తనిఖీ చేయాలి. (సి) ఇన్ఫర్మేషన్ నుంచి చెక్ చేయాలి (డి) సమాచారాన్ని ధ్రువీకరించాలి. (ఇ) సమాచారాన్ని నమ్మాలి. (ఎఫ్) సమాచారాన్ని పంచుకోవాలి.

◆ **ప్రభావం :** తల్లిదండ్రులు తప్పనిసరిగా పర్యవేక్షించాలి (ఎ) మీ పిల్లల డిజిటల్ కార్యకలాపాలు వారికి మంచి లేదా చెడుగా ఎలా అనిపిస్తాయి. (బి) బ్యాలెన్స్, క్రాస్ చెక్ ఉందా... అని చూడాలి.

◆ **సూచన:** వీటన్నింటి చివరలో గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన పాఠం మీ సొసైటీలో సాంకేతికంగా సురక్షితంగా ఉండాలంటే.. పిల్లలు ఇతరుల నుండి ఏ సూచనలను తీసుకుంటున్నారు, ఎవరు సూచనలు ఇస్తున్నారు... అనేది తెలుసుకుని జాగ్రత్త పడాలి. ఏమరపాటుగా ఉంటే అది ప్రతి ఒక్కరి భద్రతకు భంగం కలిగించవచ్చు.



ఇన్‌పుట్స్: అనిల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్

ఒంటరి అమ్మ బతుకు పోరు

27 ఏళ్ల చంచల్ శర్మ
ఝాన్సీ లక్ష్మీబాయిని గుర్తుకు తెస్తోంది.
ఝాన్సీ తన బిడ్డను కట్టుకుని
శత్రువుతో యుద్ధం చేస్తే
చంచల్ తన బిడ్డను కట్టుకుని
బతుకుపోరు చేస్తోంది.
గర్భంతో ఉండగా భర్త నుంచి
విడిపోయిన చంచల్
బిడ్డ పుట్టాక ఏడుస్తూ కూచోలేదు.
బతకాలని బిడ్డను బతికించుకోవాలని సంకల్పించింది.
ఆమె కథ ఇప్పుడు నెట్‌లో వైరల్‌గా మారింది.

ఢిల్లీ- నోయిడాలో చంచల్ శర్మ నడిపే ఈ ఆటో రిక్షా అందరికీ తెలుసు. దాని డ్రైవింగ్ సీట్‌లో కూర్చుని ఉండే ఆమెను అందరూ మెచ్చుకోలుగా చూస్తూ ఉంటారు. ఆశ్చర్యంగా చూస్తు ఉంటారు. గౌరవంగా చూస్తూ ఉంటారు. దాని కారణం 'కంగారు'లాగా ఆమె కూడా తన ఒక సంవత్సరం కొడుకును పొట్టకు దగ్గరగా కట్టుకుని డ్రైవింగ్ చేస్తూ ఉండటమే.

పల్లెల్లో బిడ్డను నడుముకు కట్టుకుని కూలి పనులు చేసే తల్లులు మనకు కొత్త కాదు. కాని ఒక ఆటో రిక్షా నడుపుతూ ఇలా నగరంలో ఒక ఒంటరి తల్లి తన బతుకు కోసం సంఘర్షించడం మాత్రం కొత్త. ఇటీవల ఈమె గురించి మీడియాలో వస్తే సోషల్ మీడియాలో చాలా మంది మాట్లాడారు. మెచ్చుకున్నారు. ఎందుకు? జీవితం సవాలు విసిరినప్పుడు చేతనైన జవాబు చెప్పాలని చంచల్ అనుకోవడమే.

భర్త నుంచి విడిపోయి... 27 ఏళ్ల చంచల్ శర్మ పెళ్లయ్యి గర్భం వచ్చాక భర్త నుంచి విడిపోవాల్సి వచ్చింది. ఆమెకు తల్లి తప్ప ఎవరూ లేరు. బతుకు తెరువు లేదు. బిడ్డకు జన్మనిచ్చాక ఒకవైపు భర్త తోడు లేకపోవడం, మరోవైపు బిడ్డ బాధ్యత ఆమెను సతమతం చేశాయి. జీవితంలో ఓడిపోవడమా? పోరాడి నిలవడమా? రెండో మార్గమే ఎంచుకుంది. కొడుకు నెలల బిడ్డగా ఉండగా తల్లి దగ్గరే వదిలి ఈ ఆటో రిక్షా నడపడం మొదలెట్టింది. కాని ఇప్పుడు వాడికి సంవత్సరం నిండింది. తల్లి కోసం బెంగటిల్లుతుంటాడు. అదీగాక తల్లి ఆ పిల్లాణ్ణి చూసుకోలేకపోతోంది. క్రష్‌లో వేద్దామంటే అందుకు కట్టాల్సినంత డబ్బు తన వద్ద లేదు. పైగా క్రష్‌లు కూడా బాగా చార్జ్ చేస్తున్నాయి ఢిల్లీలో. అందుకే తనతో పాటే కొడుకును నడుముకు కట్టుకుని డ్యూటీ చేయాలని నిశ్చయించుకుంది చంచల్ శర్మ.



ఒడికి కట్టుకున్న బిడ్డతో చంచల్ శర్మ

600 సంపాదన... ఉదయం ఆరున్నరకు కొడుకుతో పాటు డ్యూటీ ఎక్కుతుంది చంచల్ శర్మ. మధ్యాహ్నం వరకూ ఆటో నడిపి ఇల్లు చేరుతుంది. కొడుక్కు స్నానం చేయించి, తినిపించుకుని, కాసేపు విశ్రాంతి తీసుకుని మళ్లీ డ్యూటీ ఎక్కుతుంది కొడుకుతో. రాత్రి ఎనిమిది వరకూ పని చేస్తుంది. మధ్యలో కొడుకు ఆకలికి ఒక పాల సీసా పెట్టుకుంటుంది. ఇంత శ్రమ చేస్తే ఆమెకు రోజుకు 600 మిగులుతున్నాయి. ఒక్కోసారి కొడుకు పొట్ట మీద నిద్రపోతాడు. ఒక్కోసారి మేలుకుని హుషారుగా ఉంటాడు. ఒక్కోసారి మాత్రం ఏడుస్తూనే ఉంటాడు. కాని పాసింజర్లు విసుక్కోరు. ఆమెను సానుభూతితో అర్థం చేసుకుంటారు. మహిళా పాసింజర్లయితే ఈమె ఆటోనే వెతికి ఎక్కుతారు.. సాయం చేసినట్టు ఉంటుందని. ఎండాకాలం వస్తే మాత్రం బిడ్డను తీసుకుని తిరగడం కష్టం అంటుంది చంచల్. ఆ టైమ్‌లో తల్లి మీద ఆధారపడాల్సి వస్తుంది అంటుంది. 'నా బిడ్డ కోసం నేను ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నాను' అంటుంది చంచల్ శర్మ.

ఒంటరి స్త్రీ... సింగిల్ మదర్‌గా జీవించడంలో బెంబేలెత్తాల్సిన పని లేదు. సమాజంలో ఇప్పుడు సింగిల్ మదర్‌కు అండ దొరుకుతుంది. వారు కష్టపడి పని చేయాలనుకుంటే సాయం చేసేవారూ ఉన్నారు. కావలసిందల్లా ఎదురొడ్డే తెగువే. చంచల్ శర్మను చూసి చాలా మంది స్ఫూర్తి పొందుతున్నారు.



'ఫిఫా ప్లస్'లో సునీల్ ఛెత్రి జైత్రయాత్ర

భారత కెప్టెన్, స్టార్ స్ట్రయికర్ సునీల్ ఛెత్రి అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో సాధించిన ఘనతలకు గుర్తింపుగా అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య (ఫిఫా) ప్రత్యేక వీడియోను రూపొందించింది. దీన్ని మూడు ఎపిసోడ్లుగా తమ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ ఫిఫా ప్లస్‌లో ప్రసారం చేయనున్నట్లు ట్వీట్ చేసింది. 'అందరికీ రొనాల్డో, మెస్సీలు తెలుసు. అలాగే మరో ఆటగాడి గురించి తెలుసుకోవాలి. అతడే సునీల్ ఛెత్రి! 38 ఏళ్ల భారత స్టార్ అత్యధిక గోల్స్ స్కోరర్లలో టాప్-3లో కొనసాగుతున్నాడు' అని పేర్కొంది.

మళ్లీ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లోకి...



ఆస్ట్రేలియాతో జరిగిన టి20 సిరీస్‌లో రాణించిన భారత బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ తన కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సూర్యకుమార్ ఒక స్థానం మెరుగుపర్చుకొని 801 రేటింగ్ పాయింట్లతో రెండో ర్యాంక్‌లో నిలిచాడు. పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ 799 పాయింట్లతో మూడో ర్యాంక్‌లో... పాక్ వికెట్ కీపర్ రిజ్వాన్ 861 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉన్నారు.

క్వార్టర్స్‌లో బోపన్న జోడీ




న్యూఢిల్లీ: టెల్ అవీవ్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న (భారత్)-మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీ శుభారంభం చేసింది. బుధవారం ఇజ్రాయెల్‌లో జరిగిన తొలి రౌండ్‌లో టాప్ సీడ్ బోపన్న-మిడిల్‌కూప్ ద్వయం 4-6, 7-6 (7/4), 10-6తో వైషయ్ ఒలియెల్ (ఇజ్రాయెల్)-మెడ్‌జెడోవిచ్ (సెర్బియా) జోడీపై గెలిచింది. గంటా 28 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో బోపన్న ద్వయం ఐదు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది.

షమీ 'నెగెటివ్'



న్యూఢిల్లీ: భారత పేస్ బౌలర్ మొహమ్మద్ షమీ కరోనా నుంచి కోలుకున్నాడు. బుధవారం నిర్వహించిన పరీక్షలో షమీకి నెగెటివ్ రిపోర్ట్ వచ్చింది. ఈనెల 17న కోవిడ్-19 బారిన పడ్డ షమీ ముందుగా ఆస్ట్రేలియాతో... ఆ తర్వాత దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్‌లకు దూరమయ్యాడు. వచ్చే నెలలో ఆస్ట్రేలియా వేదికగా జరిగే ప్రపంచకప్ టి20 టోర్నీ కోసం షమీని స్టాండ్‌బైగా ఎంపిక చేశారు.


జాతీయ క్రీడా పురస్కారాల దరఖాస్తులకు గడువు పెంపు



న్యూఢిల్లీ: జాతీయ క్రీడా పురస్కారాల దరఖాస్తులు సమర్పించేందుకు కేంద్ర క్రీడాశాఖ తుది గడువును మూడు రోజులు పెంచింది. ఇంతకుముందు ప్రకటించినట్లు ఈ నెల 27తో గడువు ముగియగా... తాజాగా వచ్చే నెల 1వ తేదీ (శనివారం) వరకు అర్హత గల క్రీడాకారులు, కోచ్‌లు, సంఘాలు, యూనివర్సిటీలు దరఖాస్తు చేసుకోవచ్చని ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది నుంచి క్రీడాశాఖకు సంబంధించిన ప్రత్యేక పోర్టల్‌లో ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 'భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ), స్పోర్ట్స్ అథారిటీ (సాయ్), జాతీయ క్రీడా సమాఖ్యలు, స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డులు, రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రభుత్వాలు తమ నామినేషన్లను అక్టోబర్ 1లోపు ఆన్‌లైన్లో పంపాలి' అని కేంద్ర క్రీడాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆరంభం అదిరింది

- తొలి టి20లో దక్షిణాఫ్రికాపై భారత్ ఘనవిజయం
- నిప్పులు చెరిగిన అర్ష్‌దీప్, చహర్
- మెరిసిన సూర్య, రాహుల్
- 2న గువాహటిలో రెండో టి20



అర్ష్‌దీప్



చహర్

తిరువనంతపురం: ప్రపంచకప్‌నకు ముందు చివరి టి20 సిరీస్ ఆడుతున్న భారత్ సులువైన శుభారంభం చేసింది. దక్షిణాఫ్రికాతో బుధవారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో రోహిత్ శర్మ బృందం ఎనిమిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత సీమర్లు దీపక్ చహర్ (2/24), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అర్ష్‌దీప్ సింగ్ (3/32), హర్షల్ పటేల్ (2/26) నిప్పులు చెరిగారు. అనంతరం బ్యాటర్లు సూర్యకుమార్ యాదవ్ (33 బంతుల్లో 50 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), కేఎల్ రాహుల్ (56 బంతుల్లో 51 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్సర్లు) బాధ్యతగా ఆడారు. దాంతో ఆసక్తికరంగా జరుగుతుందనుకున్న తొలిపోరు ఏకపక్షంగా ముగిసింది. మొదట దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 106 పరుగులే చేసింది. కేశవ్ మహరాజ్ (35 బంతుల్లో 41; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించాడు. తర్వాత భారత్ 16.4 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 110 పరుగులు చేసి గెలిచింది. సూర్య, రాహుల్ మూడో వికెట్‌కు 93 పరుగులు జోడించారు. సిరీస్‌లో రెండో టి20 అక్టోబర్ 2న గువాహటిలో జరుగుతుంది.

చహర్, అర్ష్‌దీప్ దడదడ

1 పరుగుకే వికెట్! బవుమా (0) క్లీన్‌బౌల్డ్. రెండో ఓవర్లో అదే పరుగు వద్ద రెండో వికెట్... డికాక్ (1)కూడా బౌల్డే! దీన్నుంచి తేరుకోకముందే ఆ ఓవర్లోనే రోసో (0), మిల్లర్ (0) ఇద్దరు వరుస బంతుల్లోనే డకౌట్. మూడో ఓవర్లో స్టబ్స్ (0) కూడా ఖాతా తెరువలేదు. 1, 3వ ఓవర్లు వేసిన దీపక్ చహర్ (2/2), ఒక్క రెండో ఓవర్ వేసిన అర్ష్‌దీప్ (3/7) పేస్‌కు దక్షిణాఫ్రికా బ్యాటింగ్ కకావికలమైంది. జట్టు స్కోరు 9/5. ఇలా పది పరుగులైనా చేయకముందే సగం వికెట్లను కోల్పోయింది. మార్క్‌రమ్ (25; 3 ఫోర్లు, 1 సిక్స్), పార్నెల్ (24; 1 ఫోర్, 1 సిక్స్) ఇద్దరూ కాసేపు నిలబడటంతో కష్టంగా జట్టు స్కోరు 50 దాటింది. అనంతరం కేశవ్ మహరాజ్ కొట్టిన కాసిన్ని మెరుపులతో మొత్తానికి వంద పైచిలుకు స్కోరైతే చేయగలిగింది. ఇంత తక్కువ స్కోరులోనూ 19వ ఓవర్ పరుగందుకోవడం భారత శిబిరానికి మింగుడుపడని అంశం. అర్ష్‌దీప్ ఓవర్లో కేశవ్ మహరాజ్ 2 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 17 పరుగులు వచ్చాయి.



రాహుల్, సూర్య

సూర్య, రాహుల్ ఫిఫ్టీ-ఫిఫ్టీ

లక్ష్యం ఛేదించే క్రమంలో భారత టాపార్డర్‌కూ కఠిన సవాళ్లు ఎదురయ్యాయి. సీనియర్లు రోహిత్ శర్మ (0), కోహ్లి (3) దక్షిణాఫ్రికా పేసర్లు రబడ, నోర్జేలకు తలవంచారు. దీంతో భారత్ పవర్‌ప్లేలో 17 పరుగులే చేయగలిగింది. పిచ్ పరిస్థితి ఏంటో అర్థం చేసుకున్న మరో ఓపెనర్ రాహుల్, హిట్టర్ సూర్యకుమార్ జాగ్రత్త పడ్డారు. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడకుండా ఆచితూచి ఆడారు. సగం ఓవర్లు ముగిసినా భారత్ స్కోరు 50ని చేరుకోలేదు. 10 ఓవర్లలో 47/2 స్కోరే చేసింది. తర్వాత సూర్య బ్యాట్ ఝుళిపించాడు. రాహుల్ కూడా పరుగుల వేగం పెంచాడు. కుదిరిన బంతిని 4గా, చెత్త బంతిని 6గా దంచేశారు. దీంతో మరో 6.4 ఓవర్లలోనే మిగతా 63 పరుగుల్ని చకచకా చేసేసింది. లక్ష్యం చేరుకున్న 17వ ఓవర్లోనే సూర్య 33 బంతుల్లో, రాహుల్ 56 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు.

56 అంతర్జాతీయ టి20ల్లో ఎక్కువ బంతుల్లో అర్ధ సెంచరీ చేసిన భారత బ్యాటర్‌గా కేఎల్ రాహుల్ నిలిచాడు. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో రాహుల్ 56 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. గతంలో ఈ రికార్డు గంభీర్ (54 బంతుల్లో ఆస్ట్రేలియాపై 2012లో) ఉంది.

732 ఒకే ఏడాది అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా సూర్యకుమార్ యాదవ్ గుర్తింపు పొందాడు. ఈ ఏడాది సూర్యకుమార్ 21 మ్యాచ్‌లు ఆడి 732 పరుగులు చేశాడు. గతంలో ఈ రికార్డు శిఖర్ ధావన్ (689 పరుగులు; 2018లో) పేరిట ఉంది.

16 ఒకే ఏడాది అంతర్జాతీయ టి20ల్లో భారత్‌కు ఎక్కువ విజయాలు (16) అందించిన కెప్టెన్‌గా రోహిత్ శర్మ రికార్డు నెలకొల్పాడు. ధోని (2016లో 15 విజయాలు) పేరిట ఉన్న రికార్డును రోహిత్ సవరించాడు.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (బి) అర్ష్‌దీప్ 1; బవుమా (బి) దీపక్ చహర్ 0; రోసో (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ సింగ్ 0; మార్క్‌రమ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హర్షల్ పటేల్ 25; డేవిడ్ మిల్లర్ (బి) అర్ష్‌దీప్ 0; స్టబ్స్ (సి) అర్ష్‌దీప్ (బి) చహర్ 0; పార్నెల్ (సి) సూర్యకుమార్ (బి) అక్షర్ 24; కేశవ్ (బి) హర్షల్ 41; రబడ (నాటౌట్) 7; నోర్జే (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 106. వికెట్ల పతనం:** 1-1, 2-1, 3-8, 4-8, 5-9, 6-42, 7-68, 8-101. **బౌలింగ్:** దీపక్ చహర్ 4-0-24-2, అర్ష్‌దీప్ సింగ్ 4-0-32-3, అశ్విన్ 4-1-8-0, హర్షల్ పటేల్ 4-0- 26-2, అక్షర్ పటేల్ 4-0-16-1.

భారత్ ఇన్నింగ్స్: కేఎల్ రాహుల్ (నాటౌట్) 51; రోహిత్ శర్మ (సి) డికాక్ (బి) రబడ 0; విరాట్ కోహ్లి (సి) డికాక్ (బి) నోర్జే 3; సూర్యకుమార్ యాదవ్ (నాటౌట్) 50; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (16.4 ఓవర్లలో 2 వికెట్లకు) 110. వికెట్ల పతనం:** 1-9, 2-17. **బౌలింగ్:** రబడ 4-1-16-1, పార్నెల్ 4-0-14-0, నోర్జే 3-0-32-1, షమ్సీ 2.4-0-27-0, కేశవ్ మహరాజ్ 3-0-21-0.

నేటి నుంచి జాతీయ క్రీడలు



అహ్మదాబాద్: ఆయా క్రీడాంశాల్లో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు లేకుండానే నేటి నుంచి జాతీయ క్రీడలు అధికారికంగా మొదలుకానున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ క్రీడలను ప్రారంభిస్తారు. అక్టోబర్ 10 వరకు జరిగే ఈ క్రీడల్లో 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాలతోపాటు భారత త్రివిధ దళాలకు చెందిన సర్వీసెస్ జట్టు నుంచి మొత్తం ఏడువేల మంది క్రీడాకారులు పోటీపడనున్నారు. మొత్తం 36 ఈవెంట్స్‌లో పతకాల కోసం పోటీలుంటాయి. గుజరాత్‌లోని అహ్మదాబాద్, గాంధీనగర్, సూరత్, వడోదర, రాజ్‌కోట్, భావ్‌నగర్ నగరాల్లో మ్యాచ్‌లను ఏర్పాటు చేశారు. సైక్లింగ్ ఈవెంట్‌ను మాత్రం న్యూఢిల్లీలో నిర్వహిస్తారు. భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) ఎల్లుండి నుంచి చైనాలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉండటంతో... టీటీ పోటీలను ఈనెల 20 నుంచి 24 వరకు నిర్వహించారు. కబడ్డీ, లాన్ బౌల్స్, రగ్బీ క్రీడాంశాల్లోనూ పోటీలు మొదలయ్యాయి. ఏడేళ్ల తర్వాత మళ్లీ జాతీయ క్రీడలు జరుగుతున్నాయి. చివరిసారి 2015లో జరిగిన జాతీయ క్రీడలకు కేరళ ఆతిథ్యమిచ్చింది. ఆ క్రీడల్లో తెలంగాణ 8 స్వర్ణాలు, 14 రజతాలు, 11 కాంస్యాలతో కలిపి 33 పతకాలతో 12వ ర్యాంక్‌లో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ 6 స్వర్ణాలు, 3 రజతాలు, 7 కాంస్యాలతో కలిపి 16 పతకాలతో 18వ స్థానంలో నిలిచింది.

భారత్‌కు 'పారిస్' తొలి బెర్త్ ఖరారు

ట్రాప్ షూటర్ భౌనీష్‌కు నాలుగో స్థానం



ఒసిజెక్ (క్రొయేషియా): ప్రపంచ షూటింగ్ షాట్‌గన్ చాంపియన్‌షిప్‌లో భారత యువ షూటర్ భౌనీష్ మెందిరత్తా త్రుటిలో కాంస్య పతకాన్ని కోల్పోయాడు. అయితే తన ప్రదర్శనతో అతను 2024 పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ ఈవెంట్‌లో భారత్‌కు తొలి బెర్త్‌ను ఖరారు చేశాడు. బుధవారం జరిగిన పురుషుల ట్రాప్ ఈవెంట్‌లో హరియాణాకు చెందిన 23 ఏళ్ల భౌనీష్ ఫైనల్లో నాలుగో స్థానంలో నిలిచాడు. ఎలిమినేషన్ పద్ధతిలో నలుగురు పోటీపడిన ఫైనల్లో భౌనీష్ 13 పాయింట్లు స్కోరు చేసి ముందుగా నిష్క్రమించాడు. అయినప్పటికీ ఫైనల్ చేరడంద్వారా భౌనీష్ భారత్‌కు తొలి ఒలింపిక్ బెర్త్‌ను అందించాడు. స్కాట్ డెన్రిక్ (అమెరికా; 33 పాయింట్లు), నాథన్ హేల్స్ (బ్రిటన్; 31 పాయింట్లు), కున్ పి యాంగ్ (చైనీస్ తైపీ; 23 పాయింట్లు) వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు గెల్చుకోవడంతోపాటు తమ దేశాలకు ఒలింపిక్ బెర్త్‌లను ఖరారు చేశారు. అంతకుముందు 154 మంది షూటర్లు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో భౌనీష్ 121 పాయింట్లు స్కోరు చేసి నాలుగో స్థానంలో నిలిచి ఎనిమిది మంది పోటీపడే ర్యాంకింగ్ రౌండ్‌కు అర్హత సాధించాడు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో సిక్కి రెడ్డి-రోహన్ జోడీ

సాయిప్రణీత్‌కు చుక్కెదురు



హో చి మిన్ సిటీ: వియత్నాం ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-100 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ (భారత్) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో తెలంగాణ అమ్మాయి సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ ద్వయం 14-21, 21-9, 21-12తో హరిహరన్-లక్ష్మి ప్రియాంక (భారత్) జోడీపై గెలిచింది. పురుషుల సింగిల్స్ విభాగంలో సంచలన ఫలితాలు నమోదయ్యాయి. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత, 40వ ర్యాంకర్ సాయిప్రణీత్ రెండో రౌండ్‌లోనే నిష్క్రమించాడు. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడిన రెండో సీడ్ సాయిప్రణీత్ 21-17, 18-21, 13-21తో 225వ ర్యాంకర్ సతీశ్ కుమార్ (భారత్) చేతిలో ఓడిపోయాడు. తెలంగాణ ప్లేయర్ మేకల కిరణ్ కుమార్ వరుసగా రెండు విజయాలతో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరాడు. తొలి రౌండ్‌లో కిరణ్ 21-10, 15-21, 21-10తో ప్రపంచ 68వ ర్యాంకర్ శుభాంకర్ డే (భారత్)పై నెగ్గి...రెండో రౌండ్‌లో 16-21, 21-14, 21-19తో ఫోన్ ప్యా నైంగ్ (మయన్మార్)ను ఓడించాడు. .

సినిమా



కృష్ణ, మహేశ్‌బాబు, త్రివిక్రమ్, మంజుల, కొరటాల శివ



నమ్రతా శిరోద్కర్



మోహన్‌బాబు, ఆదిశేషగిరిరావు



వెంకటేశ్



నాగార్జున

నివాళి

సూపర్‌స్టార్ కృష్ణ సతీమణి, హీరో మహేశ్‌బాబు మాతృమూర్తి ఘట్టమనేని ఇందిరాదేవి బుధవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సందర్శించి, నివాళులు అర్పించారు.



అభిమానులే నాకు గాడ్‌ఫాదర్స్

- చిరంజీవి

''మీరు(అభిమానులు) నన్ను 'గాడ్‌ఫాదర్' అని అంటున్నారు. కానీ, ఏ గాడ్‌ఫాదర్ లేకుండా వచ్చిన నాకు ఈ సినిమా ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి అవకాశం కల్పించి, ఈ స్థాయి ఇచ్చిన ప్రతి అభిమాని నాకు 'గాడ్‌ఫాదర్'. చిరంజీవి వెనకాల ఏ గాడ్‌ఫాదర్ లేరని అంటుంటారు.. కానీ నేను ఇప్పుడు అంటున్నాను.. నా వెనకాల లక్షలమంది గాడ్‌ఫాదర్స్ ఉన్నారు.. నా అభిమానులే నా 'గాడ్‌ఫాదర్స్'' అని చిరంజీవి అన్నారు. మోహన్ రాజా దర్శకత్వంలో చిరంజీవి హీరోగా రూపొందిన చిత్రం 'గాడ్ ఫాదర్'. నయనతార, సల్మాన్‌ఖాన్, సత్యదేవ్, పూరి జగన్నాథ్ ప్రధాన పాత్రల్లో నటించారు. కొణిదెల సురేఖ సమర్పణలో ఆర్‌బీ చౌదరి, ఎన్వీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 5న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా బుధవారం అనంతపురంలో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాతలు ఆర్‌బీ చౌదరి, ఎన్వీ ప్రసాద్ 'గాడ్‌ఫాదర్' ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ– ''నేను ఎప్పుడు రాయలసీమకు వచ్చినా ఈ నేల తడుస్తుంది. ఈ రోజు కూడా ఇలా వర్షం కురవడం శుభ పరిణామంగా అనిపిస్తోంది. ఇక 'గాడ్‌ఫాదర్' విషయానికొస్తే.. మలయాళ హిట్ మూవీ 'లూసిఫర్' చిత్రాన్ని నేను తెలుగులో 'గాడ్‌ఫాదర్'గా చేయడానికి ప్రధాన కారణం రామ్‌చరణ్. దర్శకుడు మోహన్ రాజా పేరును కూడా చరణే సూచించాడు. మాపై నమ్మకం, ప్రేమ, గౌరవంతో 'గాడ్‌ఫాదర్' కథ వినకుండా నటించిన సల్మాన్‌ఖాన్‌గారికి థ్యాంక్స్. నయనతార ఈ సినిమా ఒప్పుకోవడం మా విజయానికి తొలిమెట్టు. ఆర్‌బీ చౌదరి, ఎన్వీ ప్రసాద్ ఈ సినిమాలో భాగస్వాములవడం సంతోషం. తెలుగువారికి జాతీయ అవార్డులు రావడం అరుదు. అలాంటిది చిన్న వయసులోనే జాతీయ అవార్డు సాధించిన తమన్‌కు అభినందనలు. మా సినిమాకి రీ రికార్డింగ్ అద్భుతంగా ఇచ్చాడు. పొలిటికల్ అండ్ ఫ్యామిలీ డ్రామా సినిమా ఇది.. ప్రేక్షకులను అలరిస్తుందని నేను గ్యారంటీ ఇస్తున్నాను. నేను సినిమా చూశాను కాబట్టే ఇంత ఆత్మ విశ్వాసంతో మాట్లాడుతున్నాను. కానీ, ప్రేక్షకుల తీర్పును ఎప్పుడూ గౌరవిస్తాం. మా సినిమాతో పాటు విడుదలవుతున్న నా మిత్రుడు నాగార్జున 'ది ఘోస్ట్', గణేష్ 'స్వాతిముత్యం' సినిమాలు కూడా విజయం సాధించాలి. పెద్ద సినిమాలు, చిన్న సినిమాలు.. రెండూ ప్రేక్షకులచేత ఆదరించబడినప్పుడే పరిశ్రమ పచ్చగా ఉంటుంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో తమన్, ఫైట్‌మాస్టర్స్ రామ్-లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఈ మధ్యకాలంలో కాస్త స్తబ్దత ఏర్పడింది. జయాపజయాలు మన చేతుల్లో ఉండవని తెలుసు. కానీ ప్రేక్షకులను అలరించలేకపోయామే, వారిని అసంతృప్తికి గురిచేశామే అనే బాధ ఉంది. దానికి సమాధానం, నాకు ఊరట ఈ 'గాడ్‌ఫాదర్'. ఈ సినిమా కచ్చితంగా నిశ్శబ్ద విస్ఫోటనం అవుతుంది.. ఇందుకు ప్రేక్షకుల ఆశీస్సులు ఉండాలి.

బుధవారం ఉదయం ఓ విషాదం చోటు చేసుకుంది. సూపర్‌స్టార్ కృష్ణ గారి సతీమణి, సోదరుడు మహేశ్‌బాబుగారి మాతృమూర్తి ఇందిరాదేవిగారు మృతిచెందారు. ఆ కుటుంబం విషాదంలో ఉంది. వారి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి.

ఆయన ఏ క్రాఫ్ట్‌కు వెళ్లినా సక్సెస్ అవుతారు

- అనిల్ రావిపూడి

''కరోనా తర్వాత కంటెంట్ ఉన్న సినిమాలకే విజయాలు దక్కే స్కోప్ ఎక్కువ కనిపిస్తోంది. ఆ స్కోప్ 'కాఫీ విత్ ఎ కిల్లర్' ట్రైలర్‌లో కనిపిస్తోంది. ఆర్‌పీగారు ఏ క్రాఫ్ట్‌కు వెళ్లినా సక్సెస్ అవుతారు. ఆయన దర్శకత్వం వహించిన ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. శ్రీనివాస్ రెడ్డి, రవిబాబు, 'సత్యం' రాజేష్, రఘుబాబు, 'జెమినీ' సురేష్, రవి ప్రకాష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కాఫీ విత్ ఎ కిల్లర్'. సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్ దర్శకత్వంలో 'సెవెన్‌హిల్స్' సతీష్ నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ను అనిల్ రావిపూడి, నిర్మాత అభిషేక్ అగర్వాల్ విడుదల చేశారు. ''ట్రైలర్ ఎంటర్‌టైనింగ్ అండ్ థ్రిల్లింగ్‌గా ఉంది.. ఈ సినిమా హిట్ కావాలి'' అన్నారు అభిషేక్ అగర్వాల్. ఆర్‌పీ పట్నాయక్ మాట్లాడుతూ–''ఓటీటీలు వచ్చాక థియేటర్స్‌లో సినిమాలు చూడాలనుకునే ప్రేక్షకుల ఆలోచనల్లో మార్పులు వచ్చాయి. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని 'కాఫీ విత్ ఎ కిల్లర్' కథ రాసుకుని, డైరెక్ట్ చేశాను. 'సెవెన్‌హిల్స్' సతీష్ బాగా సపోర్ట్‌గా ఉన్నారు. మా కాంబినేషన్‌లో మరో రెండు సినిమాలు రానున్నాయి'' అన్నారు. ''ఆర్‌పీ పట్నాయక్‌గారు నాకు సొంత బ్రదర్‌లాంటివారు. గౌతమ్ పట్నాయక్ లేకపోతే ఈ ప్రాజెక్ట్ ఇంతదూరం వచ్చేది కాదు'' అన్నారు సతీష్.



ఆర్పీ పట్నాయక్, సతీష్, అనిల్, అభిషేక్



ఉష, నాగశౌర్య, శంకర్, అనీష్ కృష్ణ

నేను గర్వపడే హిట్ ఇచ్చారు

- నాగశౌర్య

''కృష్ణ వ్రింద విహారి' చాలా మంచి సినిమా. థియేటర్‌లో అద్భుతమైన స్పందన వస్తోంది. మొదటి రోజు నుంచి థియేటర్లు, వసూళ్లు పెరుగుతున్నాయి. పంపిణీదారులు, మేము అంతా ఆనందంగా ఉన్నాం. మా సినిమాకి గొప్ప విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని హీరో నాగశౌర్య అన్నారు. అనీష్ ఆర్.కృష్ణ దర్శకత్వంలో నాగశౌర్య, షిర్లీ సేటియా జంటగా నటించిన చిత్రం 'కృష్ణ వ్రింద విహారి'. శంకర్ ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో నాగశౌర్య మాట్లాడుతూ– ''మంచి సినిమా ఇచ్చిన అనీష్ కృష్ణకు థ్యాంక్స్. 'ఛలో' తర్వాత నేను గర్వపడే హిట్ ఇచ్చినందు నిర్మాత, మా అమ్మకి స్పెషల్ థ్యాంక్స్'' అన్నారు. ఉషా ముల్పూరి మాట్లాడుతూ– ''కృష్ణ వ్రింద విహారి' ఫ్యామిలీతో కలసి థియేటర్‌లో చూడాల్సిన సినిమా. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. దసరా సెలవులు వచ్చాయి కాబట్టి ఇంకా సినిమా చూడని వారు చూడండి'' అన్నారు. ''మా సినిమా వసూళ్లు స్టడీగా కొనసాగుతున్నాయి. రాధికగారితో పాటు ఈ సినిమాలో పనిచేసిన అందరికీ థ్యాంక్స్. మా చిత్రాన్ని పెద్ద విజయం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు అనీష్ ఆర్.కృష్ణ. ఈ కార్యక్రమంలో నటీనటులు హిమజ, రాహుల్ రామకృష్ణ, సత్య తదితరులు పాల్గొన్నారు.

నా పేరు సిద్ధు.. నేనొక ఆస్ట్రోనాట్



జైద్ ఖాన్, సోనాల్

జైద్ ఖాన్, సోనాల్ మోంటెరో జంటగా 'బెల్ బాటమ్' ఫేమ్ జయతీర్థ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బనారస్'. ఎన్ కె ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తిలకరాజ్ బల్లాల్ నిర్మించిన ఈ సినిమా నవంబర్ 4న తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో విడుదలకానుంది. తాజాగా ఈ చిత్రం ట్రైలర్ వేడుక బెంగళూరులో జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన కన్నడ స్టార్ రవిచంద్రన్, బాలీవుడ్ స్టార్ అర్బాజ్ ఖాన్ ట్రైలర్‌ని విడుదల చేశారు. ''నా పేరు సిద్ధు.. నేనొక ఆస్ట్రోనాట్. ఐయామ్ ఎ టైమ్ ట్రావెలర్ అండ్ ఐ హావ్ కమ్ ఫ్రమ్ ది ఫ్యూచర్'' అంటూ జైద్ ఖాన్ వాయిస్‌తో ట్రైలర్ విడుదలైంది. రవిచంద్రన్ మాట్లాడుతూ–''బనారస్' ట్రైలర్ చాలా ఎగ్జయిటింగ్ ఉంది.. ఈ చిత్రం అన్ని భాషల్లో మంచి విజయం సాధించి, జైద్‌కి గొప్ప ఆరంభం ఇవ్వాలి'' అన్నారు. ''ఈ సినిమా గొప్ప విజయాన్ని సాధించాలి'' అన్నారు అర్బాజ్ ఖాన్. ''నటుడు కావాలనే నా కల తిలకరాజ్ బల్లాల్‌గారి వల్లే నెరవేరింది.. జయతీర్థ గారు బాగా తీశారు.. వారిద్దరికీ కృతజ్ఞతలు'' అన్నారు జైద్ ఖాన్.

మా నాన్న నన్ను కొట్టారు!



భవిన్ రాబరి

బెస్ట్ ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో మనదేశం తరపున ఆస్కార్ నామినేషన్ పోటీకి గుజరాతీ ఫిల్మ్ 'ఛెల్లో షో' (ఇంగ్లీష్‌లో 'లాస్ట్ ఫిల్మ్ షో') ఎంపికైన విషయం తెలిసిందే. భవిన్ రాబరి, భవేష్ శ్రీమాలి, రిచా మీనా, డిపెన్ రావల్, పరేష్ మెహతా ప్రధాన పాత్రల్లో నటించారు. పాన్ నలిన్ (నలిన్ కుమార్ పాండ్య) ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. రాయ్‌కపూర్ ఫిల్మ్స్, ఆరెంజ్ స్టూడియో సమర్పణలో సిద్ధార్థ్ రాయ్ కపూర్, ధీర్ మోమయ్య, పాన్ నలిన్, మార్క్ డ్యూలే నిర్మించిన ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది. 'మా నాన్న నన్ను కొట్టారు. నేను సినిమా చూడటానికి వెళ్లానని', 'భవిష్యత్ స్టోరీ టెల్లర్స్‌దే' వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఇక 'లాస్ట్ ఫిల్మ్ షో' చిత్రం అక్టోబరు 14న విడుదల కానుంది. సినిమాల పట్ల ఎంతో ప్రేమ ఉన్న తొమ్మిదేళ్ల అబ్బాయి సామీ (భవిన్ రాబరి) ఎలా ఫిల్మ్‌మేకర్ అయ్యాడు? అన్నదే చిత్ర కథ.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	509	56,598
నిఫ్టీ ▼	149	16,859

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	10,987	▲	159
డోజోన్స్	29,613	▲	478
ఎఫ్‌టీఎస్ఈ 100	7,005	▲	21
డాక్స్	12,183	▲	44
షాంఘై	3,045	▼	49
నికాయ్	26,174	▼	398

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

రూపాయి 'వెల'విల

దాలరుతో 82 పైగా పతనం



ముంబై: డాలర్ మారకంలో రూపాయి విలువ రికార్డు స్థాయి పతనం కొనసాగుతోంది. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్ ఇంట్రాడే ట్రేడింగ్‌లో బుధవారం రూపాయి విలువ మొదటిసారి 82 దిగువకు పడిపోయింది. ఒక దశలో 82.02ను చూసిన రూపాయి చివరకు క్రితం ముగింపుతో పోల్చితే 40 పైసలు పతనంతో 81.93 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ పటిష్టత, దేశం నుంచి కొనసాగుతున్న విదేశీ పెట్టుబడుల ప్రవాహం, ఈక్విటీ మార్కెట్ల బలహీన ధోరణి, ద్రవ్యోల్బణం భయాలు వంటి అంశాలు రూపాయి బలహీనతకు కారణం. కాగా, రూపాయి ఈ స్థాయిలో పతనం జరుగుతున్నా, ఆసియా పొరుగుదేశాల కరెన్సీ నష్టంకన్నా తక్కువ స్థాయేనని రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకులు శ్రీరామ్ అయ్యర్ పేర్కొన్నారు.

'టైమ్100'లో ఆకాశ్ అంబానీ

వర్ధమాన లీడర్ల జాబితాలో చోటు

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మకమైన టైమ్100 నెక్ట్స్ జాబితాలో దేశీ పారిశ్రామిక దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ తనయుడు, జియో చైర్మన్ ఆకాశ్ అంబానీ (30) చోటు దక్కించుకున్నారు. బిజినెస్, వినోదం, క్రీడలు, రాజకీయాలు, ఆరోగ్యం, సైన్స్ తదితర రంగాల రూపురేఖలను మార్చగలిగే సామర్థ్యాలున్న 100 మంది వర్ధమాన నాయకులతో టైమ్ మ్యాగజైన్ దీన్ని రూపొందించింది. ఇందులో భారత్ నుంచి చోటు దక్కించుకున్న ఏకైక వ్యక్తి ఆకాశ్ అంబానీయే. ఆయన కాకుండా భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యాపారవేత్త ఆమ్రపాలి గాన్ కూడా జాబితాలో ఉన్నారు. జూనియర్ అంబానీ 22 ఏళ్లకే కంపెనీ బోర్డు సభ్యుడిగా చేరారు. 42.6 కోట్ల మంది పైగా యూజర్లున్న జియోకి చైర్మన్‌గా ఇటీవల జూన్‌లోనే నియమితులయ్యారు. పారిశ్రామిక నేపథ్యం గల కుటుంబ వారసుడైన అంబానీ .. వ్యాపార పగ్గాలు



చేపడతారన్న అంచనాలు సహజంగానే ఉన్నాయని, ఆయన కూడా కష్టించి పనిచేస్తున్నారని టైమ్ పేర్కొంది. 'గూగుల్, ఫేస్‌బుక్ నుంచి భారీగా పెట్టుబడులు సమీకరించడంలో ఆకాశ్ కీలకపాత్ర పోషించారు' అని వివరించింది. మరోవైపు, అడల్ట్ కంటెంట్ క్రియేటర్ల సైట్ అయిన 'ఓన్లీఫ్యాన్స్'కి ఆమ్రపాలి గాన్ సీఈవోగా వ్యవహరిస్తున్నారు. 2020 సెప్టెంబర్‌లో చీఫ్ మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ ఆఫీసర్‌గా చేరిన ఆమ్రపాలి ఆ తర్వాత పదోన్నతి పొందారు. అమెరికన్ సింగర్ ఎస్‌జెడ్‌ఏ, నటి సిడ్నీ స్వీనీ, బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు యా మోరాంట్, టెన్నిస్ ప్లేయర్ కార్లోక్ అల్కెరాజ్ తదితరులు కూడా ఈ లిస్టులో ఉన్నారు.

అక్టోబర్ 1న విశాఖలో జోస్ ఆలుక్కాస్



విశాఖ: ప్రముఖ ఆభరణాల గ్రూప్ జోస్ ఆలుక్కాస్ అక్టోబర్ 1వ తేదీన విశాఖపట్నం, ఆశీల్‌మెట్‌లో నూతన షోరూమ్‌ను ప్రారంభించనుంది. విశాఖలో ఇది అతిపెద్ద జ్యువెలరీ షోరూమ్ అని ఈ మేరకు ఒక ప్రకటనలో సంస్థ తెలిపింది. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా బంగారు, డైమండ్, ప్లాటినం ఆభరణాలపై పలు ఆఫర్లను అందిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొంది. రూ.40,000 పసిడి ఆభరణాలు కొనుగోలు చేసిన వారికి ఉచిత గోల్డ్ కాయిన్, డైమండ్ ఆభరణాలపై 20%, ప్లాటినం ఆభరణాలపై 7% తగ్గింపు ఆఫర్లలో ఉన్నాయి.

టాటా టియాగో ఈవీ

- ధర రూ.8.49–11.79 లక్షలు
- 315 కిలోమీటర్ల దాకా ప్రయాణం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టాటా మోటార్స్ టియాగో ఈవీ హ్యాచ్‌బ్యాక్‌ను భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. వేరియంట్‌నుబట్టి ఒకసారి చార్జ్ చేస్తే 250–315 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ ప్రకటించింది. అక్టోబర్ 10 నుంచి బుకింగ్స్ మొదలుకానున్నాయి. డెలివరీలు 2023 జనవరి నుంచి ఉంటాయి. ప్రారంభ ఆఫర్ ధర రూ.8.49 లక్షల నుంచి రూ.11.79 లక్షల మధ్య ఉంది. ఈ ధరలు తొలి 10,000 యూనిట్లకు మాత్రమే వర్తిస్తుందని కంపెనీ బుధవారం వెల్లడించింది. నెక్సాన్ ఈవీ, టిగోర్ ఈవీ కస్టమర్ల కోసం 2,000 యూనిట్లను రిజర్వ్ చేసినట్టు టాటా మోటార్స్ ప్రకటించింది. కంపెనీ ఎలక్ట్రిక్ కార్ల విభాగంలో టియాగో ఈవీ తక్కువ ధరలో లభిస్తుంది. నెక్సాన్ ఈవీ, టిగోర్ ఈవీ ధరలు ప్రస్తుతం ఎక్స్‌షోరూంలో రూ.12.49 లక్షల నుంచి రూ. 19.84 లక్షల మధ్య ఉంది. టియాగో ఈవీ రాకతో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయ కేంద్రాలను 90 నుంచి 165 నగరాలు,



పట్టణాలకు కంపెనీ విస్తరిస్తోంది.

అయిదేళ్లలో 10 మోడళ్లు..

టాటా మోటార్స్ వచ్చే అయిదేళ్లలో మొత్తం 10 ఎలక్ట్రిక్ మోడళ్లను అందుబాటులోకి తేనుంది. ప్రస్తుత మోడళ్లతోపాటు సరికొత్త బ్రాండ్‌లో ఈవీలను ప్రవేశపెట్టనున్నట్టు టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ ఎండీ శైలేష్ చంద్ర తెలిపారు. 'టియాగో, నెక్సాన్ ధరలకు మధ్యస్థంగా ఒక ఈవీ ప్రవేశపెడతాం. ఏటా ఒకట్రెండు ఉత్పత్తులు పరిచయం చేస్తాం. ఈ ఏడాది మొత్తం 50,000 ఎలక్ట్రిక్ వాహనాలను విక్రయించే అవకాశం ఉంది. 2030 నాటికి సంస్థ మొత్తం ప్యాసింజర్ వాహన విక్రయాల్లో ఈవీల వాటా 30 శాతం కంటే ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నాం' అని వివరించారు.

ఆరో రోజూ ఆగని అమ్మకాలు

- సెన్సెక్స్ 57,000.. నిఫ్టీ 17,000 స్థాయిల దిగువకు
- 509 పాయింట్లు డౌన్; 56,598కు సెన్సెక్స్
- 149 పాయింట్లు క్షీణించి 16,859కు చేరిన నిఫ్టీ
- మెటల్, బ్యాంకింగ్, ఆయిల్, రియల్టీ రంగాలు వీక్



ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలు దేశీ మార్కెట్లను దెబ్బతీస్తున్నాయ్. ఆందోళనలు వీడని ఇన్వెస్టర్లు మరోసారి అమ్మకాలకే కట్టుబడ్డారు. వెరసి వరుసగా ఆరో రోజు మార్కెట్లు నష్టపోయాయి. అయితే ఎఫ్ అండ్‌వో ముగింపు నేపథ్యంలో ట్రేడర్లు స్క్వేరప్ లావాదేవీలు చేపట్టడంతో మిడ్‌సెషన్‌కల్లా నష్టాలను పూడ్చుకుని లాభాల్లోకి ప్రవేశించాయి. తదుపరి తిరిగి క్షీణ పథం పట్టాయి. డాలరు రెండు దశాబ్దాల గరిష్టం 114.5ను దాటగా.. రూపాయి రికార్డ్ కనిష్టం 82ను దాటడం గమనార్హం!

ముంబై: ఆటుపోట్ల మధ్య మళ్లీ స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. సెన్సెక్స్ 509 పాయింట్లు పతనమై 56,598 వద్ద నిలవగా.. నిఫ్టీ 149 పాయింట్లకు నీళ్లొదులుకుని 16,589 వద్ద ముగిసింది. దీంతో సెన్సెక్స్ సాంకేతికంగా కీలకమైన 57,000 పాయింట్ల దిగువకు చేరగా.. నిఫ్టీ సైతం 17,000 స్థాయిని కోల్పోయింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 622 పాయింట్లు, నిఫ్టీ 190 పాయింట్లవరకూ నీరసించాయి. ఆర్థిక మాంద్యం భయాలు, ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు జోరు, వడ్డీ రేట్ల పెంపు వంటి ప్రతికూలతలు ఈక్విటీ ఇన్వెస్టర్లలో భయాలు పెంచుతున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ఇటీవల విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) అమ్మకాలకే ఆసక్తి చూపుతుండటం సెంటిమెంటుకు షాకిస్తున్నట్లు తెలియజేశారు. ప్రధాన ఇండెక్సులు కీలక మద్దతు స్థాయిలను కోల్పోయినట్లు విశ్లేషించారు.

ఫార్మా ప్లస్‌లో

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా మెటల్, బ్యాంకింగ్, ఆయిల్, రియల్టీ రంగాలు 2–0.7 శాతం మధ్య క్షీణించాయి. ఫార్మా 0.8 శాతం, ఐటీ 0.2 శాతం పుంజుకున్నాయి. నిఫ్టీ దిగ్గజాలలో హిండాల్కో, జేఎస్‌డబ్ల్యూ, యాక్సిస్, ఐటీసీ, ఆర్‌ఐఎల్, టాటా స్టీల్, యూపీఎల్, ఎస్‌బీఐ, ఇండస్‌ఇండ్, అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, హీరోమోటో 4–2 శాతం మధ్య డీలా పడ్డాయి. అయితే ఏషియన్ పెయింట్స్, సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్, ఐషర్, పవర్‌గ్రిడ్, నెస్లే, హెచ్‌యూఎల్, ఎంఅండ్‌ఎం, బ్రిటానియా, టెక్ మహీంద్రా, అపోలో, డివీస్ 3–0.5 శాతం మధ్య లాభపడ్డాయి.

చిన్న షేర్ల నేలచూపు

మార్కెట్ల బాటలో చిన్న షేర్లలోనూ అమ్మకాలదే పైచేయిగా నిలిచింది. బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.45 శాతం బలహీనపడ్డాయి. ట్రేడైన షేర్లలో 2,092 నష్టపోగా. 1,335 బలపడ్డాయి. నగదు విభాగంలో ఎఫ్‌పీఐలు రూ. 2,772 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకోగా.. దేశీ ఫండ్స్ రూ. 2,544 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. గత రెండు రోజుల్లోనూ ఎఫ్‌పీఐలు 7,925 కోట్ల విలువైన అమ్మకాలు చేపట్టగా.. దేశీ ఫండ్స్ రూ. 7,037 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశాయి.

రూ. 15 లక్షల కోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్లలో భారీ అమ్మకాల కారణంగా గత ఆరు రోజుల్లో ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే లిస్టెడ్ కంపెనీల విలువ(మార్కెట్ క్యాప్) రూ. 14.98 లక్షల కోట్లమేర ఆవిరైంది. 6 రోజుల్లో సెన్సెక్స్ 5 శాతం (3,122 పాయింట్లు) పడిపోయింది. ఫలితంగా బీఎస్ఈ మార్కెట్ క్యాప్ 14,98,502 కోట్లు క్షీణించి రూ. 2,68,42,958 కోట్లకు పరిమితమైంది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	49,505	▼	24
బంగారం (99.5 స్వచ్ఛత)	49,307	▼	24
వెండి (కిలో)	54,524	▼	867

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-9-2022	
విశాఖ	435–00
చిత్తూరు	443–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	435–00
విజయవాడ	435–00
రిటైల్ ధర (డజను)	66.00
28-9-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	390–00
వరంగల్	392–00
రిటైల్ ధర	4.50

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ. 1,923 కోట్ల లాభం

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ 2021–22 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,923 కోట్ల లాభం ఆర్జించింది. బుధవారం స్టీల్‌ప్లాంట్ 40వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో, స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ వాటాదారులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ ఏడాది ప్లాంట్ అత్యధికంగా రూ. 28,215 కోట్లు టర్నోవర్ సాధించిందని, గత ఏడాదితో పోలిస్తే 57 శాతం వృద్ధిని నమోదు చేసిందని తెలిపారు. అలాగే కంపెనీ ఆరేళ్ల తర్వాత పన్నుకు ముందు లాభాలను (పీబీటీ) ఆర్జించిందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ అంతకు ముందు ఏడాది కంటే 148 శాతం వృద్ధితో రూ.3,469 కోట్ల ఎబిటా సాధించిందన్నారు. కోకింగ్ కోల్ సంక్షోభం కారణంగా క్యూ4లో కార్యకలాపాలు తగ్గినప్పటికి, అన్ని ప్రధాన ఉత్పత్తి రంగాల్లో అత్యుత్తమ పనితీరు



వార్షిక సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

నమోదు చేసిందన్నారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్లు కె.కె. ఘోష్, ఎ.కె. సక్సేనా, స్వతంత్ర డైరెక్టర్లు సీతా సిన్హా, ఘన శ్యాం సింగ్, సునీల్ కుమార్ హిరానీ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఉక్కు మంత్రిత్వశాఖ అండర్ సెక్రటరీ ఎస్. నారాయణస్వామి న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏజీఎంకు హాజరయ్యారు.

బజాజ్ ఎలక్ట్రానిక్స్ @ రూ. 56-59

- అక్టోబర్ 4–7 మధ్య పబ్లిక్ ఇష్యూ
- రూ. 500 కోట్ల సమీకరణకు రెడీ

న్యూఢిల్లీ: రిటైల్ చైన్ ఎలక్ట్రానిక్స్ మార్ట్ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. అక్టోబర్ 4న ప్రారంభమయ్యే ఇష్యూకి రూ. 56–59 ధరల శ్రేణిని ప్రకటించింది. 7న ముగియనున్న ఐపీవోలో భాగంగా రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. బజాజ్ ఎలక్ట్రానిక్స్



బ్రాండుతో కంపెనీ వినియోగ వస్తువుల విక్రయ స్టోర్లను నిర్వహిస్తోంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 254 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. పవన్ కుమార్ బజాజ్, కరణ్ బజాజ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కంపెనీకి 36 పట్టణాలలో 112 మల్టీబ్రాండ్ ఔట్‌లెట్స్ ఉన్నాయి.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

పేపర్లు ఆరు.. సిద్ధమవ్వాల్సిన తీరు

» ఏపీలో ఇక నుంచి ఆరు పేపర్లలో పదో తరగతి పరీక్షలు
» పేపర్-1, పేపర్-2 విధానానికి ఫుల్‌స్టాప్
» ప్రతి పేపర్‌కు వంద మార్కులు
» ఎన్‌ఎస్, పీఎస్ కలిపి ఒక పేపర్‌గా నిర్వహణ
» ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు



ఆంధ్రప్రదేశ్‌లో.. ఈ విద్యా సంవత్సరం నుంచి పదో తరగతి పరీక్షలను ఆరు పేపర్లలో మాత్రమే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆమేరకు నమూనా ప్రశ్న పత్రాలను బ్లూ ప్రింట్‌ను కూడా ఎస్‌ఎస్‌సీ బోర్డ్ విడుదల చేసింది. దీంతో ప్రతి సబ్జెక్ట్‌లోనూ.. రెండు పేపర్లకు బదులు.. ఒకే పేపర్‌లో పరీక్ష రాసేందుకు సన్నద్ధమవ్వాల్సి ఉంటుంది. విద్యార్థులు మారిన కొత్త విధానానికి అనుగుణంగా పాఠ్యాంశాల అధ్యయనం సాగించాలని సబ్జెక్ట్ టీచర్లు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో...ఏపీలో తాజాగా మారిన పదో తరగతి పరీక్షల విధానం, పరీక్షల స్వరూపం, సబ్జెక్టుల వారీగా సన్నద్ధమవ్వాల్సిన తీరు తదితర అంశాలపై విశ్లేషణ...

3:15 గంటలు.. 100 మార్కులు

రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల విషయంలో మారిన నిబంధనల ప్రకారం– ప్రతి సబ్జెక్ట్‌లోనూ పేపర్-1,2 కలిపే నిర్వహించనున్నారు. సైన్స్ సబ్జెక్ట్‌ను పార్ట్-ఎ, పార్ట్-బిలుగా వర్గీకరించారు. పార్ట్-ఎలో భౌతికరసాయన శాస్త్రం, పార్ట్-బిలో జీవ శాస్త్రం సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం వంద మార్కులకు 3:15 గంటల వ్యవధిలో పరీక్ష జరగనుంది. పరీక్ష వ్యవధిలో.. ప్రశ్న పత్రాన్ని చదివి అర్థం చేసుకునేందుకు 15 నిమిషాల సమయం కల్పిస్తారు.

బ్లూ ప్రింట్, మోడల్ పేపర్స్ విడుదల

పదో తరగతి పరీక్షలను ఆరు పేపర్లుగా నిర్వహించాలనే నిర్ణయం నేపథ్యంలో.. ఏపీ ఎస్‌ఎస్‌సీ బోర్డ్.. విద్యార్థుల సౌలభ్యం కోసం సబ్జెక్ట్ వారీగా సిలబస్, బ్లూ ప్రింట్, మోడల్ కొశ్చన్ పేపర్స్‌ను సైతం వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. ఫలితంగా విద్యార్థులు వాటిని పరిశీలించి.. ఆయా సబ్జెక్ట్‌లు, చాప్టర్లకు ఇచ్చిన వెయిటేజీని గుర్తించి దానికి అనుగుణంగా ప్రిపరేషన్ సాగించే అవకాశం లభిస్తుంది.

ఒత్తిడి తగ్గించడమే ప్రధాన ఉద్దేశం

పదో తరగతి పరీక్షలను ఆరు పేపర్లుగానే నిర్వహించాలనే నిర్ణయానికి ప్రధాన ఉద్దేశం.. విద్యార్థులకు ఒత్తిడి తగ్గించడమే అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతి సబ్జెక్ట్‌లో రెండు పేపర్ల విధానంలో పరీక్షల సమయం సమీపించినప్పుడు ఒత్తిడికి గురవుతున్నారని, అదే విధంగా ఒక పేపర్‌లో సరిగా సమాధానాలు ఇవ్వకపోతే ఆ ప్రతికూల ప్రభావం మరో పేపర్‌లో పరీక్ష ప్రదర్శనపై పడుతోందని అంటున్నారు. ఒకే పేపర్‌గా పరీక్ష నిర్వహించడం వల్ల విద్యార్థులు 'రెండు పేపర్లు' అనే ఆందోళన నుంచి విముక్తి లభిస్తుంది. తద్వారా సదరు సబ్జెక్ట్‌పై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు.

మ్యాథమెటిక్స్ ఇలా

మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్‌లో మొత్తం నాలుగు విభాగాలుగా 33 ప్రశ్నలు అడుగుతారు. మొదటి విభాగంలో ఒక మార్కు ప్రశ్నలు 12(12 మార్కులు), రెండో విభాగంలో రెండు మార్కుల ప్రశ్నలు 8(16 మార్కులు), మూడో విభాగంలో నాలుగు మార్కుల ప్రశ్నలు 8(32 మార్కులు), నాలుగో విభాగంలో 8 మార్కుల ప్రశ్నలు 5 (40 మార్కులు) ఉంటాయి. నాలుగో విభాగంలోని ఎనిమిది మార్కుల ప్రశ్నలకు ఇంటర్నల్ ఛాయిస్ విధానం ఉంది.

సోషల్ పేపర్

సోషల్ పేపర్ కూడా మ్యాథమెటిక్స్ పేపర్ మాదిరిగానే 4 విభాగాలుగా ఉంటుంది. మార్కుల కేటాయింపు కూడా అదే తీరులో జరుగుతుంది.

జనరల్ సైన్స్

- జనరల్ సైన్స్‌ను పార్ట్-ఎ, పార్ట్-బిలుగా పేర్కొన్నారు. పార్ట్-ఎలో భౌతిక రసాయన శాస్త్రం నుంచి, పార్ట్-బిలో జీవ శాస్త్రం నుంచి నాలుగు విభాగాల చొప్పున ప్రశ్నలు అడుగుతారు.
- పార్ట్-ఎలో మొదటి విభాగంలో ఒక మార్కు ప్రశ్నలు 6 (6 మార్కులు), రెండో విభాగంలో 2 మార్కుల ప్రశ్నలు 4 (8 మార్కులు), మూడో విభాగంలో 4 మార్కుల ప్రశ్నలు 3 (12 మార్కులు), నాలుగో విభాగంలో 8 మార్కుల ప్రశ్నలు 3 (24 మార్కులు) ఉంటాయి.
- పార్ట్-బిలో మొదటి విభాగంలో ఒక మార్కు ప్రశ్నలు 6 (6 మార్కులు), రెండో విభాగంలో రెండు మార్కుల ప్రశ్నలు 4 (8 మార్కులు), మూడో విభాగంలో నాలుగు మార్కుల ప్రశ్నలు 5 (20 మార్కులు), నాలుగో విభాగంలో ఎనిమిది మార్కుల ప్రశ్నలు 2 (16 మార్కులు) ఉంటాయి.

ఇంగ్లిష్ మూడు భాగాలుగా

- ఇంగ్లిష్ ప్రశ్న పత్రం మూడు భాగాలుగా 35 ప్రశ్నలతో ఉంటుంది. పార్ట్-ఎలో రీడింగ్ కాంప్రహెన్షన్‌లో రెండు మార్కుల ప్రశ్నలు 5 (10 మార్కులు), పద్యంలో రెండు మార్కుల ప్రశ్నలు మూడు (6 మార్కులు), మరో ప్యాసేజ్‌లో రెండు మార్కుల ప్రశ్నలు రెండు (4 మార్కులు) అడుగుతారు. దీంతోపాటు పోస్టర్ ఆధారిత ప్రశ్నలు అయిదు అడుగుతారు. వీటికి 10 మార్కులు.
- సెక్షన్-బి నుంచి గ్రామర్, వొకాబ్యులరీపై 40 మార్కులకు 1/4 మార్కు, 1/2 మార్కు, 1 మార్కు, 2 మార్కుల ప్రశ్నలు అడుగుతారు.
- సెక్షన్-సి నుంచి సృజనాత్మక వ్యక్తీకరణ కింద పది మార్కుల ప్రశ్నలు 3 (30 మార్కులు) అడుగుతారు.

తెలుగు.. పద్య,గద్య భాగాలు, వ్యాకరణం

- తెలుగు సబ్జెక్ట్‌లో..పద్య,గద్య భాగాలతోపాటు వ్యాకరణం నుంచి ప్రశ్నలు అడుగుతారు. తెలుగు పేపర్‌ను మొత్తం 3 భాగాలుగా పేర్కొన్నారు.
- మొదటి భాగంలో ఒక పద్యానికి ప్రతిపదార్థం (8 మార్కులు), పద్య పూరణ(8 మార్కులు), మరో 8 మార్కులకు వాక్యాల అమరిక ప్రశ్నలు అడుగుతారు. అదే విధంగా అపరిచిత గద్యం నుంచి 8 మార్కుల ప్రశ్న ఉంటుంది.
- రెండో విభాగంలో వ్యక్తీకరణ, సృజనాత్మకతకు చెందిన ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 36 మార్కులకు ఉండే ఈ విభాగంలో 4 మార్కుల ప్రశ్నలు 3(12 మార్కులు), 8 మార్కుల ప్రశ్నలు 3 (24 మార్కులు) ఉంటాయి.
- మూడో విభాగంలో భాషాంశాలకు సంబంధించి 1 మార్కు ప్రశ్నలు, రెండు మార్కుల ప్రశ్నలు అన్ని కలిపి 32 మార్కులకు స్వల్ప సమాధాన ప్రశ్నలు, బహుళైచ్ఛిక ప్రశ్నలు అడుగుతారు.

ఆ మూడు సబ్జెక్ట్‌లు కీలకం

విద్యార్థులు ప్రిపరేషన్ క్రమంలో ప్రధానంగా మూడు సబ్జెక్ట్‌లు కీలకంగా నిలవనున్నాయి. అవి మ్యాథమెటిక్స్, జనరల్ సైన్స్, సోషల్. వీటిలో రాణించడానికి సబ్జెక్ట్ నిపుణుల సలహాలు..

మ్యాథమెటిక్స్

ఎస్‌ఎస్‌సీ బోర్డ్ బ్లూ ప్రింట్ ప్రకారం 14 చాప్టర్లు ఉన్న మ్యాథమెటిక్స్‌లో ప్రతి చాప్టర్‌లో సిలబస్‌కు అనుగుణంగా పూర్తిగా అధ్యయనం చేయాలి. ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేయడంతోపాటు కారణాల నిరూపణ, వ్యక్తీకరణ, ఒక సమస్యను ఇతర అంశాలతో అనుసంధానం చేయడం వంటి నైపుణ్యాలు పొందాలి. ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే.. రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది. టెక్స్ట్ బుక్‌లో ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, నిర్మాణాత్మక సమస్యలకు సమాధానాలు కనుగొనేందుకు ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి.

–వై.వనంరాజు

జనరల్ సైన్స్.. పీఎస్

ఫిజికల్ సైన్స్‌లో మంచి మార్కులు సాధించాలంటే.. అప్లికేషన్ అప్రోచ్‌తో చదవడం ఎంతో ముఖ్యం. ఆయా చాప్టర్లకు సంబంధించిన అంశాలను నిజజీవిత సంఘటనలతో అన్వయించుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. విషయ అవగాహనతో పాటు, ప్రశ్నించడం–పరికల్పన చేయడం; ప్రయోగాలు–క్షేత్ర పర్యటనలు; సమాచార నైపుణ్యాలు–ప్రాజెక్ట్ పనులు; పటాలు–వాటి ద్వారా భావ ప్రసారం, వంటి వాటిపైనా కృషి చేయాలి. ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇచ్చే సంసిద్ధత లభించి మంచి మార్కులు సొంతమవుతాయి.

జీవశాస్త్రం

జీవశాస్త్రం సబ్జెక్ట్‌లోనూ అవగాహన, సొంత విశ్లేషణ నైపుణ్యాలు కీలకంగా మారుతున్నాయి. ఇందుకోసం ఫ్లో చార్ట్‌లు, బ్లాక్ డయాగ్రమ్స్‌లను సొంతంగా రూపొందించుకోవాలి. విశ్లేషణాత్మక, తులనాత్మక అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. నేర్చుకున్న అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయించే విధంగా చదవాలి. ప్రయోగాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన పొందడం ఎంతో మేలు చేస్తుంది. ఆయా అంశాలకు సంబంధించి చాప్టర్‌లో పేర్కొన్న అభ్యాసాలకు సంబంధించి విశ్లేషణ, కారణాలు, పోలికలు, బేధాలు తెలుసుకుంటూ చదవాలి. డయాగ్రమ్స్ విషయంలో భాగాలను గుర్తించడమే కాకుండా.. వాటి ప్రాముఖ్యతను వర్ణించగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

–పి.నీలకంఠం

సోషల్ స్టడీస్

సోషల్ స్టడీస్‌లో మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులు సమకాలీన అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. టెక్స్ట్ బుక్‌లో ఒక అంశం గురించి ఉంటే.. దానికి సంబంధించి మన నిజ జీవితంలో జరుగుతున్న సంఘటనలతో పోల్చుకుంటూ చదవడం ఎంతో లాభిస్తుంది. అంతేకాకుండా సమకాలీన అంశాల విషయంలో ప్రతిస్పందన, ప్రశ్నించడం, ప్రశంస/అభినందనలపై సాధన చేయడం ఎంతో అవసరం. అవగాహనకు సంబంధించి ఒక నిర్దిష్ట అంశాన్ని చదివి, సొంత పరిజ్ఞానంతో రాసే విధంగా నైపుణ్యం పెంచుకోవాలి.

–వి.సురేశ్ కుమార్, ఎస్‌ఏ–సోషల్ స్టడీస్

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐఎస్ఈఆర్, భోపాల్‌లో పీహెచ్‌డీ ప్రవేశాలు

భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్).. 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు

- దేశంలోని విద్యార్థులకు బయోలాజికల్ సైన్సెస్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎర్త్ అండ్ ఇన్విరాన్‌మెంటల్ సైన్స్, ఎకనామిక్ సైన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నారు.
- అంతర్జాతీయ విద్యార్థులకు కెమిస్ట్రీ, డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎర్త్ అండ్ ఇన్విరాన్‌మెంటల్ సైన్స్, బయోలాజికల్ సైన్సెస్, కెమికల్ ఇంజనీరింగ్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, సోషల్ ఆంత్రపాలజీ, ఎకనామిక్ సైన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్ తదితరాల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు.
- దరఖాస్తులకు చివరితేది: 24.10.2022
- వెబ్‌సైట్: www.iiserb.ac.in

ఐఐఎస్ఈఆర్, తిరుపతిలో రీసెర్చ్ అసోసియేట్ పోస్టులు

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్).. ఒప్పంద ప్రాతిపదికన రీసెర్చ్ అసోసియేట్(ఆర్ఏ/పీడీఎఫ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 01
- అర్హత: పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. సింథటిక్ ఆర్గానిక్/ఇనార్గానిక్ కెమిస్ట్రీ/మెటీరియల్ కెమిస్ట్రీ/ఎలక్ట్రోకెమిస్ట్రీ/పాలిమర్ కెమిస్ట్రీలో అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.
- ఫెలోషిప్: నెలకు రూ.40,000 చెల్లిస్తారు.
- వయసు: 35 ఏళ్లు మించకూడదు.
- దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా.
- ఈమెయిల్: eb.raman@labs.iisertirupati.ac.in
- దరఖాస్తులకు చివరితేది: 10.10.2022
- వెబ్‌సైట్: iisertirupati.ac.in

బీసీసీఎల్‌లో 41 సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్ పోస్టులు

కోల్ ఇండియా లిమిటెడ్(సీఐఎల్).. భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్(బీసీసీఎల్)లో మెడికల్ స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 41
- పోస్టుల వివరాలు: సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్ (ఈ-4)/మెడికల్ స్పెషలిస్ట్ (ఈ-3)–28, సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఈ-3)–13.

సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్(ఈ-4)

- విభాగాలు: సర్జన్, జనరల్ ఫిజిషియన్, ఆర్థోపెడిక్, పీడియాట్రీషియన్, సైకియాట్రిస్ట్, పాథాలజిస్ట్, డెర్మటాలజిస్ట్, పల్మోనాలజిస్ట్/చెస్ట్ స్పెషలిస్ట్, ఆప్తాల్మాలజిస్ట్, ఈఎన్‌టీ, రేడియాలజిస్ట్.
- అర్హత: ఎంబీబీఎస్, పీజీ, డీఎన్‌బీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
- వయసు: 31.08.2022 నాటికి ఎస్‌ఎంఎస్ పోస్టులకు 42 ఏళ్లు, ఎస్‌ఎంఓ ఖాళీలకు 35 ఏళ్లు మించకూడదు.
- ఎంపికవిధానం: పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు ప్రారంభ తేది: 30.09.2022
- దరఖాస్తులకు చివరి తేది: 29.10.2022
- వెబ్‌సైట్: www.bcclweb.in

నిమ్‌హాన్స్, బెంగళూరులో పీహెచ్‌డీలో ప్రవేశాలు

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్.. 2022–23 విద్యా సంవత్సరంలో సెషన్ 2 కింద వివిధ కోర్సుల్లో పీహెచ్‌డీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

- విభాగాలు: బయోఫిజిక్స్, బయోస్టాటిస్టిక్స్, చైల్డ్–అడోలసెంట్ సైకియాట్రీ, క్లినికల్ సైకాలజీ, క్లినికల్ సైకోఫార్మకాలజీ–న్యూరోటాక్సికాలజీ, హ్యూమన్ జెనెటిక్స్, మెంటల్ హెల్త్ ఎడ్యుకేషన్, న్యూరోకెమిస్ట్రీ, న్యూరోఇమేజింగ్–ఇంటర్వెన్షనల్ రేడియాలజీ, న్యూరాలజీ, న్యూరోలాజికల్ రిహాబిలిటేషన్ న్యూరో మైక్రోబయాలజీ, న్యూరో పాథాలజీ, న్యూరో ఫిజియాలజీ, నర్సింగ్, సైకియాట్రీ తదితరాలు.

పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ కోర్సులు

- విభాగాలు: ఎపిలెప్సీ, మూవ్‌మెంట్ డిజార్డర్స్, న్యూరోమస్కులర్ డిజార్డర్స్.
- అర్హత:బీఈ, బీటెక్, ఎంబీబీఎస్, ఎంఫిల్, మాస్టర్స్ డిగ్రీ, ఎండీ, డీఎన్‌బీ, ఎంఈ, ఎంటెక్.
- కోర్సు వ్యవధి: 3 నుంచి 5 ఏళ్లు ఉండాలి.
- వయసు: 40 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక విధానం: ప్రవేశపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది డీన్–కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్, నిమ్‌హాన్స్, హోసూర్ రోడ్డు, బెంగళూరు చిరునామకు పంపించాలి.
- దరఖాస్తులకు చివరితేది: 22.10.2022
- ప్రవేశపరీక్ష తేది: 24.11.2022
- వెబ్‌సైట్: http://www.nimhans.ac.in

నేడు ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశానికి సంబంధించిన అర్హులైన అభ్యర్థుల జాబితాను గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేస్తారని చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలో ఉదయం 10.30 గంటలకు ఫలితాలను విడుదల చేస్తారని పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీలో ప్రవేశాల కోసం 44,208 దరఖాస్తులొచ్చాయని, ఈ నెల 19 వరకు



నూజివీడులో సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అక్టోబర్ 12 నుంచి 15 వరకు కౌన్సెలింగ్ నిర్వహించి, 17 నుంచి తరగతులు ప్రారంభిస్తామని వివరించారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన

రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ పరిధిలోని 4 ట్రిపుల్ ఐటీలకు నిర్వహిస్తున్న అడ్మిషన్లలో భాగంగా స్థానిక ట్రిపుల్ ఐటీలో బుధవారం పలు కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను నిర్వహించారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్, వికలాంగుల, సైనిక ఉద్యోగుల పిల్లల కోటాలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను అధికారులు పరిశీలించారు. 30వ తేదీ వరకు పరిశీలన కొనసాగనుంది.

మరింత మెరుగ్గా 108, 104 సేవలు

సాక్షి, అమరావతి: 108 అంబులెన్సులు, 104 మొబైల్ మెడికల్ యూనిట్(ఎంఎంయూ)ల సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించాలని అధికారులను వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు ఆదేశించారు. బుధవారం మంగళగిరిలోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో 108, 104ల పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. టెండర్ అగ్రిమెంట్ ప్రకారం సేవలందించడం లేదంటూ ఐటీ విభాగంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. 108 అంబులెన్సులలో జీపీఎస్ సౌకర్యంపై ఆరా తీశారు. వాహనాల మరమ్మతుల విషయంలో జాప్యం చేయొద్దని స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో వాహనాల బఫర్ స్టాక్ తప్పనిసరిగా ఉంచాలన్నారు. రెండు వారాల్లో సేవలు మెరుగుపడకపోతే కఠిన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్ డేటా సైన్స్ హ్యాక్‌థాన్ విజేతల ఎంపిక

15 కాన్సెప్ట్‌ల నుంచి మూడు ఎంపిక

సాక్షి, అమరావతి: అడ్వాన్స్ డేటా సైన్స్ విభాగంలో నిర్వహించిన హ్యాక్‌థాన్‌లో ఎంపికైన విజేతల ఆలోచనలను స్టార్టప్‌లుగా మార్చే విధంగా పూర్తిస్థాయి మద్దతు ఇవ్వనున్నట్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ప్రకటించింది. ఇండో యూరో సింక్రనైజేషన్ (ఐఈఎస్)తో కలిపి ఏపీఎస్ఎస్‌డీసీ అడ్వాన్స్ డేటా సైన్స్‌లో నిర్వహించిన హ్యాక్‌థాన్ విజేతలను ప్రకటించింది. 15 మంది పోటీ పడగా లకిరెడ్డి బాలిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ బృందం తొలి బహుమతిని గెలుచుకుంది. ద్వితీయ బహుమతిని ఆచార్య ఎన్జీరంగా వర్సిటీ, నూజివీడుకు చెందిన రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్‌అండ్ టెక్నాలజీ మూడో బహుమతిని దక్కించుకుంది. బుధవారం ఏపీఎస్ఎస్‌డీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ సలహాదారు చల్లా మధుసూదన్ రెడ్డి, ఛైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, ఎండీ ఎస్.సత్యనారాయణ, ఐఈఎస్ సీఈవో రాజ్ వంగపండు బహుమతులను ప్రదానం చేశారు. చల్లా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎంపికైన సభ్యులు దేశంలోని వివిధ ఇంక్యుబేషన్ సెంటర్లతో కలిసి పనిచేసే అవకాశం లభిస్తుందన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.